www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పేజీలు: 8 + 4

గురువారం | 9-4-2020 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 355

| వరల్డోమీటర్ ప్రకారం బుధవారం రాత్రి 11:30 గంటలకు | మొత్తం కేసులు | కొత్త కేసులు | మొత్తం మృతులు | ఒక్కరోజులో మృతులు |
|---|---|---|---|---|
| ప్రపంచం | 14,90,961 | 60,042 | 87,396 | 5,362 |
| భారతదేశం | 5,749 | 398 | 178 | 18 |
| ఆంధ్రప్రదేశ్ | 348 | 34 | 5 | 1 |
| తెలంగాణ | 453 | 49 | 11 | - |
| అమెరికా | 4,18,044 | 17,709 | 14,214 | 1,373 |
| స్పెయిన్ | 1,46,690 | 4,748 | 14,673 | 628 |
| ఇటలీ | 1,39,422 | 3,836 | 17,699 | 542 |



శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: విదియ రా. 12.39 వరకు తదుపరి తదియ; నక్షత్రం: స్వాతి రా. 12.16 తదుపరి విశాఖ; వర్జ్యం: ఉ. 8.00-9.24, తె. 5.19 మొదలు; దుర్ముహూర్తం: ఉ. 10.14-11.03, మ. 3.10-3.59; అమృతఘడియలు: సా. 4.29-5.54; రాహుకాలం: మ. 1.30-3.00; సూర్యోదయం: 6.08; సూర్యాస్తమయం: 6.27

విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore



## వైద్యులే మన పోరాటయోధులు

### సరిపడా పీపీఈలు ఉండేలా చూడండి

వైద్యసిబ్బందిని కాపాడండి.. కరోనా టెస్టుల ఫీజుల్ని కట్టడి చేయాలి

ఆ సొమ్ము రీయింబర్స్ చేయాలి.. కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు

ఉచితంగా కరోనా టెస్టులు

ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు రెండింట్లోనూ

కేంద్రానికి సుప్రీం కోర్టు ఆదేశం

8



జిలిన్ ప్రావిన్స్‌కు తిరిగి వెళ్తూ వుహాన్ ఎయిర్‌పోర్టులో సహచరులను ఆలింగనం చేసుకుంటున్న దృశ్యం

ఎన్నాళ్లో వేచిన

## వూహాన్!

రెండున్నర నెలల తర్వాత స్వేచ్ఛ

లాక్‌డౌన్ ఎత్తివేతతో సందడి

రవాణా పునరుద్ధరణ





అఖిలపక్ష నేతలతో ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్

# లాక్‌డౌన్ 14న ఎత్తేయం!

సీఎంలతో మాట్లాడి తేదీ నిర్ణయిస్తాం

అఖిలపక్షానికి చెప్పిన ప్రధాని మోదీ

దేశంలో సామాజిక ఎమర్జెన్సీ ఉంది

కేంద్రానికి రాష్ట్రాల సహకారం అద్భుతం

కరోనాపై సమైక్య పోరు శుభ పరిణామం

వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని వ్యాఖ్యలు

2

"కరోనా ముందు, ఆ తర్వాత జీవితం ఒకే మాదిరిగా ఉండవు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పని సంస్కృతిలో మార్పు రావాలి. మానవ జాతి గతంలో ఎన్నడూ ఎరగని సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొంటోంది. అంతా కలిసికట్టుగా పోరాడటమే మార్గం"

- ప్రధాని నరేంద్ర మోదీ

హనుమలా.. జీసస్‌లా..

**కలిసి సంక్షోభాన్ని ఎదుర్కొందాం**

ప్రధాని మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడి లేఖ

మోదీ గొప్పవారు.. మంచివారు: ట్రంప్

క్లోరోక్విన్‌పై ఆంక్షల ఎత్తివేతకు కితాబు

8

నిత్యావసరాలను బ్లాక్ చేస్తే..

### ఏడేళ్లు జైలు శిక్ష

ఈసీ చట్టాన్ని కఠినంగా అమలు చేయండి

కృత్రిమ కొరతకు తావు లేకుండా చూడండి

రాష్ట్రాలకు కేంద్ర హోంశాఖ ఆదేశాలు

# కరోనా వార్!

## ప్రైవేటు డాక్టర్లు X ప్రభుత్వం

- కర్నూలు జిల్లాలో విచిత్రమైన పరిస్థితి
- చికిత్సలకు ప్రభుత్వ వైద్యులు దూరం
- మొత్తం భారం 'ప్రైవేటు' వైద్యులపైనే
- ఎస్మా కింద అనేకమందికి నోటీసులు
- పీపీఈ, మాస్కులు లేకుండా వైద్యమా?
- ససేమిరా అంటున్న ప్రైవేటు డాక్టర్లు
- తొలి ప్రాధాన్యం జీజీహెచ్‌కే ఇవ్వాలి
- ప్రభుత్వ సిబ్బందికి విధులు అప్పగించాలి
- అప్పుడే మేమూ సేవలు అందిస్తాం
- కాదంటే అరెస్టులకూ సిద్ధమేనని తీర్మానం!

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

కరోనా బాధితులకు చికిత్స అందించడంపై కర్నూలు జిల్లాలో ప్రైవేటు వైద్యులు, ప్రభుత్వానికీ మధ్య పెను వివాదం నడుస్తోంది. వైద్యం చేయకుంటే 'ఎస్మా' కింద చర్యలు తప్పవని అధికార యంత్రాంగం సంకేతాలు పంపిస్తుండగా.... 'అరెస్టులు చేసినా సరే, తగిన రక్షణ వ్యవస్థ లేకుండా చికిత్స అందించేది లేదు' అని ప్రైవేటు డాక్టర్లు తేల్చిచెబుతున్నారు. అసలు ఎందుకీ వివాదం! కర్నూలు జిల్లాలో ఎంతో పేరు పొందిన ప్రభుత్వ ఆస్పత్రి, అందులో పెద్ద సంఖ్యలో డాక్టర్లు ఉండగా ప్రైవేటు వైద్యులను బతిమలాడటం, బెదిరించడం ఎందుకు? అనే సందేహం వచ్చింది కదూ! అక్కడికే వస్తున్నాం! రాష్ట్రవ్యాప్తంగా

మిగతా 7వ పేజీలో...



నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజీలో ఏర్పాటు చేసిన కరోనా వార్డు

మూడో దశ

### ఇంటింటి సర్వే!

పకడ్బందీగా చేయాలని సీఎం ఆదేశం

అధీనంలోకి ప్రైవేటు ఆసుపత్రులు

వైద్యులు, సిబ్బందికి జాబ్ చార్ట్

కరోనా కిట్లు.. వెంటిలేటర్ తయారీ కేంద్రంగా రాష్ట్రం

ఉన్నతాధికారులతో జగన్ సమీక్ష



7

### నర్సీపట్నం డాక్టర్ సుధాకర్ సస్పెన్షన్

'కరోనా' వైద్యులకు తగిన పరికరాల్లేవన్న ఫలితం!

పోలీసు కేసు కూడా నమోదు

## నలుగురు వైద్యసిబ్బందికి వైరస్

### అనంతలో నమోదు.. ఒక్కరోజులోనే 34 కేసులు

ఆస్పత్రుల్లో కోలుకుంటున్నవారు 348 మంది

గుంటూరులో 9, అనంతలో 7, కృష్ణాలో 6

నెల్లూరులో 5, చిత్తూరు, ప్రకాశంలలో 3 చొప్పున

కర్నూలులో ఒక పాజిటివ్‌తో 75కు చేరిన కేసులు

రాష్ట్రంలో ఐదుకు చేరిన కరోనా మృతులు

### గంటలోపే వైరస్ నిర్ధారణ

అందుబాటులోకి వచ్చిన మన కిట్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రంలో కరోనా ఉధృతి ఊపందుకుంది. బుధవారం ఒక్కరోజే 34 కేసులు నమోదయ్యాయి. మొత్తం ఎనిమిది జిల్లాల్లో కేసులు నమోదు కావడం వైరస్ వ్యాప్తి తీవ్రతకు నిదర్శనంగా భావిస్తున్నారు. ఆస్పత్రుల్లో మొత్తం కోలుకుంటున్నవారి సంఖ్య 348కి చేరింది. తాజాగా గుంటూరులో 9, అనంతపురం జిల్లాలో 7, కృష్ణాజిల్లాలో 6, నెల్లూరులో 5, చిత్తూరు, ప్రకాశం జిల్లాల్లో మూడు చొప్పున, కర్నూలు జిల్లాలో

మిగతా 7వ పేజీలో...



పందేరానికి

## సిద్ధం!

### కాంట్రాక్టర్లకు రూ.300 కోట్లు

అడ్వాన్సుల రూపంలో చెల్లింపు?.. టిడ్కోలో అంతా రెడీ

లాక్‌డౌన్‌లోనూ అధికారులను రప్పించిన వైనం

పెండింగ్ బిల్లులు వదిలి పనులు చేయని వారికి పైసలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కరోనా సందట్లో 'పందేరాల' సడేమియాకు తెరలేపారు. మొబిలైజేషన్ అడ్వాన్స్ పేరిట అస్మదీయ కంపెనీలకు రూ.300 కోట్లు కట్టబెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. అది కూడా ఆగమేఘాలమీద అగ్రిమెంట్లు పూర్తిచేసి! 'టిడ్కో'లో జరుగుతున్న చిత్రమిది. ఒకవైపు... కరోనాతో ఆదాయం

మిగతా 3వ పేజీలో...

'విభజన' తేలేదాకా ఉద్యోగులకు

## వేతనాలివ్వండి

తెలుగు రాష్ట్రాల విద్యుత్తు సంస్థలకు సుప్రీం ఆదేశం

ధర్మాధికారి పిటిషన్‌పై మధ్యంతర ఉత్తర్వు జారీ

3

# హాట్ స్పాట్ల దిగ్బంధం

## యూపీలోని 15 జిల్లాల్లో 30 వరకు కఠిన ఆంక్షలు

- దేశంలో 24 గంటల్లో 773 కేసులు
- 149కి పెరిగిన మరణాల సంఖ్య
- మధ్యప్రదేశ్‌లో తబ్లీగీ వెళ్లొచ్చిన వ్యక్తి కుటుంబంలో 8 మందికి సోకిన కరోనా
- బాధితుల్లో ముగ్గురు మైనర్లు, తల్లి మృతి
- ముంబైలో సగం కేసులు 4 వార్డుల్లోనే

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: దేశంలో కరోనా కేసుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. ఉత్తరప్రదేశ్‌లో పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. రాష్ట్రంలోని 15 జిల్లాల్లో హాట్ స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాలను ఈనెల 30 వరకు పూర్తిగా దిగ్బంధించాలని ఆ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమయంలో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకూడదు. హోం డెలివరీని మాత్రమే అనుమతిస్తారు. ఆగ్రా, లఖ్‌నవు, గౌతమ్ బుద్ధ నగర్, కాన్పూర్, వారాణసీ, షామిల్, మీరట్, బరేలీ, బులంద్‌షహర్ తదితర జిల్లాల్లో కొవిడ్-19 బాధితులు ఎక్కువగా ఉన్నారు. దేశంలో మంగళవారం

మిగతా 8వ పేజీలో...



మహారాష్ట్రలో పోలీసులకు కూడా డాక్టర్లు ఆస్పత్రుల్లో ఉపయోగించే వ్యక్తిగత రక్షణ పరికరాలు(పీపీఈ), మాస్కులు, శానిటైజర్లను అందజేశారు. వాటిని ధరించి రోడ్లపై విధులు నిర్వహిస్తున్న పోలీసులు

చైనా మృతులకు

## డబుల్

న్యూయార్క్‌లో శవాల గుట్టలు

6,268కు చేరిన మృతుల సంఖ్య

ఒక్క రోజులోనే 779 మంది మృతి

అంత్యక్రియలకు పది రోజుల నిరీక్షణ

నాడు ఉగ్రదాడిలో ఈ నగరంలో 2,753 మంది దాకా మృత్యువాత

యూరప్‌లో కేసులు 7.50 లక్షలు

నిలకడగా బ్రిటన్ ప్రధాని ఆరోగ్యం

న్యూయార్క్, ఏప్రిల్ 8: అప్పుడు అల్‌కాయిదా కన్నీరు పెట్టించింది. ఇప్పుడు... కరోనా కలకలం సృష్టిస్తోంది. అమెరికా వాణిజ్య రాజధాని న్యూయార్క్ నగరం విలవిలలాడుతోంది. 'సెప్టెంబరు 11' దాడి తర్వాత న్యూయార్క్‌ను పెను విషాదం చుట్టుముట్టింది. కరోనా మరణాల తీవ్రత 'ఉగ్ర' విలయాన్నీ

మిగతా 8వ పేజీలో...



2

### ట్విటర్ సీఈవో

### 7,600 కోట్ల విరాళం

కరోనా నివారణ చర్యలకు మద్దతు

తెలంగాణ

### కొత్త కేసులు 49

మొత్తం పాజిటివ్‌లు 453

8

ఎంసెట్

## వాయిదా!

లాక్‌డౌన్‌పై స్పష్టత రాగానే కొత్త షెడ్యూల్

3

### అర్చకులకు

### 5 వేల సాయం: మంత్రి



పరంజ్యోతి

## మనిషి పాటించాల్సిన శాశ్వత ధర్మాలు

*కబీరా గర్వ్ న కీ జియే, ఊంచాదేఖి ఆవాస్*
*కాల్ పడో భూ లేటనా, ఊపర్ జంపీ ఘాస్*

"ఎంతో ధనం వెచ్చించి అందమైన ఇల్లు కట్టుకున్నాను అని గర్వపడే ఓ మనిషీ, ఏదో ఓ రోజు నువ్వు కట్టుకున్న ఇల్లు కుప్పకూలి మట్టిలో కలిసి పోతుందనే పరమ సత్యాన్ని తెలుసుకో!" అంటారు మహాత్మా కబీరు. ఒక రోజు ఆయన ఒక ఊరిలో ఉండగా.. ఆ ఊరి ధనవంతుడు తన కొత్త ఇంటికి ఊరందరినీ పిలిచి భోజనాలు పెట్టాడు. కబీరు కూడా అక్కడికి వెళ్లారు. ఆ ఇంటి యజమాని అందరికీ నమస్కరించి.. "నేనెంతో ధనాన్ని వెచ్చించి ఈ ఇల్లు కట్టుకున్నాను. మీరంతా నా ఇంటిని నిశితంగా పరీక్షించి ఏవైనా దోషాలుంటే నిర్భయంగా చెప్పండి. సరిచేసుకోవడానికి ఎంత డబ్బయినా వెనుకాడను" అంటాడు. వచ్చిన వాళ్లల్లో కొందరు వాస్తు పండితులు కూడా ఉన్నారు. ఇంట్లోని ప్రతి భాగాన్నీ వాస్తుపరంగా చూసి ఏ దోషం లేదని చెప్పారు. కానీ, అక్కడే ఉన్న కబీరు దాసు మాత్రం.. "ఓ యజమానీ, ఇందులో నాకు రెండు దోషాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నీవు చెప్పమంటే చెబుతాను" అన్నాడు. "అయ్యా, ఆ దోషాలేమిటో నిర్మొహమాటంగా చెప్పి సరిచేసుకునే అవకాశం కల్పించండి" అన్నాడు యజమాని. అప్పుడు కబీరు.. "ఒకటి.. ఈ ఇల్లు ఎంతకాలం ఇలాగే ఉంటుందో తెలుసా?" అని ప్రశ్నించాడు. తెలియదని తల ఊపాడు యజమాని. "ఇక రెండోది, ఈ ఇల్లు ఉన్నంత కాలం నువ్వుంటావా?" అని అడిగాడు కబీరు. ఆ మాట విని యజమాని తెల్లబోయాడు. అప్పుడు కబీరు "ఈ సంపదలన్నీ అశాశ్వతాలు. ఆత్మ, అందులోని భగవంతుడు మాత్రమే శాశ్వతం. ఈ విషయం తెలుసుకొని మొదట నిన్ను నీవు సరిదిద్దుకో! అప్పుడే నీవు తరిస్తావు. ఈ జన్మకున్న అర్థమేమిటో తెలుసుకుంటావు. మానవులంతా గొర్రెల వలెనే ప్రవర్తిస్తూ.. పుట్టడం గిట్టడం కోసమే అనుకుంటారు తప్ప.. పుట్టడం గిట్టడం మధ్య ఉన్న జీవితాన్ని ఎలా గడపాలో ఆలోచించరు" అని చెప్పి అందరితో కలిసి భోంచేసి అక్కడి నుండి వెళ్లి పోయాడు కబీరు. మనం చేసే ఏ పనైనా ఇతరులకు ఉపయోగపడేదిగా శాశ్వతంగా ఉండాలని కబీరు అభిప్రాయం.



ఆయనే కాదు.. వివేకానందుడూ అదే చెప్పారు. ఎంతటి సంపన్నుడైనా సమాజానికి ఉపయోగపడని వాడు అధర్మపరుడు, నిత్యదరిద్రుడు అని స్వామి వివేకానందుడు చెప్పేవారు.

రామాయణ భారత భాగవతాలు, పురాణేతిహాసాలు మానవుణ్ని తీర్చిదిద్దడానికి, మానవత్వాన్ని మేలుకొలపడానికి ఎన్నో కథలు చెప్పాయి. వాటిల్లో చెప్పబడినవన్నీ ధర్మ సూత్రాలే! వాటన్నింటిసారాన్ని గ్రహించి మానవుడు.. 'నేను, నాది' అనే స్వార్థానికి స్వస్తి పలకాలి. అహంభావంతో ఇతరులను బాధించకుండా ప్రవర్తించాలి. అర్హులకు దాన ధర్మాలు చేయాలి. సౌభ్రాతృత్వం కనబరుస్తూ అందరిలో కలిసిపోవాలి. ప్రేమను ఆలంబనగా చేసుకొని ఈర్ష్యాద్వేషాలకు దూరంగా ఉండాలి. భగవంతుని దృష్టిలో అన్నీ సమానమే అనే భావంతో సర్వప్రాణుల పట్ల దయ కలిగి ఉండాలి. గురువులు, పెద్దలు, వృద్ధులు, తల్లిదండ్రులతో గౌరవంగా ప్రవర్తించాలి. అతిథులను దైవ సమానులుగా భావిస్తూ వారిని సంతృప్తిపరచ ప్రయత్నించాలి. ఎప్పుడూ సానుకూలంగా ఆలోచిస్తూ ప్రతికూల భావాలు దరిచేరకుండా చూడాలి. ఇవే మానవులు ఆచరించాల్సిన శాశ్వత ధర్మాలు.

**- పరికిపండ్ల సారంగపాణి, 9849630290**

లోకం తీరు




# లాక్‌డౌన్ 14న ఎత్తేయం!



విపక్ష పార్టీల ఫ్లోర్ లీడర్లు, ఇతర నేతలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మోదీ

## సీఎంలతో మాట్లాడి తేదీ నిర్ణయిస్తాం.. అఖిలపక్షంతో మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 14న ఎత్తివేయడం సాధ్యం కాదని ప్రధాని మోదీ విపక్షాలకు సూచనప్రాయంగా చెప్పారు. ఎప్పుడు, ఎప్పుడు ఎలా ఎత్తివేయాలన్నది ముఖ్యమంత్రులతో మాట్లాడి నిర్ణయిస్తామన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు, జిల్లా యంత్రాంగాలు లాక్‌డౌన్‌ను కొనసాగించాల్సిందేనని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బుధవారం ఆయన పార్లమెంటు సభయ సభల్లోని వివిధ పార్టీల నాయకులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దేశంలో ప్రస్తుతం సామాజిక అత్యవసర పరిస్థితి నెలకొందని చెప్పారు. కరోనావైరస్‌పై దీర్ఘకాలిక పోరాటం చేయాల్సి ఉంటుందని, ఈ నేపథ్యంలో కఠిన నిర్ణయాలను తీసుకోకతప్పడం లేదని అన్నారు. అఖిలపక్ష సమావేశంలో మెజారిటీ పార్టీలు లాక్‌డౌన్‌ను కొనసాగించాలని కోరాయి. కొన్ని పార్టీలే వ్యతిరేకించాయి. కరోనాకు ముందు, ఆ తర్వాత జీవితం ఒకే మాదిరిగా ఉండదని మోదీ చెప్పారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా దేశం తన పని సంస్కృతిలో, శైలిలో మార్పులు తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్య ప్రతి ఒక్కరి ప్రాణాలను కాపాడటమేనని చెప్పారు. మానవ జాతి చరిత్రలోనే ఎన్నడూ లేని పరిస్థితిని ప్రపంచం ఎదుర్కొంటోందని చెప్పారు. ఇలాంటి మహమ్మారిని అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవడం తప్పనిసరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రంతో కలిసి పనిచేస్తున్న తీరు అద్భుతమని కొనియాడారు. పార్టీలన్నీ ఏకమై నిర్మాణాత్మక, సానుకూల రాజకీయాలు ప్రదర్శించడం, ఒక సమైక్య ఫ్రంట్‌గా పోరాడడం మంచి పరిణామంగా అభివర్ణించారు. దేశంలో ప్రతీ పౌరుడు ఈ పోరాటంలో తాను కూడా భాగస్వామి అనుకుని, క్రమశిక్షణ, అంకిత భావం ప్రదర్శిస్తున్నారని ప్రశంసించారు. జనతా కర్ఫ్యూ, భౌతికదూరం, లాక్‌డౌన్ వంటి ప్రతీ నిర్ణయాన్ని ప్రజలు ఆమోదించారని అన్నారు. ప్రస్తుత పరిస్థితి ప్రభావం తీవ్రంగా ఉండబోతోందని, వనరుల పరంగా కూడా ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని ప్రధాని తెలిపారు. ఇప్పటివరకు ప్రపంచంలో వైరస్ వ్యాప్తి వేగాన్ని బాగా నియంత్రిస్తున్న దేశాల్లో భారత్ ఒకటని చెప్పారు. ప్రభుత్వ పథకాలను అందిస్తున్న తీరును అధికారులు అఖిలపక్ష నేతలకు వివరించారు. సంక్షోభ సమయంలో మోదీకి మద్దతుగా నిలుస్తామని నేతలు హామీ ఇచ్చారు. అత్యంత క్లిష్ట సమయంలో తమతో సమావేశం ఏర్పరచినందుకు, సకాలంలో చర్యలు తీసుకుంటున్నందుకు ప్రధానిని అభినందించారు. ప్రజలు ఆకలి, పోషకాహార లోపాలకు గురి కాకుండా చూడాలని కోరారు. నూతన పార్లమెంటు భవనం నిర్మాణం యోచనను విరమించుకోవాలని కోరారు. దశలవారీ లాక్‌డౌన్ ఉపసంహరణపై ప లం సూచనలు ఇచ్చారు. విపక్ష నేతలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. మన ప్రజాస్వామ్య పునాదులు బలంగా ఉన్నాయనడానికి అన్ని పక్షాల నేతలు ప్రభుత్వానికి తోడ్పడేందుకు ముందుకు రావడమే నిదర్శనమని వ్యాఖ్యానించారు. గులాం నబీ ఆజాద్ (కాంగ్రెస్), శరద్ పవార్(ఎన్‌సీపీ), రాంగోపాల్ యాదవ్(ఎస్పీ), సతీశ్ మిశ్రా(బీఎస్పీ), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జేపీ), టీఆర్‌బాలు (డీఎంకే), సుఖ్‌బీర్ బాదల్(అకాలీదళ్), వివిధ పార్టీల నేతలు రాజీవ్ రంజన్ సింగ్, పినాకీ మిశ్రా, సంజయ్ రౌత్, సుదీప్ బందోపాధ్యాయ, విజయసాయిరెడ్డి, గల్లా జయదేవ్, కేకే, నామా నాగేశ్వర్‌రావు హాజరయ్యారు. ఎంపీలాడ్స్ ఆపొద్దని తృణమూల్ ప్రతినిధి ప్రధానిని కోరారు. కాగా.. లాక్‌డౌన్ పొడిగించే అంశాన్ని ప్రభుత్వం ఆలోచిస్తోందని, దీనిపై అన్ని వర్గాలతో చర్చిస్తుందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో స్పష్టం చేశారు. టెస్టింగ్ కిట్‌లతో పాటు వెంటిలేటర్ల కొరత ఎక్కడా లేదన్నారు.

### సోనియా సలహా సరికాదు!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: కరోనా వైరస్ సంక్షోభం నేపథ్యంలో ప్రభుత్వం కానీ, ప్రభుత్వరంగ సంస్థలు కానీ రెండేళ్ల పాటు మీడియాకు ప్రకటనలు ఇవ్వరాదని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ సలహా ఇవ్వడాన్ని ఇండియన్ న్యూస్ పేపర్ సొసైటీ తీవ్రంగా ఖండించింది. అలాంటి ప్రతిపాదనలు మీడియాపై ఆర్థికపరమైన సెన్సార్‌షిప్ కిందకే వస్తాయని వ్యాఖ్యానించింది. బుధవారం ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ అధ్యక్షుడు శైలేశ్ గుప్తా ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఖర్చులో మీడియాకు ఇచ్చేది చాలా చిన్న మొత్తమని, పత్రికా రంగానికి మాత్రం అదే పెద్ద మొత్తమని వ్యాఖ్యానించారు. శక్తివంతమైన ప్రజాస్వామ్యానికి పత్రికల మనుగడ అవసరమని చెప్పారు. ఇప్పటికే పత్రికలు మనుగడ కోసం పోరాడుతున్నాయని గుర్తు చేశారు. సోనియా సూచన మొత్తం మీడియా ప్రపంచాన్నే నిరుత్సాహ పరచిందన్నారు. ఆమె తన ప్రతిపాదనను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

### ఎల్లుండి సీఎంలతో ప్రధాని సమావేశం

ప్రధాని మోదీ శనివారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం కానున్నారు. లాక్‌డౌన్‌ను కొనసాగించే విషయమై ఇందులో చర్చిస్తారు. దశలవారీ ఎత్తివేత ఎలా ఉండాలనే అంశం మీదా చర్చ జరగనుంది. లాక్‌డౌన్‌ను పొడిగించాలని తెలంగాణ సహా పలు రాష్ట్రాలు కోరిన నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

### నిజం REAL అబద్ధం FAKE

## ఐదు దశల లాక్‌డౌన్ అబద్ధమే!

- **అలాంటి ప్రోటోకాల్ ఏదీ విడుదల చేయలేదు: డబ్ల్యూహెచ్‌వో**

*లాక్‌డౌన్ ఎప్పుడు ఎత్తేస్తారు? ఇదీ ఇప్పుడు భారతీయులందరికీ ఉన్న సందేహం. ఈ క్రమంలో.. దశలవారీగా లాక్‌డౌన్‌ను ఎత్తివేస్తారంటూ 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' ప్రోటోకాల్స్, ప్రొసీజర్స్ పేరిట ఒక వాట్సాప్ మెసేజ్ వైరల్ అవుతోంది. దాని ప్రకారం..*

*ఒకరోజు ప్రయోగాత్మక లాక్‌డౌన్*
*తర్వాత రోజు నుంచి 21 రోజుల లాక్‌డౌన్*
*అది పూర్తయ్యాక ఐదు రోజుల విరామం*
*ఆ తర్వాత మరో 28 రోజుల లాక్‌డౌన్*
*అది పూర్తయ్యాక మళ్లీ ఐదు రోజుల విరామం*
*ఆ తర్వాత చివరిగా 15 రోజుల లాక్‌డౌన్*

*..ఇదీ ఆ వాట్సాప్ సందేశంలో విషయం. కానీ, తాము అలాంటి ప్రోటోకాల్, ప్రొసీజర్‌ను ఏదీ విడుదల చేయలేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (భారత్ విభాగం) తేల్చిచెప్పింది. డబ్ల్యూహెచ్‌వో చెప్పడమే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఏ దేశంలోనూ లాక్‌డౌన్ విషయంలో ఇలాంటి ప్యాటర్న్ ఏదీ లేదు.*

### తెల్‌తుంబ్డే, నవ్‌లఖా వారంలో లొంగిపోవాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: భీమా-కోరేగావ్ కేసులో నిందితులైన హక్కుల నేతలు ఆనంద్ తెల్‌తుంబ్డే, గౌతమ్ నవ్‌లఖా వారంలోగా జైలు అధికారుల ఎదుట లొంగిపోవాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. ప్రస్తుతం మహారాష్ట్రలో కోర్టులు పనిచేస్తున్నాయని, వారి లొంగుబాటుకు గడువు మరింత పొడిగించేది లేదని స్పష్టం చేసింది.

### ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| కడప | 40.0 | 25.0 |
| అనంతపురం | 39.6 | 21.4 |
| విజయవాడ | 38.9 | 27.2 |
| ప్రకాశం | 37.7 | 28.5 |
| గుంటూరు | 36.3 | 25.9 |
| విశాఖపట్నం | 35.4 | 27.0 |
| విజయనగరం | 35.0 | 26.0 |
| శ్రీకాకుళం | 32.0 | 25.0 |



### మానవబాంబుల్లా తబ్లీగీలు!

గత నెల ఢిల్లీలో నిజాముద్దీన్ మర్కజ్‌లో సమావేశమైన తబ్లీగీ జమాత్ సభ్యులు మానవబాంబుల్లాంటివారు. వారితో కరోనా వైరస్ దేశమంతటా విస్తృతంగా వ్యాప్తి చెందగలదు. ఆ సమావేశానికి హాజరైన వారిని వెతికి పట్టుకుని, పరీక్షలు నిర్వహించాలి.

**- మహారాష్ట్ర మాజీ సీఎం దేవేంద్ర ఫడణవీస్**

### తబ్లీగీ చీఫ్ మౌలానాపై కేసు

- **సీఆర్పీసీ సెక్షన్ 19 కింద నోటీసులు**

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: హజ్రత్ నిజాముద్దీన్ మర్కజ్‌లో లాక్‌డౌన్ నిబంధనలను ఉల్లంఘిస్తూ సమావేశం ఏర్పాటు చేయడంపై తబ్లీగీ జమాత్ చీఫ్ మౌలానా సాద్ సహా ఏడుగురు వ్యక్తులపై ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు కేసు నమోదు చేశారు. దేశవ్యాప్త లాక్‌డౌన్‌కు ముందే.. ఢిల్లీ సర్కారు నిషేధాజ్ఞలు విధించింది. ఈ నేపథ్యంలో మార్చి 24 మర్కజ్‌లో సమావేశానికి ఎలాంటి అనుమతులు ఇవ్వబోమంటూ ఢిల్లీ పోలీసులు తబ్లీగీ చీఫ్‌కు అదే నెల 21న తేల్చిచెప్పారు. దీంతో.. "పోలీసుల ఆదేశాలను లెక్కచేయొద్దు. లాక్‌డౌన్‌ను, భౌతిక దూరాన్ని పక్కన పెట్టి సమావేశానికి రండి" అంటూ మౌలానా ఆడియోను రికార్డ్‌చేసి, వాట్సాప్‌లో ప్రచారం చేశారు. మార్చి 24న కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్త లాక్‌డౌన్‌ను ప్రకటించింది. ఆ ప్రకటన వచ్చిన కాసేపటికే.. నిజాముద్దీన్ మర్కజ్‌లో 1,300 మందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కాగా.. మౌలానా ప్రస్తుతం హోంక్వారంటైన్‌లో ఉన్నారని, నిర్బంధం ముగిశాక దర్యాప్తునకు సహకరిస్తారని న్యాయవాది తౌసీఫ్‌ఖాన్ వెల్లడించారు. మరోవైపు.. కోవిడ్-19 కేసుల విషయంలో మతాలను, వ్యక్తులను కించపర్చొద్దని కేంద్ర ఆరోగ్య శాఖ కోరింది.

### లాక్‌డౌన్‌లో పిల్లలపై పెరిగిన హింస!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: 'చైల్డ్‌లైన్ 1098' హెల్ప్‌లైన్ నంబరు గుర్తుందా? కష్టాల్లో, ప్రమాదాల్లో ఉన్న చిన్నారులను కాపాడేందుకు ప్రభుత్వం పెట్టిన హెల్ప్‌లైన్ నంబరిది. లాక్‌డౌన్ కాలంలో ఈ నంబరుకు ఫోన్ల తాకిడి విపరీతంగా పెరిగింది. మార్చి 20-31 మధ్యకాలంలో కష్టాల్లో ఉన్న పిల్లల నుంచి ఏకంగా 3.07 లక్షల ఫోను కాల్స్ వచ్చాయి. వాటిలో 92వేలకు పైగా ఫోన్ కాల్స్ హింస, దౌర్జన్యాలు, దుర్మార్గాలను తాళలేక రక్షణ కోసం చిన్నారులు చేసిన ఫోన్లే కావడం గమనార్హం.

## కరోనాపై పోరుకు మేము సైతం...

### ముందుకొచ్చిన న్యాయమూర్తులు, కోర్టుల సిబ్బంది

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా నియంత్రణ చర్యల కోసం హైకోర్టు నుంచి వివిధ స్థాయిల న్యాయస్థానాల్లోని న్యాయమూర్తులు, ఇతర సిబ్బంది విరాళం ఇవ్వాలని నిర్ణయించారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ఫుల్ కోర్టు ఏప్రిల్ 6న వీడియో కాన్ఫరెన్స్‌లో కరోనా విపత్తుపై చర్చించింది. ఈ సందర్భంగా తమ వంతు సాయంగా కొంత విరాళం ఇవ్వాలని మెజారిటీ న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా విరాళాలను 'ప్రైమ్ మినిస్టర్ సిటిజెన్స్ అసిస్టెన్స్ అండ్ రిలీఫ్ ఇన్ ఎమర్జెన్సీ సిట్యుయేషన్ (పీఎం కేర్స్) ఫండ్‌కు చెల్లించాలని నిర్ణయించారు. రిజిస్ట్రీలతోనూ సంప్రదించిన మీదట కోర్టుల్లోని ఏపీ ఉద్యోగులు ఎంతెంత ఇవ్వాలన్నది నిర్ణయించారు. విరాళం ఇవ్వడంపై ఎవరికైనా అభ్యంతరముంటే ఈ నెల 13 లోపు రిజిస్ట్రార్ (పరిపాలన)కు తెలియజేయవచ్చు. ఉద్యోగుల విరాళానికి పన్ను మినహాయింపు ఉంటుందని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పేర్కొన్నారు.



కోటి రూపాయల చెక్‌ను సీఎం జగన్‌కు అందజేస్తున్న మిడ్‌వెస్ట్ గ్రానైట్ సీఈవో రామచంద్ర, రాఘవరెడ్డి

#### రాంకీ ఎన్విరో విరాళం రూ.5 కోట్లు

రాంకీ ఎన్విరో ఇంజినీర్స్ (ఆర్‌ఈఈఎల్) ఏపీ సీఎం సహాయ నిధికి రూ.5 కోట్లు సాయం చేసింది. ఇందులో రూ.2 కోట్లు విలువైన వ్యక్తిగత రక్షణ ఎక్విప్‌మెంట్ (పీపీఈ) ఉంది. జీఎంఆర్ సంస్థ ముఖ్యమంత్రి సహాయ నిధికి కోటి రూపాయల విరాళాన్ని అందించింది. బుధవారం సంస్థ ప్రతినిధి జీ శ్రీనివాస్ విజయవాడలో సీఎస్ నీలం సాహ్నిని కలిసి రూ.కోటిని ఆర్టీజీఎస్ ద్వారా బదిలీ చేసిన లేఖను అందజేశారు. నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ, ఆర్‌వీఆర్‌జేసీ తరపున సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ రూ.28 లక్షలు విరాళం ప్రకటించారు.



సీఎం జగన్‌కు రూ.3 కోట్ల చెక్‌ను అందజేస్తున్న రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ ఎండీ, సీఈవో గౌతం రెడ్డి, అళ్ల శరణ్

### విరాళాలన్నింటినీ సీఎంఆర్‌ఎఫ్‌లో డిపాజిట్ చేయండి

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): "జిల్లాల్లో వివిధ రూపాల్లో కలెక్టర్లకు అందుతోన్న విరాళాలను ఇతర అవసరాలకు దారి మళ్లించవద్దు. విధిగా ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్)లో డిపాజిట్ చేయాలి. రాష్ట్ర విపత్తు స్పందన నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నిధులను సహాయచర్యలకు ఉపయోగించుకోండి" అంటూ ప్రభుత్వం కలెక్టర్లను ఆదేశించింది. ఈ ఉత్తర్వులపై కలెక్టర్లు పెదవి విరుస్తున్నారు. ఎస్‌డీఆర్‌ఎఫ్ నిధులున్నది వాస్తవమే అయినా వాటి వినియోగానికి అనేక ఆంక్షలు, పరిమితులు ఉన్నాయని గుర్తు చేస్తున్నారు.



### ట్విటర్ సీయీవో విరాళం 7,600 కోట్లు

సాన్ ఫ్రాన్సిస్కో, ఏప్రిల్ 8: ప్రపంచవ్యాప్తంగా కరోనా నివారణ గాను చేపడుతున్న చర్యలకు మద్దతుగా ట్విటర్ సీయీవో జాక్ డోర్సీ దాదాపు రూ. 7,600 కోట్లను విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తం జాక్ డోర్సీ ఆస్తిలో 28% కావడం గమనార్హం. ఈ డబ్బును తమ సేవా సంస్థ స్టార్ట్ స్మాల్‌కు తరలించారు. ఈ మొత్తం నిధులను తన డిజిటల్ పేమెంట్ సంస్థ స్క్వేర్ నుంచే ఇవ్వడం గమనార్హం. "జీవితం చాలా చిన్నది. ఇతరుల కోసం మనం చేయగలిగినంతా చేద్దాం. ఈ చర్య మరింత మందికి ప్రేరణగా నిలుస్తుందని ఆశిస్తున్నా" అని ఆయన ఈ సందర్భంగా ట్వీట్ చేశారు. కరోనా ప్రభావం తగ్గిన తర్వాత బాలికల విద్య, ఆరోగ్యంపై దృష్టి సారిస్తానని ఆయన చెప్పారు.

నవ్య | చిత్రజ్యోతి

### సీసీసీకి పద్మావతి గల్లా విరాళం రూ. 10లక్షలు



చలనచిత్ర కార్మికుల సంక్షేమం కోసం చిరంజీవి అధ్యక్షతన ఏర్పాటైన కరోనా క్రైసిస్ ఛారిటీ(సీసీసీ)కి సూపర్‌స్టార్ కృష్ణ కుమార్తె, ఎంపీ జయదేవ్ గల్లా సతీమణి పద్మావతి గల్లా రూ. 10 లక్షల విరాళాన్ని ప్రకటించారు. చిత్రనిర్మాణ సంస్థ అమరరాజా మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్థాపించి, తనయుడు అశోక్ గల్లాను హీరోగా పరిచయం చేస్తూ, ఆమె ఓ చిత్రం నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. లాక్‌డౌన్ వల్ల తమ సినిమా చిత్రీకరణ నిలిచిపోయిందనీ, పరిస్థితులు చక్కబడిన తర్వాత మళ్లీ కొనసాగిస్తామనీ ఆమె తెలిపారు.

### సాయికుమార్ ఫ్యామిలీ విరాళం... రూ. 7లక్షలు



కరోనా క్రైసిస్ ఛారిటీ(సీసీసీ)కి నటుడు సాయికుమార్, ఆయన తనయుడు, హీరో ఆదితో కలిసి రూ. 5,00,004 (5లక్షల 4రూపాయలు) విరాళంగా ఇచ్చారు. అలాగే, డబ్బింగ్ యూనియన్ అసోసియేషన్‌కు రూ. 1,00,008 విరాళాన్ని అందజేశారు. సాయికుమార్ సోదరుడు రవిశంకర్ సైతం డబ్బింగ్ యూనియన్ అసోసియేషన్‌కి లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు.

● కరోనా నివారణ చర్యలకు 'మొగలి రేకులు' ఫేమ్ హీరో సాగర్ తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 5 లక్షల విరాళాన్ని ఇచ్చారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి చెక్ అందజేశారు.




అల్లు అర్జున్

సూటిగా, కోపంగా చూసే కళ్లు... వేటాడే పులిలా లేవు.. కూర్చోవడంలోనూ ఓ దర్పం... అడవిలో సింహం సిట్టింగ్ వేసినట్టు! ఆహార్యంలో స్టైల్ లేదు... కానీ, యాటిట్యూడ్‌లో ఓ స్టైల్ ఉంది! అభిమానులకు ఇంకేం కావాలి? ఫుల్ ఖుషీ!! పుష్ప... పుష్పరాజ్‌గా ప్రేక్షకులను అల్లు అర్జున్ ఫుల్లుగా ఆకట్టుకున్నారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప'. సుకుమార్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్, ముత్తంశెట్టి మీడియా సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బుధవారం అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా సినిమాలో ఆయన ఫస్ట్ లుక్ విడుదల చేయడంతో పాటు టైటిల్ ప్రకటించారు. 'ఆర్య', 'ఆర్య 2' తర్వాత అల్లు అర్జున్, సుకుమార్ కలయికలో రూపొందుతున్న చిత్రమిది. "తెలుగు సహా హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో చిత్రాన్ని విడుదల చేస్తాం. ఐదు భాషల్లో అల్లు అర్జున్‌ని ప్రజెంట్ చేయడం గర్వంగా ఉంది. పాన్ ఇండియన్ సినిమాగా 'పుష్ప'ను తెరకెక్కిస్తున్నాం" అని మైత్రీ మూవీ మేకర్స్ తెలిపింది. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కళ: ఎస్. రామకృష్ణ-మౌనిక, కూర్పు: కార్తీక్ శ్రీనివాస్, ఛాయాగ్రహణం: మిరోస్లోవ్ కుబ బ్రోజెక్, సీఈవో: చెర్రీ, సంగీతం: దేవిశ్రీ ప్రసాద్, నిర్మాతలు: నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్.

## ఆ బలం మీ బాడీలో ఉంది



**- పురబ్ కోహ్లీ**

ధైర్యంగా ఉంటే కరోనాను జయించడం కష్టమేమీ కాదని బాలీవుడ్ నటుడు పురబ్ కోహ్లీ చెబుతున్నారు. నాలుగేళ్ల కుమార్తె ఇనయా, ఏడాది కుమారుడు ఓసియన్, శ్రీమతి లూసీ సహా అతడికీ కరోనా సోకింది. ఇప్పుడు ఆ కుటుంబమంతా మహమ్మారి నుండి బయటపడింది. కరోనా సోకిందని తెలియకముందు తమ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది? కరోనా వైరస్ తమ ఒంట్లో ఉందని తెలిసిన తర్వాత తాము ఏం చేశాం? అన్నది పురబ్ కోహ్లీ మాటల్లో...

● మాకు ఫ్లూ వచ్చింది. వ్యాధి లక్షణాలు పరిశీలించిన మా డాక్టర్, కోవిడ్-19 అని చెప్పారు. సాధారణ ఫ్లూ తరహాలో ఉన్నప్పటికీ... దగ్గు గట్టిగా రావడంతో పాటు ఊపిరి ఆడనట్టు అనిపించేది. ఫస్ట్... ఇనయా రెండు రోజులు దగ్గు, జలుబుతో బాధ పడింది. నెక్స్ట్... అందరూ చెబుతున్నట్టు లూసీ ఛాతీలో నొప్పితో ఇబ్బంది పడింది. ఆ తర్వాత ఒక రోజంతా జలుబు నన్ను బాగా భయపెట్టి, వెళ్లిపోయింది. తర్వాత మూడు రోజులు దగ్గు చికాకు పెట్టింది. అయితే... మా ముగ్గురికీ టెంపరేచర్ 100-101లో ఉండేది. అలసట అనిపించేది. మా అబ్బాయి మాత్రం 104 జ్వరం, తీవ్రమైన జలుబు, కాస్త దగ్గుతో చాలా బాధ పడ్డాడు. ఐదో రోజు మాత్రమే వాడికి జ్వరం తగ్గింది. కోవిడ్-19 అని తెలిసినప్పట్నుంచీ మేం డాక్టర్‌తో టచ్‌లో ఉన్నాం.

● భయాందోళనకు గురవుతున్న ప్రజల్లో కొంచమైనా భయం తగ్గించడానికి సహాయపడుతుందని చెబుతున్నా... కరోనా వచ్చిన ఒక వ్యక్తి, ఇప్పుడు బాగున్నాడు. ఏప్రిల్ 1 నుండి మేం స్వీయ నిర్బంధంలో లేం. మాకు ఎటువంటి అంటువ్యాధీ లేదు. రోజూ నాలుగైదుసార్లు ఆవిరి తీసుకోవడం, ఉప్పునీటితో నోటిని పుక్కిలించుకోవడం, అల్లం-పసుపు-తేనె మిశ్రమం తీసుకోవడం వల్ల గొంతుకు చాలా ఉపశమనం కలిగింది. వేడినీటి బాటిల్స్ గుండెల మీద పెట్టుకోవడం వల్ల ఛాతీలో విశ్రాంతిగా ఉండేది. వేడినీటి స్నానాల వల్ల ఫ్లూ ఫీలింగ్స్ నుండి బయటపడినట్టు అనిపించేది. రెండు వారాల తర్వాత కూడా చాలా విశ్రాంతి తీసుకుంటున్నాం. ఇంకా మా శరీరాలు కోలుకుంటున్నట్టు అనిపిస్తోంది.



● మీలో ఎవరికీ కరోనా రాలేదని ఆశిస్తున్నా. ఒకవేళ వచ్చినా... కరోనాతో పోరాడడానికి మీ శరీరం చాలా బలంగా ఉందని తెలుసుకోండి. డాక్టర్ల నుండి సరైన సలహాలు తీసుకోండి. వ్యాధి తీవ్రత మా ఇంట్లో సభ్యులకు వచ్చినదాంతో పోలిస్తే భిన్నంగా ఉండొచ్చు. దయచేసి ప్రతి ఒక్కరూ తమ తమ ఇళ్లలో జాగ్రత్తగా ఉండండి. వీలైనంత విశ్రాంతి తీసుకోండి.



**కరోనా బాధితుల సహాయ కార్యక్రమాల నిమిత్తం తెలంగాణ ప్రభుత్వ సహాయ నిధికి ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్ (ఎఫ్‌ఎన్‌సిసి) రూ. 25 లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఆరోగ్యశాఖ మంత్రి ఈటెల రాజేందర్ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎఫ్‌ఎన్‌సిసి అధ్యక్షుడు ఆదిశేషగిరి రావు, కార్యదర్శి కె.ఎస్. రామారావు, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ కాజా సూర్యనారాయణ, ఎఫ్‌డిసి అధ్యక్షుడు రామ్మోహన్ రావు చెక్ అందజేశారు.**

### ధన్యవాదాలు: భరద్వాజ



దర్శకనిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ తల్లి కృష్ణవేణి సోమవారం మరణించిన సంగతి విదితమే. అయితే కరోనా కారణంగా తను ఎవరికీ ఈ విషయం చెప్పకపోయినా ప్రసార మాధ్యమాల ద్వారా తెలుసుకొని కొంతమంది ఇంటికి వచ్చి పరామర్శించారనీ, మరెందరో సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు, సన్నిహితులు ఫోన్ల ద్వారా సంతాపం తెలియజేశారనీ చెబుతూ వారందరికీ ధన్యవాదాలు తెలిపారు భరద్వాజ.

కరోనా భయంతో మనిషి చనిపోయినా పరామర్శించడానికి, కడసారి చూపు చూసుకోవడానికి వెళ్లలేని దైన్య పరిస్థితి ప్రస్తుతం నెలకొనడం నిజంగా విషాదకరమే.

# మార్గాంతరం?

దేశవ్యాప్తంగా అమలవుతున్న లాక్‌డౌన్ 14వతేదీతో ముగియాల్సి ఉన్నా, దానిని కొనసాగిస్తారేమోన్న అనుమానం ప్రజల్లో ఇప్పటికే బలీయంగా ఉన్నది. గత రెండురోజులుగా దీనిచుట్టూ సాగుతున్న చర్చతో పాటు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం చేసిన వ్యాఖ్యలతో కొనసాగింపు దాదాపు ఖాయమని నిర్ధారణ అయిపోయింది. వైరస్‌మీద దీర్ఘకాలిక పోరాటం అవసరమనీ, కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పడం లేదని అంటూ ఏప్రిల్ 14తో దేశవ్యాప్త లాక్‌డౌన్ ఎత్తివేయడం సాధ్యం కాదని మోదీ సూచనప్రాయంగా ప్రకటించారు. పలు రాష్ట్రాలు, పరిపాలనా వ్యవస్థలు, నిపుణులు ఇదేమాట చెబుతున్నారని కూడా వివిధ రాజకీయపార్టీల నేతలతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్సులో వ్యాఖ్యానించారు. పదకొండవ తేదీన ముఖ్యమంత్రులతో మాట్లాడిన తరువాతే ఏ నిర్ణయమూ చేస్తామని ప్రధాని అంటున్నప్పటికీ, ప్రభుత్వాలూ, ప్రజలూ కూడా కొనసాగింపునకు సిద్ధపడాల్సిన వాతావరణమే కనిపిస్తున్నది.

రాజకీయపార్టీల ఫ్లోర్ లీడర్లతో నిర్వహించిన సమావేశంలో సైతం అత్యధికులు లాక్‌డౌన్ కొనసాగింపునకే ఓటేశారట. దీని కారణంగా సంభవిస్తున్న ఆర్థికనష్టం ఊహించని స్థాయిలో ఉన్నప్పటికీ, ప్రజల ప్రాణాలు రక్షించాలంటే అదొక్కటే మార్గమని ఇప్పటికే అనేకమంది ముఖ్యమంత్రులు అంటున్నారు. ఆర్థికరంగాన్ని ఎప్పుడైనా గాడినపెట్టవచ్చు, పోయిన ప్రాణాలు తేలేము కదా, కరోనామీద యుద్ధం ఇలాగే పటిష్ఠంగా సాగాలంటే మరిన్ని రోజుల లాక్‌డౌన్ వినా మరో మార్గం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి ముందే స్పష్టంచేశారు. కొత్తకేసులు చేరుతూ, వ్యాప్తి పెరుగుతున్న స్థితిలో మార్గాంతరం కూడా లేనందున, అది ఎంతకాలమైనా కనీసం మరో విడతకు ప్రజలు మానసికంగా సిద్ధపడక తప్పదు. లాక్‌డౌన్ విధానం రోగవ్యాప్తిని ఎంతోకొంత నిరోధించగలిగినమాట వాస్తవం. హాట్‌స్పాట్‌లుగా అనుకుంటున్నవి దేశంలో గణనీయంగా ఉన్న స్థితిలో, రోగనిర్ధారణ పరీక్షలు, ఆసుపత్రులు ఇత్యాది ఏర్పాట్లు గరిష్ఠ స్థాయిలో సిద్ధం చేసుకొనేందుకు లాక్‌డౌన్ ఉపకరిస్తుంది. దాదాపు నెలరోజులనుంచీ లాక్‌డౌన్‌లో ఉన్న స్పెయిన్, ఇటలీ వంటి దేశాల్లో మూడువారాలు దాటిన తరువాత కానీ, రోగ వ్యాప్తి తగ్గలేదు. భారతదేశంలో మొదట అంతటి తీవ్రత లేకున్నా, మూడోవారంలోకి అడుగుపెడుతున్న దశలో పరిస్థితిలో ఒక్కసారిగా మార్పు వచ్చి భయం హెచ్చింది. సామాజిక వ్యాప్తి లేదని అంటున్నప్పటికీ, కొన్ని హాట్‌స్పాట్‌లలో స్థానిక వ్యాప్తి జరుగుతున్నదన్న వార్తలు కూడా వినవస్తున్నాయి.

వైరస్ వ్యాప్తి నిరోధానికి లాక్‌డౌన్ అవసరమన్నది ఎవరూ కాదనలేరు కానీ, అది ప్రస్తుత రీతిలోనే కొనసాగించవలసిన అవసరం ఉన్నదా అన్నది ఆలోచించవచ్చు. చాలా రాష్ట్రాల్లో పరిశ్రమలు కేంద్రీకృతమైన ప్రాంతాలు, ఎస్‌ఈజడ్‌లు ఉన్న చోట కేసులు పరిమితంగా ఉంటూ, వైరస్ నియంత్రణలోనే ఉన్నందున వాటిని మూసి ఉంచాల్సిన అవసరం లేదనీ, తగిన జాగ్రత్తలతో నడిపించవచ్చునని కొందరి వాదన. వ్యవస్థీకృత రంగంలోని తయారీ యూనిట్లపై ప్రభుత్వ పర్యవేక్షణ సులభమే కనుక, భౌతిక దూరాన్ని కచ్చితంగా పాటించేట్టు చూస్తూ వాటిని నడిపించవచ్చని అంటున్నారు. ప్రజా రవాణాకు ఎటూ అవకాశం లేదు కనుక, పూర్తి దిగ్బంధాన్ని హాట్‌స్పాట్‌లకు పరిమితం చేస్తే సరిపోతుందని కొందరి సలహా. లాక్‌డౌన్ గడువు ముగుస్తున్న దశలో ప్రభుత్వం ముందుకు అనేక ప్రతిపాదనలు రావడం సహజం. ఈ మూడువారాల లాక్‌డౌన్ అనుభవాలనుంచి ప్రభుత్వం మంచిచెడులను దృష్టిలో పెట్టుకొని నిర్ణయాలు తీసుకోవడం అవసరం. అత్యవసర సేవల నిర్వచనాన్ని సవరించుకొని సామాజిక దూరాన్ని పాటించగలిగే అవకాశమున్న రంగాలను తెరవచ్చు. లాక్‌డౌన్ అన్నది ప్రజలకు భద్రతకు సంబంధించిన భరోసానిస్తే, కార్యకలాపాలు ఎంతో కొంతమేర ఆరంభం కావడమన్నది భవిష్యత్తుపట్ల నమ్మకాన్నిస్తాయి.

సందర్భం

# ఆపద వేళ, కొన్ని అనుబంధ దృశ్యాలు!



■ కె. శ్రీనివాస్

*నిజంగా యుద్ధం చేయకుండానే, ఒక యుద్ధవాతావరణాన్ని కల్పించింది కరోనా ముప్పు. ఇందులో ప్రజలకు ఉద్వేగపరిచే సాంప్రదాయిక బాహ్య శత్రువు లేకపోయినా, ఆత్మరక్షణ, సామూహిక దీక్ష వంటి గుణాలు యుద్ధకాలం నాటి మానసిక స్థితిని దేశపౌరులలో తీసుకువచ్చాయి. ఒక 'ఇతరుడు' కూడా సమకూరాడు. దేశమంతటికీ ఒకే విపత్తు. ఒకరే నాయకుడు. అనుసంధానం పూర్తయింది. ఈ సన్నివేశం రేపు 'సాధారణ' పరిస్థితులు నెలకొన్న తరువాత, ఎందుకు ఉపయోగపడుతుంది? బహుశా, రాజ్యాంగం, రాజ్య వ్యవస్థ అన్నీ రూపు మార్చుకుంటాయి. అదునులో ఎవరైనా ఎందుకు వదులుకుంటారు?*

లాక్‌డౌన్‌కు అందరూ వన్స్‌మోర్ కొడుతున్నారు. మరో మార్గం లేదు మరి. మరొక్క విడత, వారమో, రెండు వారాలో, ఏకంగా నెలరోజులో-- ఈ స్థితి తప్పకపోవచ్చు. ఎవరో విధించడమో ఎత్తివేయడమో కాదు, నమ్మకం కలిగితేనే నిజంగా సందడి పెరిగేది. పాజిటివ్‌లు తగ్గిపోతుంటే, కరోనా తగ్గుముఖం పడుతుంటే, సొరంగం చివర వెలుతురు కనిపించవచ్చు. తగ్గిపోతుంది. కనిపిస్తుంది. అది ఖాయం. ఆశ కాదు. కేవలం ఊహ కాదు. అనాది నుంచి లక్షలకోట్ల సమాధులను మోస్తున్న భూదేవి సాక్షిగా, ఈ గండం గట్టెక్కుతాం. అందరూ కాకపోయినా చాలామంది కరోనానంతర భవిష్యత్తు చూస్తారు. అది ఎట్లా ఉంటుంది? కరోనా ముందున్నట్టే ఉంటుందా? తరువాత ప్రపంచం ఏమిటి? ఎట్లా?

అందరూ ఇళ్లలోనో, గూళ్లల్లోనో, శిబిరాల్లోనో కాళ్లు కట్టేసుకుని కూర్చున్నట్టు కనిపిస్తున్నప్పటికీ, చాలా ప్రపంచం నడుస్తూనే ఉన్నది. స్థాణువై పోయి నిలబడింది కానీ, దాని ఇరుసుల శబ్దం వినిపిస్తూనే ఉన్నది. లోకపు రీతీ రూపమూ అన్నీ కొనసాగుతున్నాయి, లోలోపల మారుతూనూ ఉన్నాయి. ఒక నిశ్చల ఛాయాచిత్రం అడుగున వెలుగునీడలు కదులుతూనే ఉన్నాయి. నిశ్చేష్టమైన రంగస్థలం మీద పాత్రలు మనకు వినపడని సంభాషణలేవో సాగిస్తున్నాయి. ఒక్కసారి వెలుతురు రాగానే, ఒక్కసారి కదలిక తేగానే మార్పు మిరిమిట్లు గొలుపుతుంది. మనుగడకు కొత్త వ్యాకరణం కావాలి. భాషలన్నిటికీ కొత్త నిఘంటువులు కావాలి. వల్లె వేసిన మాటలన్నీ ఇప్పుడు రద్దు. కరెన్సీ రద్దు చేసినప్పటి వలె, నీ దగ్గర చెల్లని డబ్బు చాలా మిగులుతుంది. ఓడలు బళ్లు అవుతాయి. బళ్లు ఓడలు కాకపోవచ్చు. ఏమో, కొత్త సవారీ నేర్చుకున్నవారి గుర్రం ఎగరావచ్చు.

విడియో కాన్ఫరెన్స్ అంటే మొదట చంద్రబాబే గుర్తొస్తాడు. జిల్లా స్థాయి అధికారులందరూ పొద్దున్నే లేచి, ముస్తాబు చేసుకుని మరీ విడియో మీటింగుకు వెళ్లాల్సివచ్చేది. పాలన కేంద్రీకరణ అంతగా అవసరమా, డేష్‌బోర్డు మీద ఉద్యోగుల అటెండెన్స్ ముఖ్యమంత్రి తెలుసుకోవడం అవసరమా? అన్న సందేహాలుండేవి. డిజిటల్ సాధనాలకు, ప్రజాస్వామ్యానికి పొంతన కుదురుతుందా, నాయకుడికి, ఎగ్జిక్యూటివ్‌కు ఉండవలసిన తేడాలు, సమాన లక్షణాలు ఏమిటి– అనే చర్చ కూడా ఒక కాలంలో జరిగేది. ఒక రాష్ట్రస్థాయి నాయకుడు మొత్తం పరిపాలనపై తన శ్రద్ధను, పట్టును చూపించ డానికి ఆస్కారమిచ్చే ఆ విడియో సమావేశం ఇప్పుడు జాతీయస్థాయికి ఎదిగింది. నరేంద్ర మోదీ రాజధానిలో కూర్చుని యావత్ భారతదేశ రాష్ట్రాల ముఖ్యమంత్రుల్ని విడియో కెమెరాల ముందుకు రప్పించి, ఒక విపత్కరపరిస్థితి గురించిన సమీక్ష చేస్తున్నారు. సూచనలు చేస్తున్నారు, వింటున్నారు కూడా. లోలోపల అంచనాలు, మార్కులు వేస్తున్నారు కూడా. ముఖ్యమంత్రులు కూడా తమ పనితీరు ద్వారా ప్రధానిని మెప్పించే ప్రయత్నం చేస్తున్నారు. రేపొద్దున్న ఆర్థిక సహాయం కావాలంటే కేంద్రం మీదనే ఆధారపడాలి కదా, సరైన పనితీరు లేకపోతే సహాయమూ రాదు, కేంద్రజోక్యమూ పెరిగిపోవచ్చు. ఒక పరిస్థితి మీద యావత్ దేశానికి ఒకే సందేశాన్ని, ఒకే కార్యక్రమాన్ని, ఒకే సమీక్షను చేయగలిగే అవకాశం మునుపు భారతదేశంలో ఎప్పుడూ రాలేదు. అది భారతదేశపు వైవిధ్యం కావచ్చు, అభివృద్ధిలోను, రాజకీయ స్థితిగతులలోను ఉన్న తారతమ్యాలు కావచ్చు, అందరికీ ఒకే విపత్తో, సందర్భమో ఒకేసారి రాకపోవచ్చు. ముఖ్యమంత్రులతో పాలనాపరమైన అంశాల గురించి మాట్లాడటమొక్కటే కాదు, దేశప్రజలతో ముఖాముఖి ఉద్వేగపరమైన అంశాలను పంచుకుంటూ, సూచనలు సందేశాలు ఇస్తూ, ఒక కార్యక్రమాన్నో లేదా హోమ్‌వర్క్‌నో ఇస్తున్నారు కూడా. ఇప్పుడంటే సరే, విపత్తు పరిస్థితి. మరి, కరోనా వెళ్లిపోయిన తరువాత కూడా ఈ నూతన ప్రక్రియ కొనసాగుతుందా? కొనసాగితే, అందులో ఏదో ఒక అవాంఛనీయత కనిపించదా? ఫెడరలిజం పలచబడినట్టు అనిపించే అవకాశం లేదా? ప్రధానమంత్రికి ప్రజలకు నేరుగా ఏర్పడే ఒక సంభాషణ, మన ఎన్నికల వ్యవస్థలో మార్పుతెచ్చే అవకాశం ఉందా? అటువంటి ఆలోచనలు ఎవరికైనా వస్తున్నాయా? అధ్యక్ష పాలనా వ్యవస్థ దిశగా వెళ్లాలని కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ అనుకుంటే అందుకు ఒక అనుకూల పరిస్థితి ఉన్నట్టు కనిపిస్తున్నది.

రెండవ దఫా ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చీ రాగానే చాలా వివాదాస్పద నిర్ణయాలు తీసుకోసాగింది. కీలకనిర్ణయాల తరువాత, జమిలి ఎన్నికల ఆలోచనను ముందుకు తోయాలని కూడా అనుకున్నారు. 2023లోనో, ఆ మరుసంవత్సరమో కీలకమయిన మార్పులకు ఆస్కారమిచ్చే మరో ఘనవిజయాన్ని సాధించాలన్నది కేంద్ర అధికారపార్టీ వ్యూహకర్తల ఆలోచనగా వింటూ వచ్చాము. కానీ, మరోవైపు ఆర్థికరంగంలో వైఫల్యం పెరిగిపోతున్నది. కొన్ని రాష్ట్రాలలో ప్రతికూల ఫలితాలు వచ్చాయి. పదినెలల కిందట ఘనవిజయం సాధించినప్పటి రేటింగ్ తగ్గిపోతున్నది. ఆ సమయంలో కరోనా విపత్తు వచ్చింది. ఆశ్చర్యమేమిటంటే, ఈ యాదృచ్ఛిక విపత్తులో, జాతీయ అధికారశ్రేణికి అయాచిత లాభం కూడా చేకూరింది. వరుణుడు తమ పార్టీలో ఉన్నాడని వై.ఎస్. అనేవారు, ఇప్పుడు కాలచక్రమే బిజెపిలో చేరినట్టు కనిపిస్తున్నది. 1897 నాటి విపత్తుల చట్టమే విశ్వరూపం ధరించి, సమస్తాన్నీ కేంద్రం అధీనంలోకి తెస్తున్నది.





ఎప్పుడైనా తీవ్రజాతీయవాదానికి అత్యంత అనుకూల పరిస్థితి శత్రుదేశంతో యుద్ధమే. దేశప్రజలందరినీ అది అనివార్యంగా ఒక్కటి చేసి, నాయకత్వానికి గట్టి మద్దతును ఇచ్చేట్టు చేస్తుంది. నిజంగా యుద్ధం చేయకుండానే, ఒక యుద్ధవాతావరణాన్ని కల్పించింది కరోనా ముప్పు. ఇందులో ప్రజలను ఉద్వేగపరిచే సాంప్రదాయిక బాహ్య శత్రువు లేకపోయినా, ఆత్మరక్షణ, సామూహిక దీక్ష వంటి గుణాలు యుద్ధకాలం నాటి మానసిక స్థితిని దేశపౌరులలో తీసుకువచ్చాయి. కీలక నిర్ణయాలు తీసుకోవడం మినహా, ఈ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం నేరుగా చేసేది ఏమీ ఉండదు. క్షేత్రస్థాయిలో చేయవలసిందంతా రాష్ట్ర ప్రభుత్వాల నేతలూ, సిబ్బందే. అయినప్పటికీ, తానే క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నట్టు జనంలో ఒక అభిప్రాయాన్ని నరేంద్రమోదీ కల్పించగలిగారు. చప్పట్లు చేయడం, దీపాలు వెలిగించడం కొత్తవీ కాదు, అభ్యంతరపెట్టవలసినవీ కావు కానీ, ముఖ్యమంత్రులందరూ వినయంగా ఆ కార్యక్రమాలను పాటించడం ఏదో కొత్త పరిస్థితిని స్ఫురింపచేశాయి. హైడ్రాక్సిక్లోరోక్విన్ విషయంలో ప్రపంచానికి మనం దాతలు కాగలగడంతో భారతీయులు అరుదైన గర్వభావాన్ని పొందగలిగారు. ఎంతగా నైరూప్య శత్రువుతో పోరాటమని చెప్పినా, భౌతిక శత్రువు ఒకరుంటే, జాతీయవాదానికి లభించే ఊతమే వేరు. ఎటువంటి ప్రయత్నం లేకుండా, ఏ నాయకుడూ కుట్ర చేయకుండా, మర్కజి సమావేశం రూపంలో ఒక సంకేతాత్మక 'ప్రతినాయకుడు' ఈ కథనానికి లభించారు. పాపం, ఇందులో జాతీయ అధికార పార్టీ ప్రమేయం ఏమీ లేదు. అగ్రనేతలు ఎక్కడా, ఒక మతవర్గాన్ని నిందించడం కానీ, వ్యాధి వ్యాప్తికి వారిని బాధ్యులు చేయడంగానీ చేయలేదు. వారంతా నిగ్రహంగానే ఉన్నారు. కానీ, కాగల కార్యం ఢిల్లీ కార్యక్రమం రూపంలో జరిగిపోయింది. ఆ కార్యక్రమంలో పాలుపంచుకున్నవారి నేరం ఏమీ లేకపోయినా, వారే వ్యాధికీ బాధితులయ్యారు, వ్యాప్తికీ విమర్శలు ఎదుర్కొన్నారు. ఆ విమర్శలను తీవ్రస్థాయికి తీసుకువెళ్లడానికి సోషల్‌మీడియా ఉండనే ఉన్నది. అప్రయత్నంగానే కరోనాలో వచ్చి చేరిన ద్వేషం, కొందరి ప్రయత్నంతో పెనుజ్వాలై రకరకాల ప్రతిఫలనాలను ఇస్తున్నది. ఏమైతేనేం, ఒక యుద్ధ వాతావరణం ఏర్పడింది. ఒక 'ఇతరుడు' కూడా సమకూరాడు. దేశమంతటికీ ఒకే విపత్తు. ఒకరే నాయకుడు. అనుసంధానం పూర్తయింది. ఈ సన్నివేశం రేపు 'సాధారణ' పరిస్థితులు నెలకొన్న తరువాత, ఎందుకు ఉపయోగపడుతుంది? బహుశా, రాజ్యాంగం, రాజ్యవ్యవస్థ అన్నీ రూపుమార్చుకుంటాయి. అదునులో ఎవరైనా ఎందుకు వదులుకుంటారు?

**భారతీయుల రోగనిరోధక శక్తి ఏమంత చెప్పుకోదగింది కాదు. బహుశా కొన్ని జీవశాస్త్ర కారణాల వల్ల, ఇంకా నిరూపణ కాని నిరోధాల వల్ల – కరోనాకు మనదేశంలో పెద్ద సంఖ్యలో ఆహారం దొరకలేదు. అందులో మన ఘనత ఏమీ లేదు. నిజంగా కరోనా విజృంభిస్తే అందుకు తగిన సన్నద్ధత లేకపోవడం మాత్రం మన ఘనతే. గత డెబ్భై సంవత్సరాల పాలకుల ఘనతే.**

మన దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా, కొత్త దృశ్యాలు ఆవిష్కృతమవుతున్నాయి. మళ్లీ దేశాల మధ్య రాకపోకలు అంత సులువుగా మొదలుకావు. విదేశీయులపై ఆంక్షలు ప్రతిదేశంలోనూ పెరిగిపోతాయి. ప్రపంచీకరణ విలోమీకరణ చెంది, సరిహద్దులు, కంచెలు పెరిగిపోతాయి. మొదటి రెండు ప్రపంచ యుద్ధాలు రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని కూల్చివేసి, అమెరికా–సోవియెట్ యూనియన్ అనే జంట అగ్రరాజ్యాలను సృష్టించాయి. కరోనా పూర్తిగా సద్దుమణిగే సమయానికి చైనా స్థాయి మునుపటి కంటె చాలా పెరిగిపోతుంది. బహుశా, భారత్ కూడా చైనాతో కలసి ఉంటేనే మెరుగని నిర్ణయానికి వచ్చి, రష్యా–చైనా కూటమిలో చేరిపోవచ్చు. అతి తక్కువ ప్రాణనష్టంతోనే భారత్ ఈ గండం నుంచి బయటపడితే, అది దేశవాసులలో గొప్ప ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుంది. మన పురాతన సంస్కృతీ, ఆచారాలు, జీవనవిధానమే మనకు రక్ష అంటూ మీడియాలో ఊదరగొడుతున్నవారు, ఈ విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంటారు. నిజానికి భారతదేశంలో అతిసారం, విషజ్వరాలతో వేలాదిమంది ఏటా చనిపోతున్నారు. భారతీయుల రోగనిరోధక శక్తి ఏమంత చెప్పుకోదగింది కాదు. బహుశా కొన్ని జీవశాస్త్ర కారణాల వల్ల, ఇంకా నిరూపణ కాని నిరోధాల వల్ల – కరోనాకు మనదేశంలో పెద్ద సంఖ్యలో ఆహారం దొరకలేదు. అందులో మన ఘనత ఏమీ లేదు. నిజంగా కరోనా విజృంభిస్తే అందుకు తగిన సన్నద్ధత లేకపోవడం మాత్రం మన ఘనతే. గత డెబ్భై సంవత్సరాల పాలకుల ఘనతే.

# వైద్య రంగంలో మేకిన్ ఇండియా స్ఫూర్తి

భారతదేశ చరిత్రలో ఎన్నడూ చూడని పరిస్థితులను నేడు చూస్తున్నాం. ఎమర్జెన్సీ సమయంలో కానీ, అటు పొరుగు దేశాలతో యుద్ధం జరిగే సమయాల్లో కానీ రైళ్లు, రోడ్డు, రవాణా వ్యవస్థను మూసివేయలేదు. అలాంటిది ఇప్పుడు ఏకంగా లాక్‌డౌన్ ప్రకటించారు. దీనికి, వైరస్ విస్తరణను నివారించడం ఒక కారణం కాగా మరో కారణం– మన దేశం వైద్య వ్యవస్థ విషయంలో అంత బలోపేతంగా లేకపోవడం అని కూడా చెప్పుకోవచ్చు. 2000 సంవత్సరపు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆరోగ్య నివేదిక ప్రకారం ఫ్రాన్స్, ఇటలీ, స్పెయిన్, అమెరికా ఆరోగ్య పరిరక్షణ విషయంలో వరుసగా ఒకటి, రెండు, ఏడు, ముప్పై ఏడు స్థానాల్లో నిలిచాయి. ఇటువంటి దేశాలే కరోనాను తట్టుకోలేక ఆరోగ్య వ్యవస్థ విషయంలో ఛిన్నాభిన్నమయ్యాయి. భారతదేశం ఈ జాబితాలో 112వ స్థానంలో ఉంది. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో అన్ని దేశాలతో పాటు మన దేశం కూడా అందుబాటులో ఉన్న వైద్య వ్యవస్థపై పునరాలోచించుకోవాలి. ప్రపంచ బ్యాంక్ వెల్లడించిన అధ్యయనం ప్రకారం స్పెయిన్, ఇటలీలో ప్రతి వెయ్యి మంది పౌరులకు 4.1 మంది డాక్టర్లు, అమెరికాలో 2.6 మంది డాక్టర్లు వుండగా మన దేశంలో ఆ సంఖ్య కేవలం 0.8గా ఉంది. క్యూబాలో ప్రతి వెయ్యి మంది పౌరులకు 8.2 మంది డాక్టర్లు అందుబాటులో ఉన్నారు. కాబట్టి వారు పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోగలుగుతున్నారు. అంతేకాదు ఇప్పుడు క్యూబా తమ డాక్టర్లను ఇతర దేశాలలో సేవలను అందించడానికి పంపుతోంది. ఈ పరిస్థితులలో మన దేశం కూడా వైద్య సదుపాయాలు, వైద్య విద్యపై దృష్టి సారించి ఆర్థిక వనరులను కేటాయించాలి. వైద్య విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలి. మరిన్ని వైద్య కళాశాలలను నెలకొల్పాలి. అలాగే మెడికల్ కళాశాల ఏర్పాటుకు అయ్యే ఖర్చును కూడా తగ్గించాలి. దీని వల్ల ప్రజలు మెరుగైన వైద్యం సులభంగా, చౌకగా అందుకోగలుగుతారు. ఇదే సమయంలో వైద్య రంగానికి కావాల్సిన మౌలిక వసతుల గురించి కూడా విశ్లేషించుకోవాలి. మేకిన్ ఇండియా స్ఫూర్తిని వైద్య రంగంలో అమలు చేయాలి. కరోనా బాధితులకు సేవలందించడానికి డాక్టర్ల వద్ద సరైన వ్యక్తిగత రక్షణ, పరికరాలు, మాస్క్‌లు లేకపోవడంతో అభద్రతకు గురవుతున్నారు. తగినన్ని బెడ్‌లు అందుబాటులో లేకపోవడంతో, వైద్య పరికరాల కొరతతోను, నాసిరకపు రక్షణ పరికరాలతోనే వారు బిక్కు బిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. ఈ విపత్కర తరుణం మనకు ఒక ముఖ్యమైన విషయాన్ని గుర్తు చేస్తున్నది. ఈ సమయంలో సాంకేతికతను ఉపయోగించుకొని వైద్య పరికరాల తయారీ, నైపుణ్యత, ఉత్పాదకత మీద శ్రద్ధ వహించాలి. దురదృష్టవశాత్తు మన దేశం తక్కువ సాంకేతిక అవసరాలతో కూడిన వ్యక్తిగత రక్షణ వైద్య ఉత్పత్తులను కూడా దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్న వైద్య పరికరాలు 2017 నుంచి ప్రతి సంవత్సరం పెరుగుతూ రెండంకెల వృద్ధిని సూచిస్తూ 13శాతానికి చేరింది. 2019 సంవత్సరానికి మొత్తంగా వైద్య పరికరాల దిగుమతి మరింత పెరిగి 24శాతానికి చేరుకొని రూ.38,837.28 కోట్లకు చేరింది. వైద్య ఆరోగ్య ఉత్పత్తుల పరిశ్రమలను ప్రోత్సహించాలి. హిందుస్థాన్ లేటెక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎల్‌ఎల్) ఏకీకృత ఆధిపత్యం ప్రస్తుత వ్యవస్థను ఎంత నిర్వీర్యం చేసిందో గ్రహించాలి. ఇది భావి తరాలకు ఒక గుణపాఠంగా పేర్కొనవచ్చు. రూ. 75వేల ఖర్చుతో కూడిన కంటి ఆపరేషన్‌ను కేవలం రూ.750కే చేయగలుగుతున్న అరవింద్ కంటి ఆసుపత్రిని ఒక ఉదాహరణగా తీసుకోవాలి. అరవింద్ హాస్పిటల్ ఆరో ల్యాబ్స్ పేరిట కేవలం రూ.80లతో లెన్స్‌ను తయారు చేస్తుంది. ఇది ప్రపంచ మార్కెట్ ధరలో 10 శాతమే. ప్రస్తుతం ఈ లెన్స్‌లను విదేశాలకు ఎగుమతి కూడా చేస్తున్నారు. అటువంటి పారిశ్రామిక వేత్తలను మరింతగా ప్రోత్సహించి సహాయ సహకారాలు కల్పించాలి. పరిశోధనలకు ఆర్థిక తోడ్పాటునిస్తే వైద్య పరికరాలు తక్కువ ధరకు అందరికీ అందుబాటులోకి వస్తాయి. భారతదేశంలో పెద్ద పెద్ద సంస్కరణలు ఎక్కువ సార్లు సంక్షోభంలో ఉన్నప్పుడు మాత్రమే జరిగాయి. 1970 సంవత్సరంలో వచ్చిన హరిత విప్లవం, శ్వేత విప్లవం, 1991లో వచ్చిన ఆర్థిక సరళీకరణ సందర్భాలు దీనికి ఉదాహరణలు. ప్రస్తుత కరోనా సంక్షోభంకూడా సత్వరమే తీసుకోవాల్సిన నిర్ణయాత్మక, వ్యవస్థాపక మార్పులను మరొకసారి గుర్తుచేస్తుంది. పాలకులు సరైన కార్యాచరణను అవలంబించి సంస్కరణలకు పూనుకుంటేనే ఈ కొవిడ్ 19తో ఛిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవచ్చు. ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ ప్రకారం భారతదేశం కొవిడ్ 19 వల్ల కఠినమైన నియమ నిబంధనలను పౌరులపై విధించింది. కానీ దీన్ని ఎదుర్కోవడానికి ఖర్చు చేయాల్సినంత చేయలేదనే చెప్పాలి. పలు సంపన్న దేశాలు వాటి జీడీపీలో 10 శాతాన్ని ఖర్చు పెడుతుండగా, మన దేశం కేవలం 0.8 శాతం మాత్రమే ఖర్చు పెడుతున్నది. పశ్చిమ దేశాలు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి తక్షణమే స్పందించాయి. వారు క్రెడిట్ ఏజెన్సీల మీద ఆధారపడకుండా ఆర్థిక ఉద్దీపనలకు అవకాశాలు అన్వేషిస్తున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా ఆర్థిక ఇబ్బందులను గమనిస్తున్నప్పటికీ మన ప్రభుత్వం సరైన చర్యల పట్ల ఆసక్తి చూపించడం లేదు. పెద్ద వ్యాపార వేత్తలకు పన్నులలో రాయితీలు ప్రకటిస్తున్న ప్రభుత్వాలు చిన్న, మధ్య తరగతి వ్యాపార వేత్తలకు పెద్దగా ప్రోత్సాహం కల్పించడం లేదు. కానీ చిన్న వ్యాపార వేత్తలే చాలా మందికి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఆర్థిక సంక్షోభంలో అయినా సంస్కరణలపై దృష్టి సారించాలి. లేకుంటే ద్రవ్యోల్బణం బాగా పెరిగి నిరుద్యోగ సమస్యను మరింత జటిలం చేస్తుంది. ఈ కొన్ని వారాల సంక్షోభంలో అమెరికాలో 60 లక్షల మంది నిరుద్యోగులు అయినట్లు తెలుస్తుంది. భారతదేశంలో ఈ పరిస్థితి మరింత విషమించవచ్చు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని 'ఇండియన్ అన్‌ఎంప్లాయ్‌మెంట్ ఇన్సూరెన్స్ బెనిఫిట్స్ బిల్లు, 2020'ని పార్లమెంట్‌లో ప్రతిపాదించాను. ఈ బిల్లు ద్వారా 90 రోజుల వరకు 70 శాతం రోజువారీ వేతనాన్ని నిరుద్యోగికి చెల్లించేందుకు వీలు కలుగుతుంది. అదే విధంగా మైనర్ పిల్లల సంరక్షణ చూసుకుంటున్న వితంతు మహిళలకు అయితే ఈ కాలపరిమితి 120 రోజుల వరకు వర్తిస్తుంది. అదేవిధంగా ఉద్యోగి, వారి తక్షణ కుటుంబ సభ్యులకు రూ. లక్ష ఆరోగ్య బీమా సదుపాయం, 50 శాతం ప్రాథమిక వైద్య ఖర్చులను 120 రోజుల వరకు ఇస్తారు. ఉన్న వసతులకు ఇవి అదనంగా వర్తిస్తాయి. స్థితిగతులతో సంబంధం లేకుండా ఉద్యోగులు అందరికీ ఈ అన్ని సదుపాయాలు కల్పించబడతాయి. ఈ విధానాన్ని ఇప్పటికే చాలా సంపన్న దేశాలు అవలంబిస్తున్నాయి. ప్రభుత్వం వీటిని పరిగణనలోకి తీసుకొని ఆరోగ్య రక్షణ కోసం పోరాడుతున్న సిబ్బందికి సహకారం అందించవల్సిన అవసరాన్ని గుర్తించాలి. వైద్య వ్యవస్థ మరింత బలోపేతం అయ్యేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తాయని ఆశిస్తున్నాను. మన వంతు కర్తవ్యంగా లాక్‌డౌన్‌ను నిక్కచ్చిగా పాటించి కరోనాను తరిమికొడదాం.



**ప్రస్తుత కరోనా సంక్షోభం సత్వరమే తీసుకోవాల్సిన నిర్ణయాత్మక, వ్యవస్థాపక మార్పులను మరొకసారి గుర్తుచేస్తున్నది. పాలకులు సరైన కార్యాచరణను అవలంబించి సంస్కరణలకు పూనుకుంటే కొవిడ్ 19తో ఛిన్నాభిన్నమైన ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవచ్చు. ఈ సమయంలో సాంకేతికతను ఉపయోగించుకొని వైద్య పరికరాల తయారీ, ఉత్పాదకత మీద శ్రద్ధ వహించాలి.**

◆ లావు శ్రీకృష్ణదేవరాయలు
ఎం.పి., నరసరావుపేట

# ఓ మనిషీ...

*ఆ దేవుడు... ఈ దేవుడు!*
*మా దేవుడు... మీ దేవుడు*
*కొట్టుకు చచ్చే మనుజుడు*
*మతం మత్తులో మునుగుడు*

*ఎవరు ఘనం... ఏది బలం*
*ఎంతకు తెగనిది వాదం*
*కొరుకుడు పడనిది శాస్త్రం*
*ఎందుకింక ఉత్తి వ్యర్థం*

*కనిపించని సూక్ష్మక్రిమికి*
*కుదేలై అణిగి మణిగి*
*నిలువెల్లా వణికి వణికి*
*ఉన్నచోటే నసిగి నలిగి!*

*వెలవెల బోయెను తిరుమల*
*వాటికన్‌లో ఏదీ కళ!*
*మర్కజ్‌లో ముప్పు ఎలా!*
*దర్శనమివ్వని దైవము*
*బోధనలకు లేని జనము*

*ఏ దైవము కరుణించెను*
*ఎవరి వాక్కు ఫలియించెను*
*'మోక్షమిచ్చు' సూక్ష్మక్రిమికి*
*మనుషులెల్ల మోకరిల్లెను*

*హిందు ముస్లిం క్రైస్తవ సిక్కు*
*వైద్యుడొక్కడె దిక్కు... ఆస్పత్రికె మొక్కు*
*శుభ్రతే ప్రార్థన.. స్వచ్ఛత ఆరాధన*
*ప్రకృతిలోనే మర్మం, మానవ సేవే ధర్మం*

*ఇకనైనా మేలుకుని...*
*హితమేదో తెలుసుకుని*
*సాటి మనిషిలోనె మనం*
*పరమాత్మను వెతుక్కుని*
*మనుషుల్లా మెలగుదాం...*
*మనసుల్లా బతుకుదాం!*

**– టి. సురేష్**

# సంక్షోభంలో సదవకాశం

కరోనా వంటి భయంకరమైన అంటు వ్యాధులు కొన్ని కఠోర సత్యాలను మనకు గుర్తు చేస్తుంటాయి. ఈ సత్యాలను ప్రకృతి చేసే హెచ్చరికలుగా గుర్తించాలి. గతంలో ప్లేగు, కలరా, ఎయిడ్స్ వంటి అనేక రకాల అంటు వ్యాధులు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమందిని బలితీసుకున్న విషయం మనకు తెలిసిందే. అప్పటికంటే నేడు వైద్య విజ్ఞానరంగంలో ఎంతో పురోగతిని సాధించాం. కంప్యూటర్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, ఫేస్‌బుక్, తదితర ఆధునిక సాంకేతిక వ్యవస్థల వల్ల నేడు ప్రపంచం మొత్తం ఏకీకృత ప్రపంచ ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందుతూ వుంది. ప్రపంచ దేశాల మధ్య ఆదాన ప్రదానాలు, వ్యాపార లావాదేవీలు నానాటికి పెరుగుతూ వున్నాయి. ఇలా వస్తున్న మార్పులు మనుషుల జీవన ప్రమాణాలు, జీవన విధానాలను ప్రభావితం చేస్తూ మానవ జీవితాలు, సంస్కృతీనాగరికతల్లో అనూహ్య పరిణామాలకు కారణమవుతున్నాయి. ప్రపంచీకరణ ప్రక్రియ వేగం పుంజుకుంది. అందువల్ల కరోనా వంటి వ్యాధులు వేగంగా ప్రపంచమంతా వ్యాప్తి చెందుతాయి. ఆర్థిక వ్యవస్థలతో పాటు అన్ని వ్యవస్థలు తిరోగమనంలో పడతాయి.

ఎంతగా అభివృద్ధి చెంది పురోగతిని సాధించినా కరోనా వంటి వ్యాధుల వల్ల మానవ జాతి మనుగడే ప్రశార్థకంగా మారే పరిస్థితులు మనల్ని వెన్నంటే నీడలా వెంటాడుతుంటాయి. అభివృద్ధి, ఆధునికత, పురోగతి, విజ్ఞానం, పరిశోధనలు దారి తప్పి ప్రకృతికి, మానవునికి మధ్య సంబంధాలను కలుషితం చేసి, మానవ మనుగడను సవాలు చేసే పరిస్థితులను సృష్టించుకొంటున్నాము. మనుగడకు ఆధారభూతమైన ప్రకృతి సంబంధ సూత్రాలను, నియమ నిబంధలను ఉల్లఘింస్తున్నాము. మంచి నీటిని అందించే మంచు పర్వతాలు, స్వచ్ఛమైన గాలి, భూగర్భ ఖనిజాలు, జలాలు, సముద్రపు జంతు రాశి, వృక్షరాశి, ఓజోన్ పొర రక్షణ కవచం, భూమిపై నివసించే పశుపక్ష్యాదులు, పచ్చని అడవులు అందించే ఆక్సిజన్, వర్షం, ఋతువులు ఇవన్నీ మానవ జాతి మనుగడను ప్రభావితం చేసే ప్రాకృతిక అంశాలు. అవసరానికి మించి, హద్దులేని కోరికలను తీర్చు కొనుటకు ప్రకృతి సంపదను హరించి వేయడం శాపంగా మారింది. అవసరాలకు తగినంత సంపద ప్రకృతిలో వుంది కాని మన అనవసర కోర్కెలను తీర్చే శక్తి ప్రకృతికి లేదు అన్న విషయం గుర్తిస్తే మంచిది. సుఖభోగాల కోసం, భౌతిక ఆనందాల కోసం, ప్రకృతి వనరులను కొల్లగొడుతూ జీవరాశి సమతుల్యతను నాశనం చేస్తున్నామని తెలుసు కోవాలి. నానాటికి పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, చిత్ర విచిత్రమైన ఆహారపుటలవాట్లు, విభిన్నమైన మత్తు పదార్థాల వినియోగం, అసహజమైన లైంగిక ప్రవృత్తి, అవసరానికి మించి ఇంటర్నెట్ వినియోగం, సహజ విరుద్ధమైన వినోద క్రీడలు.. ఇలా అనేక రకాల అంశాలను మానవ జాతి ప్రకృతి వ్యతిరేక వికృత చేష్టలుగా చెప్పుకొనవచ్చు. మానవాళిలో నానాటికి పెరుగుతున్న స్వార్థ చింతనలు, కామ క్రోధాలు, అవినీతి, కక్షలు, కార్పణ్యాలు, ధనాపేక్ష, మంచిని ద్వేషించుట, చెడుని గౌరవించుట వంటి అంశాలు, పతనమవుతున్న మానవతా విలువలు ప్రకృతికి మానవునికి మధ్య వున్న సమతుల్య సంబధాలను నాశనం చేస్తున్నాయి. ధనార్జనే ద్యేయంగా సుఖ భోగాలే లక్ష్యంగా మనిషి జీవితం అంతులేని అలుపెరుగని పరుగుగా మారింది.

లాక్‌డౌన్ వల్ల ఇంటికే పరిమితమవుతున్న ప్రజలు ఒక్కసారిగా ఈ పరుగుని తాత్కాలికంగా ఆపివేశారు. ఈ విశ్రాంత సమయంలో ఆత్మ పరిశీలన, ఆత్మావలోకనం చేసుకోవడం ఉత్తమం. మన జీవన ప్రయాణం గురించి, వర్తమాన, భవిష్యత్ గురించి లోతైన విషయాలను విశ్లేషణాత్మకంగా కూలంకషంగా పరిశీలించుకొనవలసిన సమయం. ఆధ్యాత్మిక, వేదాంత ధోరణిలో మనల్ని మనం స్వీయ అధ్యయనం చేసుకొనవలసిన సమయం. వ్యక్తిగా, కుటుంబంగా, సమాజంగా, దేశంగా, ప్రపంచంగా ఆత్మ పరిశీలన చేసుకోవాలి. ఒక క్రమం, పద్ధతి, సమతుల్యత, సహజీవనం అనే అంశాలను ప్రకృతి నుండి, నేర్చుకోవాలి. ప్రకృతి మాదిరే విశ్వం కూడా క్రమబద్ధంగా నడుస్తోంది. నక్షత్రాలు, గ్రహాలు, ఉపగ్రహాలు, వంటివి నిరంతరం క్రమం తప్పకుండా వాటి వాటి కక్ష్యలలో లక్షల కి.మీ. వేగంతో



కోటానుకోట్ల కి.మీ ప్రయాణిస్తూనే ఉంటాయి. వీటి చలనాల మూలంగానే మనం భూమి మీద నిశ్చలంగా నివసించగలుగుతున్నాము. ప్రకృతితో పెనవేసుకున్న మనం ప్రకృతిని అనుసరించి క్రమశిక్షణతో జీవించకపోతే మనల్ని మనం నాశనం చేసుకోవడం తథ్యం. ప్రకృతిని శాసించడం గాని, నియంత్రించడం గాని సాధ్యం కానప్పుడు, దానిననుసరించి జీవించడం మేలుకదా! వేదాంత ధోరణిలో చూస్తే అనంత విశ్వంలో ఒక గెలాక్సీ చాలా చిన్నది. గెలాక్సీతో పోలిస్తే సూర్య కుటుంబం ఇంకా చిన్నది. సూర్య కుటుంబంతో పోలిస్తే భూమి ఎంతో చిన్నది. అనంత విశ్వంలో రేణువు లాంటి ఈ భూమి మీద నివసించే మనిషి జీవితం ఏపాటిది..? అత్యంత స్వల్పం, అశాశ్వతం. అది ఆవిరి వంటిది, నీటి బుడగ వంటిది. ఈ జీవన సత్యాలను గ్రహించి వైరాగ్యం చెంది నీరసం చెందాలని కాదు గాని, మన జీవన గమ్యం, గమనాలను సరి చేసుకొని ముందుకు వెళ్లాలని చెప్పడం నా ఉద్దేశం. ఆయా దేశాల మధ్య ఆధిపత్య పోటీ వలన, ఈ భూమిని 100 సార్లు నాశనం చేయగల సామర్థ్యం గల ఆయుధాలను సృష్టించుకొన్నాము. పొరపాటున మూడవ ప్రపంచ యుద్ధం వస్తే నాల్గవ ప్రపంచం యుద్ధం ఉండదు. మానవులతో సహా ప్రకృతి సంపద మొత్తం నాశనం అవుతుంది. కావున కరోనా వలన ఇంటికే పరిమితమైన ప్రజలు ప్రకృతితో ఏవిధంగా సహజీవనం చేయాలి, క్రమశిక్షణ, పరిమిత కోరికలు, ఆరోగ్యకరమైన జీవన ప్రమాణాలు ఏవిధంగా అలవర్చుకుని భూతలస్వర్గాన్ని ఏవిధంగా నిర్మించుకోవాలో ఆలోచించాలి. ప్రపంచ దేశాల నాయకత్వం మానవ జాతి మనుగడకు నడుం బిగించాలి. వాతావరణ కాలుష్యం, ఓజోన్ పొర పరిరక్షణ, అణ్వాయుధాల నియంత్రణ, అసమానతలను తగ్గించడం, పేదరిక నిర్మూలన, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, మనోవికాసం, సంతోషం, ఆనందం, శారీరక ధారుడ్యం, అందరికి అందుబాటులో వుండే వైద్య, విద్య, గృహ సదుపాయం మొదలగు విషయాలపట్ల ఏకాభిప్రాయానికి రావాలి. ఆయా దేశాలను పట్టి పీడిస్తున్న అంతర్గత, అంతర్జాతీయ సమస్యలను రాజకీయ ప్రయోజనాలకోసం జటిలం చేయకుండా, సమస్త మానవాళి కోసం సత్వరమే పరిష్కరించుకోవాలి. మత విశ్వాసాలు మానవత్వాన్ని పెంచి పోషించాలే తప్ప మనుషుల మధ్య అంతరాలు పెంచకూడదు. సిద్ధాంతాలు మానవ జాతి పురోగతికి ఉపయోగపడాలి తప్ప దేశాల మధ్య వైరుధ్యాలను సృష్టించకూడదు. ఆచార సంప్రదాయాలు మనుషులను ఐక్యం చేయాలి కాని విభేదాలు సృష్టించకూడదు. మన సంస్కృతి, నాగరికతలు సకల జనులను సన్మార్గంలో నడపాలి గాని పెడదారి పట్టకూడదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పురోగతికి ఉపయోగపడాలిగాని వినాశనానికి దారితీయ కూడదు. అంతరాలు క్రమేపి తగ్గాలి గాని నానాటికి పెరగకూడదు. మానవ సంబంధాలు మానవత్వపు విలువల పునాదుల మీద పునర్ నిర్మించబడాలి. సహోదర భావం, పరస్పర సహకారం, సహజీవనం అనే సూత్రాలను ఆధారం చేసుకొని ఆయా సమాజాల, ప్రాంతాల మధ్య సంబంధాలు సరికొత్తగా ఏర్పాటు చేసుకోవాలి. దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడి, యుద్ధ వాతావరణం పూర్తిగా సమసి పోవాలి. సంపన్న దేశాలు, పేద దేశాలకు బాసటగా నిలవాలి. ఆధ్యాత్మిక చింతన, వేదాంత ధోరణి, ప్రేమ తత్వం, సహోదర భావం, నిస్వార్థ జీవనం, పరిమిత కోరికలు, నిరాడంబర జీవితం, ఉన్నతమైన మానవతా విలువలను పెంపొందించుకొని లోక కల్యాణం కోసం ఏ విధంగా పాటుపడాలో ఆలోచించి ఆచరించాలి. ప్రకృతి నుండి నేర్చుకొని, ప్రకృతిని రక్షించుకుంటూ ప్రకృతితో మమేకమై కలకాలం సుఖ సంతోషాలతో నివసించడం నేర్చుకోవాలి. ఈ విషయాల గురించి ఆలోచించే సమయం కరోనా సంక్షోభం మనకు అందించిన మంచి అవకాశం.

***ఆధ్యాత్మిక చింతన, వేదాంత ధోరణి, ప్రేమతత్వం, సహోదర భావం, నిస్వార్థ జీవనం, పరిమిత కోరికలు, నిరాడంబర జీవితం, ఉన్నతమైన మానవతా విలువలను పెంపొందించుకొని లోక కల్యాణం కోసం ఏ విధంగా పాటుపడాలో ఆలోచించి ఆచరించాలి. ప్రకృతి నుండి నేర్చుకొని, ప్రకృతిని రక్షించుకుంటూ ప్రకృతితో మమేకమై కలకాలం సుఖ సంతోషాలతో నివసించడం నేర్చుకోవాలి. ఈ విషయాల గురించి ఆలోచించే సమయం కరోనా సంక్షోభం మనకు అందించిన మంచి అవకాశం.***

□ రావెల కిషోర్ బాబు, మాజీ మంత్రి

epaper.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 9 ఏప్రిల్ 2020
navya@andhrajyothy.com

న్యూస్‌మేకర్

## నటుడు దర్జీ అయ్యాడు



మలయాళ నటుడు ఇంద్రన్స్ కుట్టు మిషన్ ముందు కూర్చొని ఏదో కుడుతున్నారు. చూసేవారందరికీ ఇదేదో సినిమా సీన్‌లా అనిపించవచ్చు. కానీ... ఇది నటన కాదు... నిజం! నటుడు కాకముందు దర్జీగా జీవనం సాగించిన ఆయన... ఈ కరోనా కాలంలో తిరిగి పాత వృత్తిలో ఒదిగిపోయారు.

కేరళ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'బ్రేక్ ద చైన్' ప్రచార కార్యక్రమంలో భాగంగా ఇంట్లోనే మాస్క్‌లు ఎలా తయారు చేసుకోవచ్చో ఇంద్రన్స్ అవగాహన కల్పించారు. అందుకోసం కేవలం నటించకుండా నిజంగానే మాస్క్‌లు కుట్టారు. వీటి తయారీకి ఎలాంటి వస్త్రాన్ని ఎంచుకోవాలి, సులువుగా ఎలా కుట్టాలనే చిట్కాలు ఇచ్చారు. పూజప్పురా కేంద్ర కారాగారంలోని నేరస్తులతో కలిసి మాస్క్‌లు కుడుతున్న ఈ షార్ట్ వీడియో సామాజిక మాధ్యమాల్లో తెగ చక్కర్లు కొడుతోంది. స్టార్ నటులు, ఇతర ప్రముఖులు సైతం దీన్ని షేర్ చేసి, ఇంద్రన్స్‌ను అభినందనల్లో ముంచెత్తుతున్నారు.

కమెడియన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వందల పాత్రలు పోషించిన ఇంద్రన్స్ కాస్ట్యూమ్ డిజైనర్‌గా కూడా పనిచేశారు. ఆ తర్వాత నటనపై మక్కువతో సినిమాల్లోకి వచ్చారు. ఎన్నో అవార్డులు అందుకున్న ఇంద్రన్స్ ప్రభుత్వం అడగ్గానే భేషజాలకు పోకుండా టైలరింగ్ చేయడానికి ఒప్పుకోవడం ఆయన పెద్ద మనసుకు నిదర్శనం.

సలామ్



భార్య, కూతురుతో మహమూద్ ఖాన్

**ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా కరోనా వైరస్ సోకుతుందని వారికి తెలుసు. ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా, కరోనా బాధితుల ప్రాణాలు దక్కవనీ తెలుసు. కాబట్టే తమ వైద్య అనుభవాన్నీ, నైపుణ్యాన్నీ రంగరించి కరోనా బాధితులకు సమర్థమైన చికిత్సను అందిస్తూ ఉంటారు వైద్యులు. ఈ కోవకు చెందిన వైద్యులందరిలో ఓ వైద్య కుటుంబం ప్రత్యేక పాత్రను పోషిస్తోంది. ఆ కుటుంబంలో తల్లి, తండ్రి, కూతురు... ముగ్గురూ వైద్యులే కావడం విశేషం. ప్రాణాలకు తెగించి కరోనా రోగులకు స్ర్కీనింగ్ పరీక్షలు చేయడం, వారితో ఐసొలేషన్ వార్డ్‌లో గంటల తరబడి గడపడం సాహసమే అని తెలిసినా 'వృత్తిలో ఇదంతా భాగమే' అని భయాందోళనలను ఒకింత తేలికపరిచే ప్రయత్నం చేసింది డాక్టర్ మహమూద్ ఖాన్ వైద్య కుటుంబం. కరోనా సేవలో అహో రాత్రులు శ్రమిస్తున్న ఆ వైద్య కుటుంబం అంతరంగం వారి మాటల్లోనే...**

# ఒకే ఇంట్లో... ముగ్గురు ప్రాణదాతలు!

### ఏకంగా ఆరు గంటల పాటు...

కరోనా వైరస్ ఎంత తేలికగా సోకుతుందో అందరికీ తెలిసిందే! కాబట్టే మేం చికిత్స సమయంలో పి.పి.ఇ (పర్సనల్ ప్రొటెక్షన్ ఎక్విప్‌మెంట్) తప్పనిసరిగా ధరిస్తాం. ఈ దుస్తులు ధరించడం, తొలగించడం పెద్ద ప్రక్రియ. వేసుకున్న దుస్తుల మీద డాక్టర్ గౌను ధరించి, దాని మీద పి.పి.ఇ దుస్తులు ధరించాలి. ఈ దుస్తుల్లో భాగంగా...తల నుంచి పాదాల వరకూ గౌను, గ్లాసులు, చేతి తొడుగులు... అన్నీ ఉంటాయి. ఇన్ని వరుసల దుస్తుల వల్ల ఉక్కపోత భరించక తప్పదు. ఒకసారి ఈ దుస్తులు ధరిస్తే మంచినీళ్లు తాగే వీలు కూడా ఉండదు. ఈ దుస్తులు ధరించి ఐసొలేషన్ వార్డులోకి అడుగు పెడితే, అక్కడే కనీసం ఆరు గంటలు గడపవలసి ఉంటుంది. అంతసేపూ రోగుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తూ, అవసరమైన చికిత్స అందించవలసి ఉంటుంది. విధులు ముగిసిన తర్వాత పి.పి.ఇ దుస్తులను జాగ్రత్తగా తొలగించి, డిస్పోజబుల్ డబ్బాలో వేసేయాలి. ఒకసారి వాడిన ఈ దుస్తులను తిరిగి వాడకూడదు. ఇదంతా ఒక ఎత్తు అయితే, ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకున్న తర్వాత వైరస్ కుటుంబసభ్యులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవడం మరో ఎత్తు. ఇందుకోసం ఇంటి బయటే ముఖం, కాళ్లూ, చేతులూ శుభ్రంగా కడుక్కుని ఇంట్లోకి అడుగుపెడుతూ ఉంటాం. వైరస్ నుంచి రక్షణ కోసం ఇన్ని జాగ్రత్తలు తీసుకోక తప్పదు.

**- డాక్టర్ మహమూద్ ఖాన్,** ఛాతీ వైద్య నిపుణులు, సూపరింటెండెంట్, చెస్ట్ హాస్పిటల్, హైదరాబాద్

❖ ❖ ❖

### అన్ని గంటలు భరించక తప్పదు!

నేను గాంధీ ఆస్పత్రిలో డెర్మటాలజిస్ట్‌గా పని చేస్తున్నా. తాజాగా ఫీవర్ ఆస్పత్రిలో కరోనా వార్డ్‌లో రోగులకు సేవలు అందించే విధులు చేపట్టాను. ఐసొలేషన్ వార్డుకు వెళ్లి, రోగులకు స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహించడంతో పాటు, చికిత్సను పర్యవేక్షించడం నా బాధ్యత. కరోనా వైరస్ సోకుతుందేమో అనే భయం వైద్యులమైన మాకూ ఉంటుంది. ఎన్ని జాగ్రత్తలు పాటించినా, మనసు లోపల ఏదో ఓ మూల అనుమానం వేధిస్తూ ఉంటుంది. అయినా వైద్యులుగా విధులు నిర్వర్తించక తప్పదు. కాబట్టి వీలైనంత జాగ్రత్తగా వ్యవహరిస్తూ ఉంటాను. అన్నిటికంటే కష్టమైన పని పి.పి.ఇ దుస్తుల్లో గంటల తరబడి ఐసొలేషన్ వార్డులో గడపడం. ఈ దుస్తులు ఒకసారి ధరిస్తే షిఫ్ట్ ముగిసేవరకూ కనీసం నీళ్లు తాగడానికి, కాలకృత్యాలు తీర్చుకోవడానికీ వీలు ఉండదు. ఒకవేళ అత్యవసరమై దుస్తులు తొలగించవలసివస్తే, తిరిగి శానిటైజర్‌తో చేతులు శుభ్రం చేసుకుని, కొత్త పి.పి.ఇ దుస్తులు ధరించవలసి ఉంటుంది. ఈ దుస్తులు మార్చుకోవడం కోసం ఐసొలేషన్ వార్డుకు ఆనుకుని ఓ గది కేటాయించారు. దాన్లోనే దుస్తులు ధరించాలి, డ్యూటీ పూర్తయిన తర్వాత డిస్పోజబుల్ బ్యాగులో వేసేయాలి. ఇంట్లో కూడా తొలగించిన దుస్తులను వేడినీళ్లలో వేసి శుభ్రం చేస్తాను. స్నానం తర్వాత కుటుంబసభ్యులను కలిసినా, దూరం పాటిస్తున్నాను. కలిసి మాట్లాడుకున్నా, భోజనం చేసినా కుటుంబసభ్యుల మధ్య దూరం తప్పనిసరి. అలాగే మా వారూ, పాప, నేనూ, మా అబ్బాయి, మా అత్తగారు... అందరం వేర్వేరు గదుల్లో పడుకుంటాం. కరోనా వైరస్ సోకకుండా ఇలాంటి జాగ్రత్తలు తీసుకోక తప్పదు.

**- డాక్టర్ షహనా ఖాన్,** డర్మటాలజిస్ట్, గాంధీ హాస్పిటల్

❖ ❖ ❖



తండ్రితో రషికా ఖాన్

### నానమ్మ గురించే బెంగంతా!

నేను గాంధీ మెడికల్ కాలేజీ స్టూడెంట్‌ను. అయితే ప్రస్తుతం ఫీవర్ ఆస్పత్రిలో కోవిడ్ - 19 విధుల్లో పాలుపంచుకుంటున్నాను. ఇది వైద్య విద్య తదనంతరం నేను చేపట్టిన మొట్టమొదటి వృత్తి. ఓ.పితో పాటు ఐసొలేషన్ వార్డు, స్ర్కీనింగ్ డెస్క్... ఇలా వంతుల వారీగా ఈ మూడు విధులూ నిర్వహిస్తున్నాను. అయినా ఈ బాధ్యతను సవాలుగా తీసుకున్నాను. నేను ఆస్పత్రిలో స్ర్కీనింగ్ డెస్క్ దగ్గర కూర్చుంటాను. అక్కడికి వచ్చే రోగుల్లో ఎవరికి కరోనా ఉందో తెలియదు. వారి నుంచి తర్వాతి పేషెంట్లకు కరోనా సోకే వీలు లేకుండా, ప్రతి కేసుకూ పెన్నును కూడా స్టెరిలైజ్ చేస్తూ ఉంటాను. రోగిని తాకవలసివస్తే, చేతి తొడుగులూ మార్చేస్తాను. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది వైద్యులు కరోనా రోగులకు చికిత్స చేసే క్రమంలో ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఇలా ఇక్కడా జరగవచ్చు. వైద్యులుగా మేం మా ప్రాణాలతో పాటు, మా కుటుంబసభ్యుల ప్రాణాలూ పణంగా పెడుతున్నాం విధులు పూర్తి అయిన తర్వాత నేరుగా ఇంటికే వెళ్తున్నాం. సాధారణ ప్రజలతో పోలిస్తే, వైరస్ సోకే అవకాశాలు మాకు, మా కుటుంబసభ్యులకే ఎక్కువ. మా ఇంట్లో మాతో పాటు, మా నానమ్మ కూడా ఉంటారు. అమ్మ, నాన్న, నేను ముగ్గురం కరోనా విధుల్లో ఉన్నాం కాబట్టి, ఇంట్లో రెట్టింపు జాగ్రత్తలు తీసుకుంటాం. నాన్నమ్మకు ప్రత్యేక గది కేటాయించాం. ఒకే ఇంట్లో కలిసే ఉంటున్నా, అందరం దూరం పాటిస్తున్నాం.

**- రషికా ఖాన్,** వైద్య విద్యార్థి, గాంధీ హాస్పిటల్

● గోగుమళ్ల కవిత

---

సేవ



**కరోనా విజృంభిస్తున్న ఈ విపత్కర సమయంలో.... కేరళలోని కంజీరప్పల్లిలో ప్రస్తుతం అందరి నోటా చేపలు అమ్ముకునే నజీబ్ పేరే వినిపిస్తోంది. ఇంతకీ ఆయన ఏం చేస్తున్నారు? పట్టణవాసులు ఆయనను ఎందుకు గౌరవిస్తున్నారు?**

# మొబైల్ 'హ్యాండ్‌వాష్'!

కరోనా వ్యాప్తి చెందకుండా గ్రామాలన్నీ ఎక్కడికక్కడ స్వీయ నియంత్రణను అనుసరిస్తున్నాయి. సామాజిక దూరాన్ని పాటించడంతో పాటు, పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రతకు కూడా ప్రజలు పెద్ద పీట వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేరళలోని కంజీరప్పల్లి పట్టణానికి చెందిన నజీబ్ కరోనా వ్యాప్తి చెందకుండా తనవంతు కృషి చేస్తున్నారు. గతంలో బస్సు డ్రైవర్‌గా పనిచేసిన నజీబ్ కొంత కాలం క్రితం తన సోదరుడు మంచాన పడటంతో ఆయన చేస్తున్న చేపల వ్యాపారం చూసేవారు. ఏ పనిచేసినా సమాజసేవకు మాత్రం దూరం కాలేదు. ఊరిలో మంచి నీటి సమస్య ఏర్పడినా, వృద్ధులకు వైద్యసాయం కావాలన్నా, అభాగ్యులకు భోజనం పెట్టాలన్నా ముందుండేవారు. తన సంపాదనలోనే కొంతమేరకు సమాజాసేవ కోసం వినియోగించేవారు.

> **ఈ ఆటోతో పట్టణమంతా తిరిగి చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల కరోనా దరిచేరదని అవగాహన కల్పించా. పరిస్థితిని అర్థం చేసుకున్న ప్రజలంతా చేతులు శుభ్రంగా కడుక్కోవడం మొదలెట్టారు.**

కేరళలో 'కొవిడ్ 19' బాధితుల సంఖ్య పెరుగుతోందని తెలియగానే నజీబ్ వెంటనే రంగంలోకి దిగారు. "నేను నావంతు సాయం చేయాలనే విషయాన్ని వెంటనే గ్రహించాను. కరోనా విస్తరించకుండా ఉండాలంటే ప్రాథమిక దశలో చేతులను శుభ్రం చేసుకోవాలనే వార్త వినగానే నా బుర్రలో ఒక ఆలోచన మెరిసింది" అన్నారాయన. ఆ ఆలోచనకు వెంటనే కార్యరూపం ఇచ్చారు నజీబ్. ఆటోలో ఒక వాటర్ ట్యాంకును ఏర్పాటు చేసి, దాని వెనక భాగంలో చేతులు శుభ్రంగా కడుక్కునేందుకు వీలుగా నీటి పంపులను అమర్చారు. దానితోపాటే అందరికీ అందుబాటులో ఉండేలా లిక్విడ్ హ్యాండ్ వాష్ సోప్‌ను ఉంచారు. దీనితోపాటే పరిసరాల పరిశుభ్రతపై కూడా దృష్టి సారించారు. ఒకవైపు ప్రజలకు హ్యాండ్ వాష్‌ను అందుబాటులో ఉంచుతూనే, మరోవైపు రోడ్డుపై వెళ్తున్న వాహనాలపై సొంతంగా తయారు చేసిన రసాయనాలను స్ప్రే చేయడం మొదలెట్టారు. "ఆరోగ్యశాఖ అధికారులను కలిసి వైరస్ వ్యాప్తిచెందకుండా ఉండే స్ప్రే గురించి తెలుసుకున్నా. బ్లీచింగ్ పౌడర్, యాంటీసెప్టిక్ లోషన్, లెమన్‌గ్రాస్ ఆయిల్ కలిపి ద్రావకాన్ని తయారుచేశా. నా మిత్రులనే వలంటీర్లుగా తయారుచేసి, రోడ్డు మీద వెళ్తున్న వాహనాలపై, దుకాణాలు, బస్టాండ్ సముదాయాల వద్ద స్ప్రే చేశాం" అని వివరించారు.



**అవగాహన కార్యక్రమాలు...**

కొవిడ్ విస్తరిస్తున్న ఈ సమయంలో అవగాహనను మించిన ఆయుధం లేదంటారు నజీబ్. అందుకే ఆయన కరోనా గురించిన సమాచారంతో కరపత్రాలు వేసి పంచుతూ, నిపుణులతో అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. నజీబ్ చేస్తున్న సేవా కార్యక్రమాల్లో ఆయన భార్య బీనా, ఇద్దరు పిల్లల మద్దతు ఎంతో ఉంది. నజీబ్ ఇదంతా చేయడం వెనుక ఒక కారణం ఉంది. "ఏడాది క్రితం... యాక్సిడెంట్‌కు గురయ్యాను. డాక్టర్లు నేను బతకనని చెప్పారు. కానీ ఎనిమిది నెలల చికిత్స అనంతరం నేను కోలుకున్నా. దేవుడు నాకు బతకడానికి మరో ఛాన్స్ ఇచ్చినప్పుడు, నేను కూడా సమాజానికి సేవ చేయాలి కదా అనుకున్నా. అప్పటి నుంచి నాకు సాధ్యమైన మేరకు సేవ చేస్తున్నా" అన్నారాయన. నజీబ్ సేవాగుణం చూసి చాలామంది దాతలు ధనసాయం చేసేందుకు ముందుకు వచ్చినప్పటికీ ఆయన తిరస్కరించారు. తను సంపాదించిన దాన్లో నుంచే కొంత సమాజసేవ కోసం వెచ్చిస్తున్నారు. "ఈ చిన్న పట్టణంలో నా పరిమితులు నాకు తెలుసు. కరోనా వైరస్ విస్తరించకుండా నాకు తోచింది నేను చేస్తున్నా. అయితే అది మరింత మందికి సోకకూడదనే మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా" అంటున్న నజీబ్ సేవ చిన్నదే అయినా అందరి ప్రశంసలు అందుకుంటోంది.

---

కరోనా నీతి

# కొత్త యుద్ధం



అది ఒక అందమైన జింకల వనం. అందులో జింక జాతులు ఆనందంగా, నిర్భయంగా జీవిస్తున్నాయి.

ఒకసారి ఆ వనం నుంచి ఒక జింక దారి తప్పి, వేరే అడవిలోకి వెళ్ళింది. అక్కడ దానికి ఎన్నెన్నో కొత్త కొత్త జంతువులు కనిపించాయి. తోడేళ్ళనూ, పులులనూ, సింహాలనూ, నక్కలనూ తొలిసారి అక్కడే చూసింది.

అక్కడ ఒక కొమ్ముల జింక ఎదురై- "ఓ జింక సోదరా! ఈ అడవిలో నిన్నెప్పుడూ చూడలేదే!" అంది.

"అవును. మాది జింకల వనం!"

"ఈ అడవి మీ జింకల వనం లాంటిది కాదు. ఇక్కడ మనల్ని చంపి తినే క్రూరమృగాలు ఉన్నాయి. వాటి నుంచి ఎలా తప్పించుకోవాలో మీకసలు తెలియదు. కాబట్టి ఇక్కడి నుంచి త్వరగా వెళ్ళిపో!" అంటూ ఆ జింక గెంతుతూ వెళ్ళిపోయింది.

"పిరికి జింక! నేనూ జింకనే. అదెలా తప్పించుకోగలదో నేనూ అలాగే తప్పించుకోగలను" అనుకుంటూ జింకలవనం జింక ముందుకు వెళ్ళింది.

అక్కడ చెట్టు కింద నిద్రపోతున్న సింహం కనిపించింది. జింక మెల్లగా దాని దగ్గరకు వెళ్ళి, తన ముంగాలి గిట్టతో సింహం తోకను తొక్కింది.

సింహానికి మెలకువ వచ్చింది. బద్ధకంగా లేస్తూ జింకను చూసింది. గర్జించింది. ఆ గర్జన విని, జింకకు గుండె ఆగినంత పని అయింది.. వెను తిరిగి వచ్చిన దారినే పరుగులు పెట్టింది. అడవి దాటి జింకలవనం వైపు పరుగులు తీస్తూనే ఉంది. జింకలవనం సమీపానికి రాగానే సింహానికి చిక్కింది. సింహం దాన్ని చంపి, చీల్చి ఆరగించింది.

తరువాత సింహం లేచి మెల్లగా జింకలవనంలోకి వెళ్ళింది. దానికి అది కొత్త ప్రదేశం. అక్కడ దానికి గుంపులు గుంపులుగా జింకలు కనిపించాయి. సింహం ఆనందానికి అంతు లేదు. దొరికిన జింకను దొరికినట్టు చంపి తినేస్తోంది.

కొత్తగా ముంచుకొచ్చిన ఈ మృత్యువును చూసి జింకలన్నీ భయపడిపోయాయి. చెల్లాచెదురయ్యాయి. పొదల్లో దాక్కున్నాయి. బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాయి. పొరపాటున ఏ జింకయినా బయటకొస్తే చాలు... సింహం దాన్ని పడగొట్టేస్తోంది.

అయితే ఆ జింకల్లో తెలివైన కుర్ర జింక ఒకటుంది. దాని పేరు జ్ఞాననేత్ర. జింకల పెద్దలు జ్ఞాననేత్ర దగ్గరకు వచ్చి- "దీనికి పరిష్కారం ఏమిటి?" అని అడిగాయి.

"జింక పెద్దలారా! నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఈ క్రూరజంతువును 'సింహం' అంటారు. దీని పంజా నుంచి తప్పుకొనే చాకచక్యం మనకు లేదు. ఎటు ఆలోచించినా, ఎంత యోచించినా ఒకే ఒక్క దారి కనిపిస్తోంది. ఈ సింహం ఆహారం లేకుండా 14 రోజులు మాత్రమే బతకగలదు. కానీ మనం 21 రోజులు బతకగలం. కాబట్టి మన జింకలన్నీ తమ పొదల్లోకి దూరి 14 రోజులు బయటకు రాకుండా ఉంచే చాలు. దీని పీడ మనకు విరగడ అవుతుంది. మనలో ఎవరైనా నిర్లక్ష్యంతో బయటకు వచ్చి దానికి చిక్కారా... దాని జీవిత కాలాన్ని మరో 14 రోజులు పెంచినట్టే! ఈ రోజు అమావాస్య. ఇప్పుడే పొదల్లోకి చేరిపోదాం. పున్నమి నాటికి బయటకు వద్దాం. తమ పొద నుంచీ ఏ జింకా బయటకు రాకుండా చూసే బాధ్యత ఆ జింకల పెద్దలదే!" అంది.

జింకలన్నీ జ్ఞాననేత్ర మాటలు విన్నాయి. ఆకలితో అలమటించాయి.

పున్నమి వచ్చింది. జింకలన్నీ ఒక్కొక్కటీ భయం భయంగా బయటకు వచ్చాయి. వనం మధ్య చెట్టుకింద చచ్చి పడి ఉన్న సింహాన్ని చూశాయి. ఆనందంతో అరిచాయి. గెంతాయి. జింకల కేరింతలతో వనమంతా పులకరించింది.

● బొర్రా గోవర్ధన్

---

వినూత్నం

# ఫోన్ చేసిన పెళ్లి!

పెళ్లిళ్లు ఇన్నాళ్లూ కల్యాణ మండపాల్లో, దేవాలయాల్లో జరగడం తెలిసిందే. కానీ కరోనా లాక్‌డౌన్ కారణంగా ఈ జంట పెళ్లి మాత్రం ఫోన్‌లో అయింది.

కొన్ని నెలల క్రితమే పెళ్లి ముహూర్తం నిర్ణయించారు. అప్పటికి కరోనా ప్రభావం లేదు. కరోనా వల్ల తమ పెళ్లి మాత్రం ఆగకూడదు, అనుకున్న విధంగా ఆ రోజే కొత్త జీవితం ప్రారంభించాలనుకున్నారు ఆ ప్రేమజంట. అనుకుంటే కానిది ఏముంది టెక్నాలజీ యుగంలో...!ఆగమేఘాల మీద వీడియో యాప్ ద్వారా పెళ్లి చేసుకున్నారు ముంబయ్‌కి చెందిన ప్రీత్ సింగ్ నౌకాదళ అధికారి, ఢిల్లీ అమ్మాయి నీత్ కౌర్. ఇద్దరూ ఏడాది డేటింగ్ తరువాత పెళ్లిపీటలెక్కాలనుకున్నారు. రెండు కుటుంబాలను ఒప్పించారు. అన్నీ అనుకున్నట్టే జరిగితే ఏప్రిల్ 4న వీరి వివాహం జరిగేది. కానీ లాక్‌డౌన్ కారణంగా పెళ్లి చేసుకోలేని పరిస్థితి. మరోవైపు స్నేహితులు, బంధువులు కూడా పెళ్లికి హాజరుకాలేని పరిస్థితి. అదీకాక లాక్‌డౌన్ ఎత్తేసినా కూడా ఇప్పుడున్న పరిస్థితుల్లో కరోనా వల్ల పెద్ద సంఖ్యలో జనం గుమిగూడడం మంచిది కాదని ప్రీత్‌సింగ్, నీత్ కౌర్‌లు భావించారు.



దాంతో ప్రీత్ గోవాలో ఇవ్వాల్సిన బ్యాచిలర్స్ పార్టీ, శ్రీలంకలో చేసుకోవాల్సిన హనీమూన్ కూడా వాయిదాపడ్డాయి. కానీ పెళ్లి మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ జరిగితీరాలన్న పట్టుదలతో ప్రీత్ కొత్త మార్గం కనిపెట్టాడు. రెండు వైపులా పెద్దలను ఒప్పించి వీడియో కాలింగ్ యాప్ ద్వారా పెళ్లి చేసుకోవాలనుకున్నారు. వివిధ దేశాల్లో ఉన్న బంధువులు అంతా పెళ్లి వేడుకను చూడడానికి వీలుగా ఉదయం 11:30 గంటలకు ముహూర్తాన్ని నిర్ణయించారు. అతిథుల సంఖ్య 150 ఉండగా 50కి కుదించారు. ఫోన్‌లోనే ప్రీత్, కౌర్‌లు ఇద్దరూ ఒకరినొకరు తమ జీవిత భాగస్వామిగా అంగీకరించారు. ఒక్కసారి ఫోన్‌లో పెళ్లి తంతు ముగియగానే అతిథులు తమతో ముందే తెచ్చిపెట్టుకున్న చాక్లెట్లు తిని నోరు తీపి చేసుకున్నారు. వధూవరులు ఫోన్‌లోనే బంధువులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆఖరులో డ్యాన్స్ కార్యక్రమం కూడా జరిగింది. పెళ్లయితే అయిపోయింది.. కానీ ఇద్దరూ కలిసి ఏడడుగులు వేయాలంటే మాత్రం లాక్‌డౌన్ తొలగించేదాకా ఆగాల్సిందే!

---

● కామిక్ కరోనా    కార్టూన్: చారి పి.ఎస్




---

ఫిట్‌నెస్

# వర్కవుట్ ఫ్రమ్ హోమ్



డంబెల్స్ లేకుండా ఇంట్లో చేసుకొనే సులువైన వ్యాయామం ఇది. దీనికి కావల్సిందల్లా రెండు వాటర్ బాటిల్స్. మీరూ ప్రయత్నించండి.

**'టి'- ఆకారంలో:** ముందుగా నీళ్లతో నిండిన బాటిల్స్‌ను మధ్యలో పట్టుకుని, అటెన్షన్ పొజిషన్‌లో నిలుచోండి. ఇప్పుడు నిదానంగా మీ చేతులను 'టి'-ఆకారం వచ్చేవరకు పైకి ఎత్తండి. అంటే మీ భుజాలకు సమాంతరంగా అనమాట. ఒక్క క్షణం ఆగి, స్టార్టింగ్ పొజిషన్‌కు వచ్చేయండి. మళ్లీ చేతుల పైకి ఎత్తండి. ఇలా ఐదుసార్లు చేయాలి.

**గోడకుర్చీ:** చిన్నప్పుడు స్కూల్లో టీచర్లు, ఇంట్లో పెద్దవాళ్లు పనిష్మెంట్ ఇవ్వాలంటే గోడ కుర్చీ వేయించేవారు... గుర్తుందా! దాన్ని ఒక్కసారి గుర్తుకుతెచ్చుకోండి. గోడకు మీ వీపును పూర్తిగా ఆనించి, రెండు చేతులూ కిందకు వదిలేసి, కుర్చీలో కూర్చున్నట్టు కూర్చోండి. ఇప్పుడు నెమ్మదిగా రెండు చేతులనూ మీ భుజాలకు సమాంతరంగా (టి-ఆకారం) వచ్చేవరకూ ఎత్తండి. ఓ క్షణం ఆగి మళ్లీ మొదటి పొజిషన్‌కు వచ్చేయండి. మళ్లీ ఇందాక చెప్పినట్టు పైకి ఎత్తండి. ఇలా ఐదుసార్లు చేయండి.

**ప్రయోజనం:** మొదటి ఎక్సర్‌సైజ్‌వల్ల చేతి కండరాలు గట్టిపడతాయి. రెండో వ్యాయామం చేస్తే... భుజాలు దృఢంగా ఉంటాయి. ఏదైనా నిదానంగా, పక్కాగా చేయాలి. అప్పుడే మంచి ఫలితాలు వస్తాయి.

---

ఫటాఫట్

# స్వీట్‌కార్న్ పలావ్



రోజూ ఒకే రకం వంటలు తిని బోర్ కొడుతుంటే వెరైటీగా స్వీట్‌కార్న్ పలావ్‌ను ట్రై చేయాలి. రుచిగా ఉంటుంది, ఈజీగా వండుకోవచ్చు.

**కావలసినవి :** బాస్మతీ రైస్ - కప్పు, నీళ్లు - 1-1/2 కప్పు , స్వీట్‌కార్న్ - కప్పు, బఠాణీలు- కప్పు, ఉల్లిపాయ - 1, అల్లం - ముక్క, పచ్చిమిరప -1, వెల్లుల్లి రెబ్బలు - 4, నూనె - 2 టేబుల్ స్పూన్లు, గరం మసాలా - పావు స్పూన్, పసుపు - చిటికెడు, దాల్చిన చెక్క - చిన్న ముక్క, యాలకులు- 2, ఉప్పు, కారం - తగినంత, నిమ్మరసం- కొద్దిగా, పుదీనా ఆకులు - కొన్ని, బిర్యానీ ఆకులు - 2

**తయారీ :** ఉల్లిపాయ, అల్లం, పుదీనా, పచ్చిమిరప, వెల్లుల్లి రెబ్బలను పేస్ట్ చేసిపెట్టుకోవాలి. కడాయిలో నూనె వేసి అందులో జీలకర్ర, లవంగాలు, బిర్యానీ ఆకులు, దాల్చిన చెక్కను వేగించాలి. ఉల్లి పేస్ట్ వేసి దానికి కారం, పసుపు, గరం మసాలాలు కలపాలి. స్వీట్‌కార్న్, బఠాణీలు వేసి దోరగా వేగించాలి. అందులో నానబెట్టిన రైస్ వేసి ఉడికించాలి. ఆఖరున సరిపడా ఉప్పు వేసుకుంటే చాలు తీపి మొక్కజొన్న పలావ్ రెడీ. రైతాతో, అప్పడాల కాంబినేషన్లో ఈ పలావ్ తింటే రుచిగా ఉంటుంది.

# రూ.22.50 లక్షల కోట్ల ప్యాకేజీ

## ప్రభుత్వానికి అసోచామ్ సూచన

ముంబై/న్యూఢిల్లీ: కరోనా సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు భారీ ఉద్దీపన ప్యాకేజీ అవసరమని దేశీయ పారిశ్రామిక, వాణిజ్య మండళ్లు ప్రభుత్వాన్ని కోరాయి. లాక్‌డౌన్‌తో దేశంలో ఆర్థిక కార్యకలాపాలు దాదాపుగా స్తంభించిపోయాయి. ఈ సంక్షోభం నుంచి కోలుకోవాలంటే అసాధారణ స్థాయిలో ఉద్దీపనలు తప్పనిసరని ఆర్థికవేత్తలంటున్నారు. కరోనా కష్టాల నుంచి పేదలు, సామాన్యులకు ఊరట కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం గత నెలలో రూ.1.75 లక్షల కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. అందులో రూ.73, 000 కోట్ల విలువైన ప్రకటనలే కొత్తవని ఆర్థికవేత్తలంటున్నారు. పైగా గత ప్యాకేజీలో పరిశ్రమలు, వాణిజ్య రంగాలకు ఆర్థికంగా లభించిన ఊరటేంలేదని వారన్నారు. తమ కోసమూ ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించాలని పారిశ్రామికవర్గాలు కోరుతున్నాయి. కాగా, కోవిడ్ ప్రభావానికి లోను కాని 400 జిల్లాల్లో ఆర్థిక కార్యకాలాపాలు పునరుద్ధరించాలని పీహెచ్‌డీసీసీఐ సూచించింది.

### ఉదారంగా ఉద్దీపనలు

ప్రపంచ చరిత్రలో అత్యంత తీవ్రమైన ఆర్థిక మాంద్యం ఎదుర్కోబోతున్న తరుణంలో ఆర్థిక సాయం అదే స్థాయిలో ఉండాలని అసోచామ్ అభిప్రాయపడింది. వచ్చే 12-18 నెలల్లో కనీసం 20,000 కోట్ల డాలర్ల (రూ.15 లక్షల కోట్లు) నుంచి 30,000 కోట్ల డాలర్ల (రూ.22.50 లక్షల కోట్లు) ఉద్దీపన ప్యాకేజీ కల్పించాలని అసోచామ్ సెక్రటరీ జనరల్ దీపక్ సూద్ కోరారు.



*పేదలు, అసంఘటిత రంగ వర్గాలకు అదనపు మద్దతు అవసరం. వారి జన్‌ధన్ ఖాతాల్లో మరో రూ.2 లక్షల కోట్లు నగదు జమ చేయాలి. పరిశ్రమలకు నిర్వహణ మూలధన రుణ పరిమితిని పెంచాలి. ఎంఎస్ఎంఈల టర్మ్ రుణాలను పునర్వ్యవస్థీకరించాలి.*

*- భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ)*

## కష్టకాలంలోనూ పెరిగిన సంపద

### డీమార్ట్ అధినేత దమానీ ఆస్తుల విలువ రూ.77,520 కోట్లు

న్యూఢిల్లీ : అదృష్టం ఉంటే కష్టకాలం కూడా కొంత మందికి కలిసొస్తుంది. డీమార్ట్ స్టోర్ల అధినేత రాధాకృష్ణ దమానీయే ఇందుకు ఉదాహరణ. ఆర్థిక మందగమనం, కరోనా దెబ్బతో ప్రస్తుతం వ్యాపారాలన్నీ కుదేలవుతుండడంతో కంపెనీల షేర్లూ కుప్పకూలుతున్నాయి. గత ఏడాది కాలంలో ముకేశ్ అంబానీ వంటి 11 మంది బడా పారిశ్రామిక దిగ్గజాల సంపద తరిగిపోయింది. ఇలాంటి తరుణంలో గత ఏడాది కాలంలో దమానీ సంపద ఐదు శాతం పెరిగి 1,020 కోట్ల డాలర్లకు (సుమారు రూ.77,520 కోట్లు) చేరింది. భారత్‌లో అత్యంత సంపన్నులైన 12 మంది కుబేరుల పేర్లతో విడుదలైన బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ఈ విషయం పేర్కొంది. డీమార్ట్ స్టోర్లను నిర్వహించే అవెన్యూ సూపర్‌మార్ట్స్ కంపెనీ షేర్ల ధర గత ఏడాది కాలంలో 18 శాతం పెరగడం ఇందుకు ప్రధాన కారణం.



## రూ.5 లక్షలలోపు రిఫండ్స్ చెల్లింపు

- ఐటీ శాఖ కీలక నిర్ణయం
- వెంటనే జీఎస్‌టీ, కస్టమ్స్ రిఫండ్స్



న్యూఢిల్లీ: ఆదాయ పన్ను (ఐటీ) శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.5 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్న రిఫండ్‌లను వెంటనే ఆయా ఐటీ చెల్లింపుదారుల ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించింది. దీంతో దాదాపు 14 లక్షల మంది వ్యక్తిగత ఐటీ చెల్లింపుదారులు లబ్ధి పొందుతారని అంచనా. దీనికి తోడు సుమారు లక్ష వ్యాపార సంస్థలకు చెల్లించాల్సిన దాదాపు రూ.18,000 కోట్ల జీఎస్‌టీ, కస్టమ్స్ రిఫండ్స్‌నూ వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అనేక ఎంఎస్ఎంఈలు కూడా ప్రయోజనం పొందుతాయి. కరోనా వైరస్ నేపథ్యంలో ప్రజలు, వ్యాపార సంస్థల దగ్గర నిధుల లభ్యత పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

## వ్యూహాత్మక చమురు నిల్వలు పెంచుకోనున్న భారత్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు భారీగా తగ్గిపోయాయి. ప్రస్తుతం బ్యారెల్ ముడిచమురు ధర 31 డాలర్ల స్థాయిలో ఉంది. ఇది భారత్‌కు గొప్ప అవకాశం. ఈ నేపథ్యంలో భూగర్భంలోని వ్యూహాత్మక చమురు నిల్వలను పెంచుకోవాలని మన దేశం భావిస్తోంది. ఇందుకోసం సౌదీ అరేబియా, యూఏఈ, ఇరాక్ వంటి దేశాల నుంచి ముడి చమురును మరింతగా దిగుమతి చేసుకునేందుకు ఆసక్తి చూపుతోంది. దీనివల్ల భవిష్యత్‌లో సరఫరా లేదా ధరలకు సంబంధించిన ఇబ్బందులను అధిగమించే అవకాశం ఏర్పడనుంది. భారత్ అత్యవసరాల కోసం 53.3 లక్షల టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ నిల్వలు 9.5 రోజులకు సరిపోతాయి. కర్నాటకలోని మంగళూరు, పదూర్‌తోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖలో భూగర్భ నిల్వ కేంద్రాలున్నాయి.

## ఇంటి నుంచి పనికి దక్షిణాది అనుకూలం

- ఐఎస్‌బీ అధ్యయనం నివేదిక

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): లాక్‌డౌన్ ప్రభావం వల్ల ఇంటి నుంచే పని చేసేందుకు దక్షిణాదిలో మరింతగా అవకాశం ఉన్నదని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) ఒక అధ్యయన నివేదికలో తెలిపింది. ఇప్పటికే వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న వృత్తి నిపుణులు ఇంటి వద్ద నుంచే పని (డబ్ల్యూఎఫ్‌హెచ్) చేస్తున్నారు. వాస్తవానికి లాక్‌డౌన్ వల్ల అతి తక్కువగా ఇబ్బంది ఎదుర్కొంటున్న ప్రాంతం దక్షిణాది అని ఐఎస్‌బీలోని ఎకనమిక్స్ అండ్ పబ్లిక్ పాలసీ విభాగం ఫ్యాకల్టీ శేఖర్ తోమర్ తెలిపారు. దాదాపు 100 వృత్తుల్లో ఉన్న 3,000 మంది వర్కర్లపై అధ్యయనాన్ని నిర్వహించారు. వర్క్ ఫ్రమ్ హోమ్ ఇండెక్స్ (డబ్ల్యూఎఫ్ఐ), హ్యూమన్ ప్రాక్సిమిటీ ఇండెక్స్ (పీఐ) లను రూపొందించి వర్కర్లు, వృత్తినిపుణులపై లాక్‌డౌన్ ప్రభావాన్ని అంచనా వేశారు. అధ్యయనం ద్వారా ఆర్థికపరమైన ప్రభావాన్ని కూడా అంచనా వేశారు. హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాలు వర్క్ ఫ్రమ్ హోమ్ సూచీలో పైన ఉన్నట్లు చెప్పారు.

### రోషే రొమ్ము కేన్సర్ ఔషధానికి ఆమోదం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రోషే కంపెనీకి చెందిన రొమ్ము కేన్సర్ ఔషధం అటిజోలిజుమాబ్‌కు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) ఆమోదం తెలిపింది. మెటాస్టాటిక్ ట్రిపుల్-నెగిటివ్ బ్రెస్ట్ కేన్సర్ (టీఎన్‌బీసీ)కు మొదటి దశ చికిత్సలో దీన్ని వినియోగిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా, భారత్‌లో టీఎన్‌బీసీ చికిత్సకు ఆమోదించిన తొలి ఇమ్యునోథెరఫీ ఔషధం ఇదే.

### యప్ టీవీ ఉచిత జేఈఈ, నీట్ పాఠాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): విద్యార్థుల కోసం యప్ టీవీ డిజిటల్ ఎడ్యు ప్లాట్‌ఫారమ్ 'యప్‌మాస్టర్'ను ప్రారంభించింది. దీనిపై ప్రస్తుతం 11, 12 తరగతి విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్ కోర్సులు అందుబాటులో ఉంటాయి. 8 నుంచి 10 తరగతి విద్యార్థులకు ఫౌండేషన్ కోర్సులు ఆఫర్ చేస్తున్నారు. లాక్‌డౌన్ ముగిసే వరకూ ఈ కోర్సులను ఉచితంగా అందిస్తున్నట్లు యప్‌మాస్టర్ వ్యవస్థాపకుడు, సీఈఓ ఉదయ్ రెడ్డి తెలిపారు. ఐఐటీ జేఈఈ, నీట్ క్లాసులను ఉచితంగా వినొచ్చు.

## రిలయన్స్ 'కరోనా' బీమా పాలసీ

కరోనా వైరస్ చికిత్సకు బీమా కవరేజీ కల్పించేందుకు ప్రత్యేక పాలసీని ప్రవేశపెట్టినట్లు రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. కరోనా పాజిటివ్ అని తేలితే పాలసీదారుకు 100 శాతం సమ్ ఇన్స్యూర్డ్‌ను ఏకమొత్తంగా ఆఫర్ చేయడం జరుగుతుందని సంస్థ తెలిపింది. ఒకవేళ క్వారంటైన్ అయితే 50 శాతం లభించనుంది. మూడు నెలల నుంచి 60 ఏళ్ల వరకు వయసు కలిగిన వారు ఈ పాలసీకి అర్హులని, రూ.25,000 నుంచి రూ.2 లక్షల వరకు బీమా కవరేజీ కల్పిస్తున్నట్లు కంపెనీ వెల్లడించింది.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 8వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 360 | విశాఖపట్నం | 345 |
| 9వ తేదీకి.. | | వరంగల్ | 363 |
| చిత్తూరు | 443 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 345 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 80 |
| వరంగల్ | 85 | గుంటూరు | 80 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 80 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | 93 |
| కర్నూలు | 85 | నెల్లూరు | 93 |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | 98 |
| గోదావరి | 85 | | |



# నిఫ్టీ టార్గెట్ 6000

## ఎగువ లక్ష్యం 10000-11500 : యూబీఎస్ అంచనా

న్యూఢిల్లీ : భారత ఈక్విటీ మార్కెట్లో కోవిడ్-19 మహమ్మారి కారణంగా ప్రస్తుత అమ్మకాల ధోరణి ఇలాగే కొనసాగితే నిఫ్టీ 6000 పాయింట్ల వరకు దిగజారవచ్చని యూబీఎస్ అంచనా. గత రెండు నెలల్లో భారత ఈక్విటీ మార్కెట్ 25 శాతం పతనమైంది. ఇటీవల కాలంలో అమ్మకాలు జోరుగా సాగుతున్నప్పటికీ 2020-21 సంవత్సరంలో నిఫ్టీ 14 శాతం వృద్ధితో గరిష్ఠ లక్ష్యం 11500, కనిష్ఠ లక్ష్యం 10000 మధ్యన కదలాడవచ్చని ఆ సంస్థ విశ్లేషకుడు గౌతమ్ చోచారియా అన్నారు. ప్రస్తుత కల్లోలం జూన్ చివరి వరకు కొనసాగవచ్చునని, అత్యంత క్లిష్ట సమయం మే నెలాఖరుతో ముగియవచ్చునని కూడా ఆయన అంచనా వేశారు. ప్రస్తుత లాక్‌డౌన్ ప్రభావం కార్పొరేట్ కంపెనీల ఆదాయాల వృద్ధిపై కూడా పడుతుందని, అది మరింత పొడిగించిన కొద్దీ రికవరీ మరింత జాప్యం అవుతుందని ఆయన తెలిపారు. ఆ రకంగా చూసినా కూడా గతంలో అంతర్జాతీయ ఆర్థిక సంక్షోభాల నాటి పరిస్థితినే పరిగణనలోకి తీసుకుంటే ఈ ఏడాది ఆదాయాల్లో వృద్ధి 2 శాతం ఉండవచ్చని అంచనా వేశారు.

### మార్కెట్‌కు మళ్లీ కరోనా భయం...

మంగళవారం రేసు గుర్రంలా పరిగెత్తిన స్టాక్ మార్కెట్ బుధవారం బ్రేక్ పడింది. కరోనా భయంతో మార్కెట్ మళ్లీ బేర్ మంది. అమ్మకాల ఒత్తిడితో సెన్సెక్స్ 173.25 పాయింట్ల నష్టంతో 29,893.96 వద్ద, 43.45 పాయింట్ల నష్టంతో నిఫ్టీ 8,748.75 వద్ద ముగిశాయి. కేంద్ర ప్రభుత్వం మరో ఉద్దీపన ప్యాకేజీ ప్రకటించబోతోందన్న వార్తలతో సెన్సెక్స్ ఇంట్రాడేలో ఒక దశలో 31,227.97 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరింది. అదే సమయంలో కరోనా విజృంభణను అరికట్టేందుకు లాక్‌డౌన్ మరింత పొడిగించే అవకాశం ఉందన్న వార్తలు వచ్చాయి. దాంతో సెన్సెక్స్ అక్కడి నుంచి దాదాపు 1,300 పాయింట్లకుపైగా నష్టపోయింది. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లు నష్టాల్లో ట్రేడవడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది.

### ఈ రంగాలపై దృష్టి పెట్టవచ్చు

ప్రస్తుతం మార్కెట్‌లో ఏర్పడిన భారీ క్షీణత ప్రభావం వల్ల బాగా తగ్గిన వినియోగ వస్తువులు, ఆయిల్, గ్యాస్, బ్యాంకింగ్ వంటి రంగాల షేర్లు కొనుగోలు చేయవచ్చని చోచారియా సూచించారు. మెటల్స్, మైనింగ్ విభాగాలు, హాస్పిటాలిటీ, టూరిజం రంగాలకు చెందిన మిడ్‌క్యాప్ షేర్లకు దూరంగా ఉండడం మంచిదని ఆయన అన్నారు.

### జీవిత కాల కనిష్ఠ స్థాయిలో రూపాయి

స్టాక్ మార్కెట్ పతన ప్రభావం రూపాయి పైనా కనిపించింది. డాలర్ మారకంలో రూపాయి విలువ 70 పైసలు తగ్గి రూ.76.34 వద్ద ముగిసింది. డాలర్‌తో రూపాయి మారకం రేటు, ఇంత కనిష్ఠ స్థాయికి పడిపోవడం ఇదే మొదటిసారి. స్టాక్ మార్కెట్‌లో కొనసాగుతున్న ఎఫ్‌పీఐల అమ్మకాలు, ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు పుంజుకోవడం, విజృంభిస్తున్న కరోనా వైరస్, ముడి చమురు దిగుమతి చెల్లింపుల కోసం, ఆయిల్ కంపెనీలు డాలర్లకు ఎగబడడం, బుధవారం ఫారెక్స్ మార్కెట్‌లో రూపాయిని దెబ్బతీసింది. వచ్చే కొద్ది రోజుల్లో డాలర్‌తో రూపాయి మారకం రేటు రూ.76.54 కూడా పడిపోయే ప్రమాదం ఉందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## కరోనాపై పోరుకు ఇండో-పాక్ సిరీస్

**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారిపై పోరాటం కోసం నిధులు సేకరించడానికి చిరకాల ప్రత్యర్థులైన ఇండో-పాక్ మధ్య వన్డే సిరీస్ నిర్వహించాలని పాకిస్థాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ ప్రతిపాదించాడు. ఉద్రిక్త పరిస్థితుల కారణంగా 2007 నుంచి భారత్, పాక్ మధ్య ద్వైపాక్షిక సిరీస్‌లు జరగలేదు. 'ఈ విపత్కర పరిస్థితుల్లో నిధుల సేకరణ కోసం దాయాది దేశాల మధ్య మూడు మ్యాచ్‌లు నిర్వహించాలని కోరుతున్నా. ఈ సిరీస్ ఫలితం గురించి ఇరు దేశాల అభిమానులు నిరాశపడరని భావిస్తున్నాన'ని అక్తర్ చెప్పాడు. ఈ సిరీస్ ద్వారా సేకరించిన మొత్తాన్ని వైరస్‌పై పోరాడేందుకు ఇరు దేశాలకు సమానంగా విరాళం ఇవ్వాలన్నాడు. 'విరాట్ సెంచరీ కొడితే మేం ఆనందపడతాం. బాబర్ ఆజమ్ శతకం బాదితే భారత ఫ్యాన్స్ కూడా ఎంజాయ్ చేస్తారు' అని షోయబ్ అన్నాడు. సుదీర్ఘ కాలం తర్వాత చిరకాల ప్రత్యర్థుల మధ్య మ్యాచ్‌లు జరిగితే ప్రేక్షకుల స్పందన భారీగా ఉంటుందని చెప్పాడు. షాహిద్ అఫ్రీది స్వచ్ఛంద సంస్థకు సహాయం చేయాల్సిందిగా యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్ విజ్ఞప్తి చేయడాన్ని కొందరు విమర్శించారు. అలాంటి విమర్శలు చేయడం అమానవీయమని అక్తర్ అన్నాడు.



## కరోనాతో ఇద్దరు మాజీ క్రీడాకారుల మృతి



**న్యూఢిల్లీ:** కరోనా మహమ్మారి ఇద్దరు మాజీ క్రీడాకారులను బలి తీసుకొంది. ఇటలీకి చెందిన మాజీ అథ్లెట్ డొనాటో సాబియా (56) కరోనా వైరస్‌తో పోరాడలేక బుధవారం తుదిశ్వాస విడిచాడు. సాబియా 1984 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో 800 మీ. పరుగులో 5వ స్థానం, 1988లో సియోల్‌లో జరిగిన ఒలింపిక్స్ 800 మీ. పరుగులో 7వ స్థానంలో నిలిచాడు. ఇక, స్విట్జర్లాండ్‌కు చెందిన ఐస్ హాకీ మాజీ ఆటగాడు రోజర్ చప్పాట్ (79) కొవిడ్-19 వైరస్ సోకి మరణించాడు. స్విస్ జట్టుకు రోజర్ వందకుపైగా మ్యాచ్‌ల్లో ప్రాతినిథ్యం వహించాడు. 1964 వింటర్ ఒలింపిక్స్‌లో రోజర్ ఆడాడు.

## కశ్యప్, సాయి ప్రణీత్ విరాళాలు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** తెలుగు షట్లర్లు పారుపల్లి కశ్యప్, సాయి ప్రణీత్ పీఎం, సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళాలు అందజేశారు. కశ్యప్ తెలంగాణ సీఎం సహాయ నిధికి రూ.3 లక్షల విరాళం ఇచ్చాడు. ఈ విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న వైద్య పోలీస్ సిబ్బందికి సెల్యూట్ చేయాలని కశ్యప్ ట్వీట్ చేశాడు. మరో షట్లర్ సాయి ప్రణీత్ రూ.3 లక్షలు ప్రధాని సహాయ నిధికి, రూ.1 లక్ష తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు బుధవారం అందించాడు.

## వరల్డ్ అథ్లెటిక్స్ నిర్ణయం

# భారత్‌కు శరాఘాతమే!



ద్యూతీ చంద్



హిమాదాస్

**న్యూఢిల్లీ:** టోక్యో విశ్వ క్రీడలు ఏడాది వాయిదా పడ్డాయి. దాంతో ప్రపంచ వ్యాప్తంగా ఒక్కో క్రీడా సమాఖ్య తమ క్రీడాంశాల ఒలింపిక్ అర్హత సమయాన్ని పొడిగిస్తూ వస్తున్నాయి. తాజాగా..వరల్డ్ అథ్లెటిక్స్ కూడా ఒలింపిక్స్ క్వాలిఫికేషన్ సమయాన్ని వచ్చే నవంబరు వరకు సస్పెండ్ చేసింది. ఈ నిర్ణయం..టోక్యో ఒలింపిక్స్‌కు అర్హత సాధించాలని భావిస్తున్న మన అథ్లెట్లకు శరాఘాతమే. వాస్తవంగా.. దేశవాళీ టోర్నమెంట్ల ద్వారా ఒలింపిక్ మార్క్‌ను అందుకొని టోక్యో బెర్త్ దక్కించుకోవాలని పలువురు ట్రాక్, ఫీల్డ్ అథ్లెట్లు పట్టుదలగా ఉన్నారు. కానీ కరోనా దెబ్బకు దేశం మొత్తం లాక్‌డౌన్‌లో ఉండడంతో ఎలాంటి క్రీడా పోటీలకు అవకాశం లేకుండా పోయింది. మరోవైపు ఒలింపిక్ అర్హత సమయాన్ని ఈనెల ఆరునుంచి వచ్చే నవంబరు 30 వరకు అంటే..ఏడు నెలలకుపైగా వరల్డ్ అథ్లెటిక్స్ సస్పెండ్ చేసింది. ఈ ఏడు నెలలలో జరిగే ఏ టోర్నీలోనైనా అథ్లెట్లు సాధించిన ఫలితాలను టోక్యో ఒలింపిక్స్‌కు పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం దేశంలోని పలువురు అథ్లెట్లకు చేటు చేస్తుందని నేషనల్ డిప్యూటీ చీఫ్ కోచ్ రాధాకృష్ణన్ నాయర్ ఆందోళన వ్యక్తం చేశాడు. 'వరల్డ్ అథ్లెటిక్స్ నిర్ణయం తేజిందర్ పాల్ తూర్ (షాట్‌పుట్), అన్నూరాణి (జావెలిన్ త్రో), శ్రీశంకర్ (లాంగ్‌జంప్), స్టార్ స్ప్రింటర్ ద్యూతీచంద్‌కు నష్టం చేస్తుంది' అని అతడు అన్నాడు. మరో స్టార్ స్ప్రింటర్ హిమాదాస్ కూడా ఒలింపిక్స్‌కు అర్హత సాధించకపోవడం గమనార్హం. అయితే జావెలిన్ త్రోయర్లు నీరజ్ చోప్రా, శివపాల్ సింగ్, 4×400 మీ., మిక్స్‌డ్ రిలే జట్లు, ఇర్ఫాన్ (20 కి.మీ., రేస్‌వాక్), భావన జాట్ (20 కి.మీ., రేస్‌వాక్), అవినాష్ (3వేల మీ., స్టీపుల్‌చేజ్) మాత్రం టోక్యో బెర్త్‌లు ఖరారు చేసుకున్నారు. 2019 నుంచి ప్రారంభమైన అర్హత సమయంలో ఒలింపిక్ మార్క్‌ను అందుకున్న క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందీ ఉండదని వరల్డ్ అథ్లెటిక్స్ పేర్కొంది. కొవిడ్-19 వైరస్ ఎప్పటికి తగ్గుముఖం పడుతుందో ఏ దేశానికీ కచ్చితమైన అంచనాలు లేవని, అందువల్లే క్వాలిఫికేషన్ సమయాన్ని వరల్డ్ అథ్లెటిక్స్ ఫ్రీజ్ చేసి ఉంటుందని నాయర్ అభిప్రాయపడ్డాడు. అదే సమయంలో క్వాలిఫికేషన్ కోసం అథ్లెట్లకు రెండేళ్ల సమయాన్ని కేటాయించడం కూడా సబబు కాదని వ్యాఖ్యానించాడు. సెప్టెంబరు, అక్టోబరులో నేషనల్ ఇంటర్ స్టేట్, నేషనల్ ఓపెన్ చాంపియన్‌షిప్‌ను నిర్వహించాలని అథ్లెటిక్స్ సమాఖ్య యోచిస్తోందని రాధాకృష్ణన్ చెప్పాడు. అయితే ఆ టోర్నీల ఫలితాలను ఒలింపిక్స్ అర్హతకు పరిగణనలోకి తీసుకోకపోవడంతో అథ్లెట్లు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే అవకాశాలు లేవన్నాడు.

## బోర్డ్ గేమ్స్‌లో విరాట్ బిజీ



**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్ సమయంలో విరాట్ కోహ్లీ.. అనుష్క శర్మ, ఆమె తల్లిదండ్రులతో ఇంట్లో సరదాగా గడుపుతున్నాడు. అందరూ కలసి మోనోపలీ బోర్డ్ గేమ్ ఆడుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఇలా గేమ్ ఆడుతున్నప్పటి సంతోష క్షణాలను అనుష్క ఇన్‌స్టాలో షేర్ చేసింది. ఈ సందర్భంగా కుటుంబ విలువల గురించి భావోద్వేగ పోస్టు చేసింది. 'చిన్ననాటి నుంచి మనల్ని కంటిరెప్పలా కాపాడుతున్న కుటుంబం నుంచే జీవిత ప్రయాణం ఎలా చేయాలి, సమాజంలో ఎలా మెలగాలి, ఈ ప్రపంచాన్ని ఎలా ఎదుర్కోవాలనేది కూడా వారి నుంచే నేర్చుకున్నాం. అలా నేర్చుకున్నవే జీవితాంతం మనపై ప్రభావం చూపుతాయ'ని అనుష్క రాసింది. 'ఇంట్లోనే ఉండండి. ప్రియమైన వారిని సంరక్షించుకోండి. దొరికిన సమయాన్ని సంతోషంగా ఆస్వాదించండి. హాయిగా నవ్వండి, ఆప్యాయతలను కురిపించండి, అపార్థాలను దూరం చేసుకోండి, బంధాలను మరింత బలోపేతం చేసుకోండి, జీవిత స్వప్నాల గురించి ఇతరులతో పంచుకోండి.. మెరుగైన రేపటి కోసం ప్రార్థించండి. ఈ అనుభవాలను రేపటి రోజు ఉపయోగించుకోవాలి. ఈ ప్రపంచాన్ని చూసే దృక్పథం ఇకనైనా మారుతుంది' అని శర్మ ఆశాభావం వ్యక్తం చేసింది. చివరగా గేమ్ హోరాహోరీగా సాగిందని చెప్పినా.. విజేత ఎవరనేది సస్పెన్స్‌లో ఉంచింది. కానీ, విరాట్ గెలిచాడని ఆ తర్వాత తెలిపింది.

## 'విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్'గా స్టోక్స్



**లండన్:** ప్రతిష్ఠాత్మక 'విజ్డెన్ లీడింగ్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్'గా ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఎంపికయ్యాడు. ఈ క్రమంలో గత మూడేళ్లుగా ఈ అవార్డును సొంతం చేసుకుంటున్న కోహ్లీ ఆధిపత్యానికి గండికొట్టాడు. 2019లో అద్భుత ప్రదర్శన చేసినందుకుగాను స్టోక్స్‌కు ఈ గౌరవం దక్కింది. ఇంగ్లండ్ వరల్డ్‌కప్ సాధించడంలో స్టోక్స్ కీలకపాత్ర పోషించాడు. 2005లో ఆండ్రూ ఫ్లింటాఫ్ తర్వాత ఈ గౌరవాన్ని దక్కించుకున్న తొలి ఇంగ్లండ్ ప్లేయర్‌గా స్టోక్స్ నిలిచాడు. 28 ఏళ్ల స్టోక్స్ 2019లో టెస్ట్‌ల్లో 821 పరుగులు, వన్డేల్లో 719 పరుగులు సాధించాడు. ఇక, 'లీడింగ్ ఉమన్ క్రికెటర్ ఇన్ ది వరల్డ్'గా ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ ఎంపికైనట్టు 2020 విజ్డెన్ క్రికెటర్స్ అల్మానాక్ ఎడిషన్‌లో ప్రచురించారు. టీమిండియా బ్యాట్స్‌వుమన్ స్మృతి మంధాన నుంచి ఈ టైటిల్ పెర్రీ కైవసం చేసుకుంది. మహిళల యాషెస్‌లో పెర్రీ అద్భుత ప్రదర్శన చేసింది.

## ఐపీఎల్ వాయిదానా...రద్దా? ఏదో ఒకటి తేల్చండి!

**న్యూఢిల్లీ:** కరోనా వైరస్ విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా టోర్నీలు రద్దు లేదా వాయిదా పడుతున్నాయి. దేశంలో లాక్‌డౌన్ ప్రకటించడంతో ఐపీఎల్‌ను ఈ నెల 15కు వాయిదా వేశారు. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ కూడా ఐపీఎల్‌పై స్పష్టత ఇవ్వలేక పోతోంది. దీంతో మెగా లీగ్‌పై ఆశలు పెట్టుకున్న విదేశీ ఆటగాళ్లు వేచి చూస్తున్నారు. అయితే, ఐపీఎల్‌పై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని ఇంగ్లండ్, రాజస్థాన్ రాయల్స్ ప్లేయర్ జోస్ బట్లర్ కోరుతున్నాడు. ఎంతో ప్రతిష్ఠాత్మక లీగ్‌ను రద్దు చేయడం లేదా షెడ్యూల్ మార్చడం అవమానకరమన్నాడు. 'నాకేమీ ప్రత్యేక సమాచారం తెలియదు. ప్రస్తుతం అనిశ్చితి నెలకొంది. ఇలాగే ఎంత కాలం కొనసాగుతుందో చెప్పలేం. ఇలాంటి పరిస్థితుల్లో అసలు లీగ్‌ను నిర్వహిస్తారా? లేదా? అనేది కూడా చెప్పలేం. కానీ, నేను మాత్రం భారీగా ఆదాయాన్ని ఆర్జించే ఐపీఎల్ లాంటి మెగా టోర్నీ జరగాలనే కోరుకుంటా. ఐపీఎల్‌ను రద్దు చేయడం లేదా ఇందుకోసం ఖరారైన షెడ్యూల్‌లో మార్పులు చేయడం అవమానకరంగా భావిస్తాన'ని బట్లర్ అన్నాడు.



**బట్లర్ జెర్సీ @ 60 లక్షలు!**

ఇంగ్లండ్ కీపర్ జోస్ బట్లర్ జెర్సీకి వేలంలో కళ్లు చెదిరే ధర పలికింది. న్యూజిలాండ్‌తో గత ఏడాది జరిగిన వన్డే వరల్డ్‌కప్ ఫైనల్లో అతడు వేసుకున్న ఈ టీషర్ట్ వేలంలో రూ. 60 లక్షల 80 వేలకుపైగా రేటుకు అమ్ముడుపోయింది. కరోనాపై పోరుకు చేయూత ఇచ్చేందుకు బట్లర్ ఆ టీషర్ట్‌ను వేలం వేయాలని నిర్ణయించుకున్నాడు.

### టోర్నీ జరుగుతుంది..: స్మిత్



ఐపీఎల్ కచ్చితంగా జరుగుతుందని ఆస్ట్రేలియా బ్యాట్స్‌మన్ స్టీవ్ స్మిత్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు. ప్రపంచ వ్యాప్తంగా విపత్కర పరిస్థితులు నెలకొన్నా.. ఏదో ఒక సమయంలో లీగ్‌ను నిర్వహిస్తారని భావిస్తున్నానన్నాడు. రాజస్థాన్ రాయల్స్ జట్టుకు స్మిత్ సారథ్యం వహిస్తున్నాడు. కెప్టెన్‌గా ఈసారి పూర్తిస్థాయి లీగ్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు.

### అక్టోబరులోనే సాధ్యం: నెహ్రా

కరోనా వైరస్ అదుపులోకి వస్తే.. ఈ ఏడాది చివరి త్రైమాసికంలో ఐపీఎల్ జరిగే అవకాశం ఉందని మాజీ పేసర్ ఆశిష్ నెహ్రా అభిప్రాయపడ్డాడు. అక్టోబరులో నిర్వహించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నాడు.

## ఆసుపత్రిలో గంగూలీ తొలి కోచ్

**కోల్‌కతా:** టీమిండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ తొలి కోచ్ అశోక్ ముస్తఫీ ఆసుపత్రి పాలయ్యారు. అశోక్ ఆసుపత్రిలో చేరారన్న విషయాన్ని తన మిత్రుడు సంజయ్ దాస్ ద్వారా తెలుసుకున్న బీసీసీఐ చీఫ్ సౌరవ్..వెంటనే ఆయనకు చికిత్స చేయించే బాధ్యతలను స్వయంగా తీసుకున్నాడు.

## అఫ్రీది ఆల్‌టైమ్ లెవెన్‌లో సచిన్



**కరాచీ:** పాకిస్థాన్ మాజీ డాషింగ్ బ్యాట్స్‌మన్ షాహిద్ అఫ్రీది తన ఆల్‌టైమ్ లెవెన్ జట్టును ప్రకటించాడు. ఇందులో సచిన్ టెండూల్కర్, రికీ పాంటింగ్‌కు చోటు కల్పించాడు. పాంటింగ్‌ను మూడు, సచిన్‌ను నాలుగో నెంబర్ బ్యాట్స్‌మెన్‌గా ప్రతించాడు. ఓపెనర్లుగా సయీద్ అన్వర్, ఆడమ్ గిల్‌క్రిస్ట్‌ను తీసుకున్న అఫ్రీది..కీపర్‌గా రషీద్ లతీఫ్‌ను ఎంపిక చేయడం గమనార్హం.

**అఫ్రీది జట్టు:** అన్వర్, గిల్‌క్రిస్ట్, పాంటింగ్, సచిన్, ఇంజమామ్, కలిస్, రషీద్ లతీఫ్, అక్రమ్, వార్న్, మెక్‌గ్రాత్, షోయబ్ అక్తర్.

# ఇక వేగంగా నిర్ధారణ!

**▸▸ అందుబాటులోకి సరికొత్త కిట్లు.. గంటలోపే కరోనా నిర్ధారణ**

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేగాన్ని ప్రదర్శించడం లేదని, దీనివల్ల వైరస్ బాధితులు భారీగా పెరిగిపోయే ప్రమాదం వుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రతిరోజూ దేశంలో 10వేల శాంపిల్స్ మాత్రమే పరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసి విశాఖలోని మెడ్‌టెక్ జోన్‌లో సరికొత్త టెస్టింగ్ కిట్లను తయారు చేయించింది. వీటితో 55 నిమిషాల్లోనే ఫలితం తెలుస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కరోనా టెస్టింగ్ ల్యాబ్, తాజాగా అందుబాటులోకి వచ్చిన కిట్లతో చేసే పరీక్షలకు మధ్య తేడాపై సర్వత్రా చర్చ సాగుతోంది. ఈ రెండు టెస్టుల్లో అనుసరించే విధానం, ఫలితం ఎలా ఉంటోందో అన్నదానిపై ప్రత్యేక కథనం.

### కరోనా టెస్టింగ్ ల్యాబ్‌లో..

ప్రస్తుతం కరోనా టెస్టింగ్ ల్యాబ్‌లు రాష్ట్రంలో కొద్దిచోట్ల మాత్రమే ఉన్నాయి. రోజుకు ఒక ల్యాబ్‌లో 100-120 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించే అవకాశముంది. వైరస్ బారినపడిన వ్యక్తి నుంచి వెవల్ ట్రాన్స్‌పోర్ట్ మీడియం(వీటీఎం) పరికరంతో నోటి, ముక్కు నుంచి స్వాబ్(కఫం) సేకరిస్తారు. దీన్ని కూల్ ప్యాక్‌లో ల్యాబ్‌కి తీసుకువచ్చి ఆర్ఎన్ఏ ఎక్స్‌ట్రాక్ట్ మెషిన్ వినియోగించి మాన్యువల్ పద్ధతిలో ఆర్ఎన్ఏను ఎక్స్‌ట్రాక్ట్ చేస్తారు. ఈ విధంగా వచ్చిన ఆర్ఎన్ఏ ఎక్స్‌ట్రాక్ట్‌కు ఇతర రీజన్స్, శాంపిల్స్ యాడ్ చేస్తారు. దీనికి రెండున్నర గంటల సమయం పడుతుంది. అనంతరం దీన్ని ఆర్‌టీపీ సీఆర్ మెషిన్‌లో లోడ్ చేస్తారు. రెండున్నర గంటల తర్వాత గ్రాఫికల్ రెవల్యూషన్ రీడింగ్ వస్తుంది. ఈ రీడింగ్‌లో కంట్రోల్స్‌ను రన్ చేసి.. నమూనాలు తీసుకువచ్చిన వ్యక్తికి వైరస్ ఉన్నదీ, లేనిదీ నిర్ధారిస్తారు. ఒక లోడ్ పరీక్షించడానికి 5-6 గంటలు పడుతుంది.

### గంటలోపే ఫలితం

మెడ్‌టెక్ జోన్‌లో తాజాగా తయారు చేసిన కిట్‌లతో గంటలోపే ఫలితాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఈ కిట్లను టీబీ నిర్ధారణ చేసే ట్రూనెట్ యంత్రాల సహాయంతో పరీక్షలు నిర్వహించనున్నారు. మెడ్‌టెక్ జోన్‌లో ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన కిట్లను ఈ కేంద్రాల్లోని మెషిన్లను వినియోగించి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు. టీబీ నిర్ధారణ మాదిరిగానే స్వాబ్ శాంపిల్స్ తీసుకుని పరీక్షించనున్నారు.

### రూ.1200కే కిట్: మేకపాటి

విశాఖలోని మెడ్‌టెక్ జోన్‌లో యుద్ధప్రాతిపదికన తయారవుతున్న కరోనా ర్యాపిడ్ టెస్టింగ్ కిట్ ద్వారా కరోనా ఫలితాన్ని కేవలం గంట వ్యవధిలోనే తెలుసుకునే అవకాశం కలిగినట్టు మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి వెల్లడించారు. సచివాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం కిట్ ధర మార్కెట్‌లో రూ.4500 ఉండగా, తాము రూ.1200కే అందిస్తున్నట్టు తెలిపారు. పరిశ్రమల శాఖ తరపున 1000 టెస్టింగ్ కిట్లను ప్రభుత్వానికి అందజేస్తున్నట్టు మంత్రి గౌతమ్‌రెడ్డి తెలిపారు. ఏపీఐఐసీ ఉద్యోగులు తమ ఒకరోజు వేతనం సీఎం సహాయనిధికి అందజేశారన్నారు.

## పది రాష్ట్రాల్లో ఏపీ వాసులు

**▸▸ కొవిడ్ టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ కృష్ణబాబు**

విజయవాడ, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దేశంలోని 10 రాష్ట్రాల్లో తెలుగు విద్యార్థులు, ఇక్కడి కూలీలు సుమారు 8,153 మంది చిక్కుకున్నారని కొవిడ్-19 టాస్క్‌ఫోర్స్ కమిటీ చైర్మన్ ఎంటీ కృష్ణబాబు చెప్పారు. విజయవాడలోని ఆర్ అండ్ బీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. వారి బాగోగుల కోసం ఎప్పటికప్పుడు అధికారులు ఆయా రాష్ట్రాల అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నారన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మత్స్యకారులు 6 వేలమంది గుజరాత్‌లో చిక్కుకుపోవడంతో మత్స్యకార సంఘాలకు చెందిన నలుగురు ప్రతినిధులను అక్కడికి పంపించామన్నారు. తమిళనాడులోని పునరావాస కేంద్రాల్లో ఉన్న 1,412 మంది ఏపీ వాసులకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆ రాష్ట్ర సీఎంను ప్రభుత్వం కోరిందన్నారు.

## కొవిడ్ కంట్రోల్ రూమ్‌కు డిప్యూటీ కలెక్టర్లు

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా(కొవిడ్-19) కేసులకు చికిత్స అందిస్తున్న ఆస్పత్రుల సమన్వయం కోసం రాష్ట్ర ప్రధాన కంట్రోల్ రూమ్‌కు 10 మంది డిప్యూటీ కలెక్టర్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. రానున్న రోజుల్లో కరోనా కేసులు పెరిగితే ఆస్పత్రులను సమన్వయపర్చడం, సమస్యలు ఎదురైతే సత్వర పరిష్కారానికి కార్యాచరణ రూపొందించడం వీరి పని. కరోనా పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న వీఆర్‌డీఎల్ ల్యాబ్‌లతోపాటు ఇతర ల్యాబ్‌ల పర్యవేక్షణకు ఇన్‌చార్జిలుగా ఐఏఎస్ అధికారులను నియమిస్తూ సర్కారు మరో ఉత్తర్వు ఇచ్చింది.

## డీజీపీ కార్యాలయంలో సేఫ్ టన్నెల్

కొవిడ్-2019 నివారణలో భాగంగా పలు రకాల సూక్ష్మక్రిములను నివారించే 3వీ సేఫ్ టన్నెల్‌ను మంగళగిరి పోలీస్ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేశారు. ఎస్-3వీ వాస్కులర్ టెక్నాలజీస్ ఏర్పాటు చేసిన ఈ టన్నెల్‌ను డీజీపీ గౌతమ్ సవాంగ్, అడిషనల్ డీజీపీ హరీష్ కుమార్ తదితర ఐపీఎస్ అధికారులు పరిశీలించారు.

## 'సాయం'లో భౌతిక దూరం తప్పనిసరి: సీఎస్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు ప్రభుత్వంతోపాటు దాతలు అందించే సహాయ కార్యక్రమాల వద్ద ప్రజలు గుమికూడకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని ఆదేశించారు. బుధవారం విజయవాడ నుంచి డీజీపీ, కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

## వేద పాఠశాల విద్యార్థికి స్వల్ప అనారోగ్యం

తిరుమల, ఏప్రిల్ 8: తిరుమలలోని వేదపాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థి స్వల్ప అనారోగ్యానికి గురయ్యాడు. జలుబు, దగ్గు, విరేచనాలతో బుధవారం స్థానిక అశ్విని ఆస్పత్రికి వచ్చాడు. గతనెల 13న ముంబైలో జరిగిన ఓ యాగానికి వెళ్లి 15న తిరుమలకు చేరుకున్నట్టు అతను వైద్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో ముందు జాగ్రత్తగా వైద్యపరీక్షల కోసం ఆ విద్యార్థితో పాటు మరో ముగ్గురిని కూడా తిరుపతి స్విమ్స్‌కు తరలించారు.

## మసీదులో కజికిస్తాన్ దేశీయులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 8: విజిటింగ్ వీసా నిబంధనలను అతిక్రమించి గుంటూరు జిల్లా సత్తెనపల్లిలోని పెద్దమసీదులో ఉంటున్న 10మంది కజికిస్తాన్ దేశీయులను పోలీసులు గుర్తించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో కొత్త వ్యక్తులు మసీదులో ఉండటంతో స్థానికులు వీఆర్వో తోట శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. మతప్రచారం నిమిత్తం వీరు మార్చి 18న సత్తెనపల్లి వచ్చారని, లాక్‌డౌన్ కారణంగా ఎక్కడికీ వెళ్లలేక మసీదులో ఉన్నట్టు గుర్తించారు.

## ఫోన్ కాల్‌తో పరిష్కారం

**▸▸ 104, 1902 కాల్ సెంటర్లకు ప్రజల నుంచి మంచి స్పందన**

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో అమలవుతున్న లాక్‌డౌన్ కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడినా వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాల్ సెంటర్లకు మంచి స్పందన వస్తోంది. మొత్తం 11 ముఖ్య ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తూ ఏర్పాటు చేసిన 104, 1902 కాల్ సెంటర్లకు గత వారం రోజుల్లో 12 వేలకు పైగా ఫోన్ కాల్స్ వచినట్టు సమాచార శాఖ కమిషనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. ఆరోగ్యపరమైన సాధారణ సమస్యల పరిష్కారానికి 104, నిత్యావసరాల లభ్యత, రవాణ, అత్యవసర సమస్యలకు 1902 కాల్ సెంటర్‌కు ఫోన్లు వస్తున్నట్టు చెప్పారు.

**104 సేవలు:** ఆరోగ్యశ్రీ ఆధ్వర్యంలో 24 గంటలూ 104 సేవా కేంద్రం పనిచేస్తోంది. టెలిమెడిసిన్ పద్ధతిలో సాధారణమైన అన్ని రోగాలకు వైద్య సేవలు అందిస్తున్నారు. కరోనా లక్షణాలను, ముందు జాగ్రత్తలను కూడా వివరిస్తున్నారు.

**1902 సేవలు:** వైద్య, ఆరోగ్యం మినహా అన్ని రకాల సేవలకు ఈ కాల్ సెంటర్ పనిచేస్తోంది. నిత్యావసర వస్తువుల రవాణా, రైతులకు కనీసం మద్ధతు ధర, సరుకుల లభ్యతలపై నిరంతరం పర్యవేక్షణ, రైతులకు గిట్టుబాటు ధర లేకున్నా, మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెంచినా, నిత్యావసర వస్తువుల లభ్యత లేకున్నా తూకంలో మోసాల పరిష్కారానికి 1902కు ఫిర్యాదు చేయొచ్చు.



విజయవాడ బెంజ్ సర్కిల్ వద్ద బుధవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో రోడ్డుపైకి వచ్చిన వారికి పోలీసుల వినతి



రెడ్‌జోన్ పరిధిలో ఉన్న విజయవాడ కృష్ణ లంకలో డ్రోన్ ద్వారా ద్రావకం స్ప్రే చేస్తున్న సిబ్బంది



గన్నవరం గ్రామంలో పారిశుధ్య కార్మికులను సత్కరించిన దృశ్యం

# కరోనా 'వార్!'



(మొదటి పేజీ తరువాయి)

11 బోధనాస్పత్రుల్లో ఒక్క కర్నూలు మినహా మిగిలిన పదింటిని కొవిడ్ ఆస్పత్రులుగా మార్చారు. అక్కడ... ప్రభుత్వ వైద్యులు, సిబ్బందే సేవలు అందిస్తున్నారు. ఒక్క కర్నూలు జిల్లా మాత్రమే దీనికి మినహాయింపు! 75 కరోనా కేసులతో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్న కర్నూలు జిల్లాలో విచిత్రమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడి ప్రభుత్వ ఆస్పత్రిలో కాకుండా... ప్రైవేటు యాజమాన్యాలకు చెందిన విశ్వభారతి మెడికల్ కాలేజీ, నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కాలేజీలలో కరోనా చికిత్సలు అందిస్తున్నారు. అది కూడా పూర్తిగా ప్రైవేటు వైద్యులు, సిబ్బందితోనే!

### జీజీహెచ్‌కు ఏమైంది?

కొవిడ్-19 రోగులకు తొలుత ప్రభుత్వాసుపత్రుల్లోనే చికిత్స అందించాలి. ఆ తర్వాత ప్రాధాన్య క్రమంలో... ప్రైవేట్ మెడికల్ కాలేజీలు, ఆరోగ్యశ్రీ వర్తించే ప్రైవేట్ ఆస్పత్రులు, తప్పనిసరి పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ లేని ఆస్పత్రులను వాడుకోవాలి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇదే సూత్రం అమలవుతోంది. కానీ... కర్నూలులో మాత్రం జీజీహెచ్‌కు పూర్తి మినహాయింపు ఇచ్చారు. 250 ఎకరాల విస్తీర్ణంలో, వెయ్యి పడకల సామర్థ్యం, 400 మందికి పైగా వైద్యులు, 3వేల మంది సిబ్బంది పనిచేస్తున్న కర్నూలు ప్రభుత్వాస్పత్రికి ఎంతో పేరుంది. అయినప్పటికీ... దీనిని కొవిడ్ హాస్పిటల్‌గా గుర్తించలేదు. దీనిని వెనుక ఆస్పత్రికి చెందిన ఇద్దరు ఉన్నతాధికారుల కుట్ర ఉన్నట్లు తెలుస్తోంది. 'మనకెందుకీ తిప్పలు. కరోనా కేసులొస్తే రాత్రింబవళ్లు పని చేయాలి. పైగా... వైరస్ మనకు అంటుకుంటుందేమో అనే భయం. వాటిని అన్నీ ప్రైవేటుకు పంపిద్దాం" అని వారు ఒక ఆలోచనకు వచ్చారు. కలెక్టర్‌ను కలిసి... నగరం నడిబొడ్డున జీజీహెచ్‌లో కరోనా రోగులను ఉంచడం మంచిది కాదని భయపెట్టి, ప్రైవేటు ఆస్పత్రులను కొవిడ్ ఆస్పత్రులుగా గుర్తించాలని ఉచిత సలహా పడేశారు. జిల్లా కలెక్టర్ ముందూ వెనుకా ఆలోచించకుండా ఈ సలహాను అమలు చేసినట్లు తెలిసింది. శ్రీకాకుళం నుంచి అనంతపురం దాకా అన్ని ప్రభుత్వాస్పత్రులు నగరం నడిబొడ్డునే ఉన్నాయి. వాటన్నింటినీ కొవిడ్ ఆస్పత్రులుగానే గుర్తించారు. కానీ... ఒక్క కర్నూలులో మాత్రమే నగరం మధ్యలో ఉందనే కారణం చెబుతున్నారు. మరో చిత్రమేమిటంటే... కరోనా చికిత్సల్లో ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఒక్కరూ పాల్గొనడంలేదు. కడప జిల్లాలో ఫాతిమా మెడికల్ కాలేజీని కొవిడ్ ఆస్పత్రిగా గుర్తించినప్పటికీ... రిమ్స్‌కు చెందిన ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు. కర్నూలు వైద్యులు అదీ చేయట్లేదు. 'కూల్' గా ఔట్ పేషంట్‌ను చూసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులకు 'కొవిడ్' డ్యూటీలు వేస్తూ జీజీహెచ్ వైద్యుల జోలికి వెళ్లడంలేదు.

> **సిటీ మధ్యలో మంచిది కాదని..**
>
> ప్రభుత్వాసుపత్రికి వచ్చే ఓపీలలో ఈ మధ్య కరోనా అనుమానిత కేసులు ఎక్కువగా ఉన్నాయి. వారిని ప్రత్యేక వార్డుల్లో ఉంచాలి. అలాగే కొవిడ్ పాజిటివ్ కేసుల్ని నగరం నడి మధ్యలో ఉంచడం కూడా సరైన పని కాదని నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్, విశ్వభారతి మెడికల్ కాలేజీతోపాటు నగరంలోని ఓ మూడు ప్రైవేట్ ఆసుపత్రులను కొవిడ్ ఆస్పత్రులుగా నిర్ధారించాం. అత్యవసరమనుకుంటే చివరి ప్రాధాన్యత కింద కర్నూలు జీజీహెచ్‌లోనూ కొవిడ్ పాజిటివ్ కేసులను జాయిన్ చేసుకుంటాం.
>
> **- డాక్టర్ రామ్‌ప్రసాద్, కర్నూలు జీజీహెచ్**

జిల్లాల వారీగా కేసుల వివరాలు....

| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
|---|---|---|
| అనంతపురం | 13 | |
| చిత్తూరు | 20 | |
| తూర్పు గోదావరి | 11 | 1 |
| గుంటూరు | 49 | |
| కడప | 28 | |
| కృష్ణా | 35 | 2 |
| కర్నూలు | 75 | |
| నెల్లూరు | 48 | 1 |
| ప్రకాశం | 27 | 1 |
| విశాఖపట్నం | 20 | 4 |
| పశ్చిమగోదావరి | 22 | |
| మొత్తం | 348 | 9 |

### ఎంత గొప్ప ప్రణాళిక

కరోనా పాజిటివ్ రోగులకు చికిత్స అందించేందుకు రూపొందించుకున్న ప్రణాళికను చూసి డాక్టర్లే విస్తుపోతున్నారు. పాజిటివ్‌లో 'మైల్డ్, మోడరేట్' కేసులకు చికిత్స చేసేందుకు 6 ఆస్పత్రులను గుర్తించారు. అందులో మొదటి ఐదు ప్రైవేటువే. ఆరోది... కర్నూలు ప్రభుత్వాసుపత్రి. ఇక... పరిస్థితి విషమించిన కేసులను ప్రాధాన్య క్రమంలో నెల్లూరు జీజీహెచ్‌కు, తిరుపతిలోని పద్మావతి మెడికల్ కాలేజీకి పంపించాలట! పరిస్థితి కిష్టంగా ఉన్న రోగిని కర్నూలు నుంచి వందల కిలోమీటర్లలో ఉన్న ఆస్పత్రులకు పంపించాలని నిర్ణయించడం ప్రాణాలతో చెలగాటమాడటమే! ఇక... ఈ జాబితాలో మూడో ఆప్షన్‌గా నంద్యాలలోని శాంతిరామ్ మెడికల్ కాలేజీని చేర్చారు. కర్నూలు జీజీహెచ్ మాత్రం ఎక్కడా లేదు.

### ఎవరైతే ఏమిటి?

చికిత్స ఎక్కడైనా జరగొచ్చు! ఎవరైనా చేయొచ్చు! రోగులకు ఉపశమనం లభించడమే ముఖ్యం కదా.. అని అనుకోవచ్చు! జిల్లాలో కరోనా కేసులు ఒక్కసారిగా పెరుగుతున్న ఈ కీలక సమయంలో... తమపైనే మొత్తం భారాన్ని మోపడంపై ప్రైవేటు వైద్యులు మండిపడుతున్నారు. "ఎన్-95 మాస్కులు, పీపీఈలు ఇవ్వకుండానే కరోనా రోగులకు చికిత్స చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్రైవేటు వైద్యుల ఎంపికలోనూ చిత్ర విచిత్రాలు చోటు చేసుకుంటున్నాయి. కరోనా చికిత్సతో ఏమాత్రం సంబంధంలేని కార్డియాలజిస్టులు, ఆర్థోపెడిషియన్లు, సైకాలజిస్టులకు కూడా కబురుపెట్టారు. మరీ దారుణమేమిటంటే... ఇటీవలే బిడ్డకు జన్మనిచ్చిన లేడీ డాక్టర్లను కూడా కరోనా చికిత్సలకోసం రావాలని ఆదేశించారు" అని ఒక వైద్యుడు తెలిపారు. రాకపోతే ఎస్మా కింద చర్యలు తప్పవని జిల్లా యంత్రాంగం హెచ్చరికలు పంపిస్తోంది. దీనిపై ప్రైవేటు వైద్యులు కస్సుమంటున్నారు. "కరోనా రోగులకు చికిత్స అందించేందుకు మేమూ సిద్ధం. కానీ, చికిత్సల్లో కర్నూలు జీజీహెచ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రభుత్వ వైద్యులు, సిబ్బందీ ఈ విధుల్లోకి రావాలి. ఆ తర్వాతే మాకు విధులు అప్పగించాలి. ఎన్-95 మాస్కులు, పీపీఈలు ఇవ్వాలి. అలాగైతేనే రోగులకు చికిత్స అందిస్తాం. లేకపోతే... లేదు. కావాలంటే అరెస్టు కూడా చేసుకోవచ్చు" అని ప్రైవేటు వైద్యులంతా ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. పని భారం, రిస్క్ తప్పించుకునేందుకే జీజీహెచ్‌కు చెందిన ఇద్దరు అధికారులు కరోనా కేసులను 'ప్రైవేటు'కు అప్పగించేలా కుట్ర పన్నారని ప్రైవేటు డాక్టర్లు ఆరోపిస్తున్నారు.

## వైద్య సిబ్బందికి వైరస్

(మొదటి పేజీ తరువాయి)

ఒక కరోనా కేసు నమోదయ్యాయి. అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో పనిచేస్తున్న డాక్టర్, హౌస్‌సర్జన్, ఇద్దరు స్టాఫ్‌నర్సులకు కరోనా సోకింది. హిందూపురం, కర్ణాటకలోని గౌరీబిదనూరుకు చెందిన 45 మంది మార్చిలో మక్కాకు వెళ్లి వచ్చారు. వారందరికీ కరోనా పరీక్షలు చేశారు. వీరిలో ఆరుగురికి లక్షణాలు బయటపడటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో వారిలో ఒకరు చనిపోయారు. ఆయనకు వైద్యమందించిన డాక్టర్, హౌస్‌సర్జన్, ఇద్దరు స్టాఫ్‌నర్సులకు పాజిటివ్ వచ్చిందని ఆస్పత్రి వర్గాలు పేర్కొన్నాయి. అలాగే మక్కాకు వెళ్లొచ్చిన వారితో సంబంధాలున్న ఇద్దరు హిందూపురం వాసులకు, కళ్యాణదుర్గానికి చెందిన మరో వృద్ధుడికీ పాజిటివ్ వచ్చింది.

### అనంతలో వృద్ధుడి మృతి

కరోనా లక్షణాలతో అనంతపురం జిల్లా కళ్యాణదుర్గానికి చెందిన వృద్ధుడు(70) వారం క్రితం ఆస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించారు. ఆయన కరోనా పాజిటివ్‌తో చనిపోయినట్లు బుధవారం సాయంత్రం అధికారికంగా ప్రకటించారు.

కాగా, గుంటూరు జిల్లాలో మరో 9మందికి కరోనా నిర్ధారణ అయింది. వీరిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి పాజిటివ్ వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా నుంచి వలస వచ్చి గుంటూరులో నివసిస్తున్న ఓ కూలీకి కూడా వైరస్ సోకింది. కృష్ణాజిల్లా విజయవాడలో మరో 6పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. నెల్లూరు జిల్లాలో మరో ఐదుగురికి కరోనా సోకింది. ఢిల్లీ వెళ్లి వచ్చిన ఓ వ్యక్తి కుటుంబానికి చెందిన ఇద్దరు మహిళలు చిత్తూరు జిల్లా నగరిలో వైరస్ బారిన పడ్డారు. ఇక హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న తిరుపతికి చెందిన ఓ వ్యక్తికి వైరస్ సోకగా, వైద్య పరీక్షల్లో అతడి కుమారుడి(29)కి కూడా పాజిటివ్ వచ్చింది. ప్రకాశం జిల్లాలో మరో 3 కేసులు నమోదయ్యాయి. ఒంగోలుకు చెందిన ఓ వృద్ధుడు ఢిల్లీ వెళ్లి వచ్చిన తర్వాత కరోనా బారినపడ్డాడు. ఇప్పుడు అతడి తమ్ముడు, తమ్ముడి భార్య, వారి కోడలికి కరోనా ఉన్నట్లు తేలింది. కర్నూలు జిల్లా నంద్యాల మండలానికి చెందిన వ్యక్తికి పాజిటివ్ రావడంతో ఈ జిల్లాలో పాజిటివ్ కేసుల సంఖ్య 75కు చేరుకుంది.

### విశాఖలో ముగ్గురు డిశ్చార్జి

విశాఖ జిల్లా గీతం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు కోలుకున్నారు. వీరికి రెండుసార్లు వైరస్ నిర్ధారణ పరీక్షలు చేసిన అధికారులు నెగెటివ్ రావడంతో బుధవారం డిశ్చార్జ్ చేశారు.

## ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలి

**▸▸ అనంత వైద్యులకు వైరస్ సోకడంపై జూనియర్ వైద్యుల సంఘం ఆందోళన**



విశాఖపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఆస్పత్రిలో కొవిడ్ బాధితులకు వైద్యం అందిస్తున్న ఇద్దరు వైద్యులు, ఇద్దరు నర్సులకు వైరస్ సోకిందని, ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని వైద్య సిబ్బంది రక్షణకు అవసరమైన సామగ్రి అందించకపోతే ఈ తరహా కేసులు పెరిగే ప్రమాదముందని జూనియర్ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.దీప్‌చంద్ అన్నారు. వైద్యులకు వైరస్ సోకిందన్న విషయం తెలిసిన తర్వాత దీప్‌చంద్ సోషల్ మీడియాలో వీడియో పోస్టు చేశారు. కొవిడ్ విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆ వీడియోలో ప్రస్తావించారు. అనంతలో వైద్యులు కొద్దిరోజులుగా ఉన్నతాధికారులను రక్షణ సామగ్రి అడుగుతున్నా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

## మాస్క్ అడిగితే సస్పెండ్ చేస్తారా?

**▸▸ ప్రభుత్వ వైఖరి దిగ్భ్రాంతికరం: చంద్రబాబు**

**▸▸ దళిత డాక్టర్‌పై అధికార మదం: లోకేశ్**

నర్సీపట్నం టౌన్, అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఎన్-95 మాస్క్ ఇవ్వాలని కోరిన ప్రభుత్వ వైద్యుడిని సస్పెండ్ చేయడం దారుణమని మాజీ సీఎం, టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు విమర్శించారు. నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి డాక్టర్ సుధాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేయడంపై బుధవారం ట్విటర్‌లో స్పందించారు. 'ఆస్పత్రిలో వైద్యులకు మాస్కులు, గ్లౌజ్‌లు లేకపోవడాన్ని సుధాకర్ ఎత్తిచూపారు. వాటిని సమకూర్చడం ప్రభుత్వ కనీస ధర్మం. సమస్యను పరిష్కరించాల్సిందిపోయి వైద్యుడిని సస్పెండ్ చేశారు. ప్రభుత్వ వైఖరి దిగ్భ్రాంతి కలిగిస్తోంది. వైద్య సిబ్బందిని ఇలా అవమానపరిస్తే వారికి మనో ధైర్యం కల్పించడం ఎలా సాధ్యపడుతుంది? ఈ విపత్కర పరిస్థితుల్లో వైద్యులను, వైద్య సిబ్బందిని అన్ని విధాలుగా కాపాడుకోవాలి. రక్షించుకోవాలి' అని ట్వీట్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా ప్రభుత్వం తీరును తప్పుబట్టారు. 'ఒక దళిత వైద్యుడిపై మీ ప్రతాపం చూపిస్తారా.. జగన్! మీ ఇగో హర్ట్ అయ్యిందని డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేయడం దారుణమైన చర్య. కరోనా మహమ్మారిపై ముందుండి పోరాడుతున్న డాక్టర్లకు, సిబ్బందికి మాస్కులు, వ్యక్తిగత రక్షణ కిట్లు ఇవ్వలేని దద్దమ్మ ప్రభుత్వం మీది. మాస్కులు అడిగిన డాక్టర్‌ను సస్పెండ్ చేయడం జగన్ అధికార మదానికి నిదర్శనం. డాక్టర్ల దగ్గర ఉండాల్సిన మాస్కులు, వ్యక్తిగత రక్షణ కిట్లు కొట్టేసి మీడియాకు ఫోజులు ఇస్తున్న వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలను ఏం చెయ్యాలి? అసలు కరోనా పెద్ద విషయం కాదు..ఎన్నికలే ముఖ్యం అని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిన మీకు ఏం శిక్ష వేయాలి?' అని నిలదీశారు. కాగా, డాక్టర్ కె.సుధాకర్ చెప్పింది ఎంత వరకూ వాస్తవమో చేతనైతే ప్రభుత్వం విచారణ జరపాలని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నంలో సవాలు విసిరారు.

# మూడోదశ ఇంటింటి సర్వే!

**▸▸ పకడ్బందీగా చేయాలని సీఎం ఆదేశం**

**▸▸ అధీనంలోకి ప్రైవేటు ఆసుపత్రులు**

**▸▸ ఉన్నతాధికారులతో జగన్ సమీక్ష**



కొవిడ్-19 రాపిడ్ టెస్ట్ కిట్‌ను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడోసారి ఇంటింటి సర్వేను అత్యంత పకడ్బందీగా ప్రారంభించాలని సంబంధిత అధికారులను సీఎం జగన్ ఆదేశించారు. రాష్ట్రంలో 1.4 కోట్ల కుటుంబాల ఆరోగ్య స్థితిగతులను పరిశీలించాలన్నారు. స్టాండర్డ్ ఆపరేషన్ ప్రొసీజర్ ప్రకారం క్వారంటైన్‌లో ఉంచాల్సిన మందులను అందుబాటులో పెట్టాలన్నారు. ముందు జాగ్రత్తగా అదనంగా తెప్పించుకోవాలని సూచించారు. రాష్ట్రంలో కరోనా పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రైవేటు ఆసుపత్రులన్నింటినీ ప్రభుత్వ అధీనంలోకి తీసుకోవాలని.. అత్యవసర సేవల చట్టం అమలులో ఉన్నందున ప్రైవేటు వైద్యులు, సిబ్బందికి జాబ్ చార్ట్‌లు వేసి.. సత్వరం సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షల పరికరాలు అందుబాటులోకి తెచ్చేందుకు పరిశ్రమల శాఖ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ మేరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో బుధవారం సీఎం జగన్ కరోనా నివారణపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు మంత్రులు ఆళ్ల నాని, మేకపాటి గౌతమ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీలం సాహ్నీ, డీజీపీ గౌతం సవాంగ్ తదితరులు హాజరయ్యారు. దీనికి ముందు.. రాష్ట్రంలోని మెడ్‌టెక్ జోన్‌లో తయారైన కొవిడ్-19 ర్యాపిడ్ టెస్ట్ కిట్లను సీఎం జగన్ ప్రారంభించారు. విశాఖ మెడ్‌టెక్ జోన్‌లో కొవిడ్-19 ర్యాపిడ్ కిట్ల తయారీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి పరిశీలించారు. టెస్ట్ కిట్ల తయారీ.. పనిచేసే విధానాన్ని మెడ్‌టెక్ సీఈవో జితేంద్ర శర్మ, సిబ్బంది సీఎం జగన్‌కు వివరించారు. దేశంలో మూడు కంపెనీలకు మాత్రమే కిట్‌ల తయారీ అనుమతులున్నాయని జితేంద్ర తెలిపారు. ప్రస్తుతం రోజుకు 2 వేల కిట్‌లను తయారు చేస్తున్నామని.. ఏప్రిల్ రెండో వారానికి రోజుకు పదివేల కిట్లు.. తయారు చేసే సామర్థ్యానికి మోల్ బయో సంస్థ చేరుకుంటుందని జితేంద్ర వివరించారు. అదేవిధంగా మే నుంచి ప్రతి నెలా 6 వేల వెంటిలేటర్లను తయారు చేస్తామన్నారు.

### స్వయంశక్తి దిశగా

కొవిడ్-19 నివారణ చర్యల్లో స్వయంశక్తి దిశగా రాష్ట్రం ముందడుగు వేయడం శుభపరిణామమని సీఎం జగన్ హర్షం వ్యక్తం చేశారు. కరోనా నివారణ చర్యల్లో భాగంగా అత్యంత కీలకమైన కిట్లు, వెంటిలేటర్ల తయారీకి రాష్ట్రం కేంద్రంగా ఉండడం సంతోషకరమైన విషయమని, దేశానికే విశాఖ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. ర్యాండమ్ కిట్లు అందుబాటులోకి రావడంతో.. పరీక్షలు చేసే సామర్థ్యం పెరుగుతుందని సీఎం జగన్ పేర్కొన్నారు. కొవిడ్ ఆసుపత్రుల్లో సన్నద్ధత బాగా పెరగాలని సీఎం సూచించారు.

## ఔషధాల బ్లాక్ మార్కెటింగ్‌కు చెక్!

**▸▸ ఏపీ ఇండస్ట్రీస్ కొవిడ్-19 పోర్టల్ ఆవిష్కరించిన సీఎం జగన్**

అమరావతి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా నేపథ్యంలో వైద్య పరికరాలు, మాస్క్‌లు, శానిటైజర్, మందులు వంటి వాటి బ్లాక్‌మార్కెటింగ్‌ను నిరోధించడంతోపాటు, వాటి ధరలను ఎప్పటికప్పుడు పరిశీలించేలా రాష్ట్ర పరిశ్రమల శాఖ ఏపీ ఇండస్ట్రీస్ కొవిడ్-19 రెస్పాన్స్ పోర్టల్‌ను రూపొందించింది. ఈ పోర్టల్‌ను సీఎం జగన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ పోర్టల్‌లో రాష్ట్రంలో వైద్య పరికరాలు, అనుబంధ ఉత్పత్తులను తయారు చేసే 112 కంపెనీలను పరిశ్రమల శాఖ చేర్చింది. ఇవన్నీ నిత్యావసర వస్తువుల పరిధిలోకి వస్తున్నందున వాటి ఉత్పత్తుల కొనసాగింపు.. ధరల నియంత్రణ తదితర అంశాలను పరిశ్రమల శాఖ నేరుగా పరిశీలించనుంది. ప్రస్తుతం.. పలు మెడికల్.. మెడికల్ ఆధారిత వస్తువుల ధరలు నియంత్రణలో లేకపోవడం.. డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని బ్లాక్‌మార్కెట్‌కు తరలించడం వంటి చర్యలను నిరోధించేందుకు వీలుగా పరిశ్రమల శాఖ దీనిని వినియోగించనుంది.

# నర్సీపట్నం డాక్టర్ సుధాకర్ సస్పెన్షన్

**▸▸ 'కరోనా' వైద్యులకు తగిన పరికరాల్లేవన్న ఫలితం!**

**▸▸ పోలీసు కేసు కూడా నమోదు**

**▸▸ దళితుడినైన నాపై అన్యాయంగా చర్య: సుధాకర్**

నర్సీపట్నం, విశాఖపట్నం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా బాధితులకు సేవలందిస్తున్న వైద్యులకు, సిబ్బందికి తగిన పరికరాలు అందించడం లేదంటూ ఆరోపణలు చేసిన వైద్యుడు కె.సుధాకర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. విశాఖ జిల్లా నర్సీపట్నం ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రిలో ఎనస్థీషియన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కె.సుధాకర్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ కరోనా వైరస్ బారినపడిన, అనుమానిత లక్షణాలున్న వారికి సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బందికి సరిపడా పరికరాలను అందించడం లేదని, వారి ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై జిల్లా కలెక్టర్ వినయచంద్ నియమించిన ముగ్గురు అధికారుల(కేజీహెచ్ సూపరింటెండెంట్, డీఆర్‌డీఏ పీడీ, నర్సీపట్నం ఆర్డీవో) బృందం మంగళవారం ప్రాంతీయ ఆస్పత్రిలో విచారణ నిర్వహించింది. ఆ బృందం అందజేసిన నివేదికను కలెక్టర్ ప్రభుత్వానికి పంపగా, డాక్టర్ సుధాకర్‌ను సస్పెండ్ చేస్తూ వైద్య విధాన పరిషత్ కమిషనర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని ప్రాంతీయ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలవేణి బుధవారం తెలిపారు. మరోవైపు సుధాకర్‌పై పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఆయన ప్రభుత్వాన్ని, వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను కించపరుస్తూ మాట్లాడారంటూ ఆస్పత్రి సూపరింటెండెంట్ నీలవేణి ఫిర్యాదు చేశారు. కాగా, తన వ్యాఖ్యలపై ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని డాక్టర్ కె.సుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'నర్సీపట్నం ఆస్పత్రిలో పరిస్థితిపై నేను చేసిన వ్యాఖ్యలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నా. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి మాస్క్‌లు ఇవ్వకుండా స్థానిక నాయకులకు, పోలీసు అధికారులకు ఎందుకు? మాస్క్‌లు ఇవ్వనప్పుడు ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేయాల్సిన అవసరం లేదనే సెలవు అడిగాను. వైద్యులకు అవసరమైన మాస్క్‌లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఎంతవరకు సమంజసం? మీడియా నాతో వస్తే వాస్తవాలు చూపిస్తా. ఆస్పత్రిలోని పరిస్థితి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్దామని ఆయన ఇంటికి వెళ్లి గంట కూర్చున్నా. ఆయన అందుబాటులో లేకపోవడంతో తిరిగి వచ్చేశా. వాస్తవాలు బయటకు చెప్పినందుకు దళితుడినైన నన్ను సస్పెండ్ చేశారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.



డాక్టర్ కె.సుధాకర్

# కరోనా కబళిస్తున్న 'కణాల' గుట్టురట్టు!!

- శ్వాసనాళంలోని 'సిలియా' నడుమ ఉండే 'ప్రో జెనిటర్' కణాలే వైరస్ టార్గెట్
- వాటిపై ఏసీఈ2 ఎంజైమ్ ఎక్కువ మోతాదులో ఉంటే.. భారీ ఇన్ఫెక్షన్
- వృద్ధులు సులువుగా కొవిడ్-19 బారినపడటానికి ప్రధాన కారణమదే
- జర్మన్ శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడి



బెర్లిన్, ఏప్రిల్ 8: కరోనా వైరస్ శ్వాసకోశ వ్యవస్థలోని ఏ కణాలను లక్ష్యంగా చేసుకుంటోంది? అనే ప్రశ్నకు జర్మనీలోని బెర్లిన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్(బీఐహెచ్) శాస్త్రవేత్తలు సమాధానాన్ని కనుగొన్నారు. హీడెల్‌బర్గ్ లంగ్ బయోబ్యాంక్ నుంచి సేకరించిన 12 మంది ఊపిరితిత్తుల కేన్సర్ రోగుల శాంపిళ్ల విశ్లేషణతో ఈవిషయం వెల్లడైంది. 'ది ఎంబో' జర్నల్‌లో అధ్యయన నివేదిక ప్రచురితమైంది. దీని ప్రకారం.. నోరు, ముక్కు, గొంతు, స్వరపేటికలను అనుసంధానిస్తూ ఊపిరితిత్తుల వరకు ఉండే శ్వాసనాళంపై సన్నపాటి వెంట్రుకలు ఉంటాయి. వాటిని సిలియా అంటారు. ఇవి చీమిడి, బ్యాక్టీరియాలను ఊపిరితిత్తుల నుంచి బయటికి నెట్టి వేయడానికి చీపుళ్ల మాదిరి మాధ్యమాలుగా పనిచేస్తాయి. శ్వాసనాళంలోని ఈ వెంట్రుకల సమూహాల్లో ఉండే ప్రో జెనిటర్ కణాలను గ్రాహకాలుగా వాడుకొని కరోనా వైరస్ ఇన్ఫెక్షన్‌కు పాల్పడుతోందని శాస్త్రవేత్తలు గుర్తించారు. ఊపిరితిత్తుల్లోని ప్రతీ కణం ఉపరితలాన్ని అతుక్కొని యాంజియోటెన్సిన్ కన్వర్టింగ్ ఎంజైమ్ 2(ఏసీఈ2) అనే ఎంజైమ్ ఉంటుంది. కరోనా వైరస్‌కు గ్రాహకంగా ఉపయోగపడుతున్న 'ప్రో జెనిటర్' కణాల పైనా ఏసీఈ2 ఉందని.. వృద్ధుల్లో దీని మోతాదు ఎక్కువగా ఉండటంతో వారిలో ఇన్ఫెక్షన్ ప్రభావం ఎక్కువగా ఉంటోందని వెల్లడించారు. మహిళలతో పోల్చితే పురుషుల్లోని ప్రో జెనిటర్ కణాలపై ఏసీఈ2 మోతాదు ఎక్కువగా ఉందని, అందువల్లే కొవిడ్-19 ఇన్ఫెక్షన్ కేసుల్లో పురుషులే అత్యధిక సంఖ్యలో ఉంటున్నారని గుర్తుచేశారు. ఈ అధ్యయన నివేదిక కరోనా వైరస్‌ను కట్టడిచేసే ఔషధాలు, చికిత్సా విధానాల అభివృద్ధికి ఊతమిస్తుందని శాస్త్రవేత్తలు ఆశాభావం వ్యక్తంచేశారు.

# 100 రోజుల 'కరోనా'

## తల్లడిల్లుతున్న ప్రపంచం.. వూహాన్‌లో తొలి షట్‌డౌన్‌కు నేటితో వంద రోజులు

*2019 డిసెంబరు 31... కొత్త సంవత్సరాన్ని స్వాగతించడానికి అంతా సిద్ధమవుతున్నారు. వుహాన్‌లో ఉన్న సీఫుడ్ హోల్‌సేల్ మార్కెట్ పరిసరాల్లో న్యుమోనియా లాంటి వ్యాధి వ్యాపిస్తోందని చైనా ప్రభుత్వం ప్రకటించింది. ఆ మరుసటి రోజునే అంటే... జనవరి 1వ తేదీన సీఫుడ్ మార్కెట్‌ను మూసేసింది. ఇది జరిగి నేటికి సరిగ్గా వంద రోజులు! కరోనా గమనంలో కీలక ఘట్టాలివి...*



వూహాన్‌లోని ఒక రైల్వే స్టేషన్‌లో తమ హెల్త్ రిపోర్ట్ తెలుసుకునేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న యువతులు

**1వ రోజు (జనవరి 1): తొలి షట్‌డౌన్**

వూహాన్ సీఫుడ్ మార్కెట్‌ను మూసివేశారు. వైద్యాధికారులు కొందరు ప్లాస్టిక్ బ్యాగుల్లో నమూనాలు సేకరించారు. వుహాన్ ఆస్పత్రులకు గుర్తుతెలియని లక్షణాలతో రోగులు క్యూ కడుతున్నారని సోషల్ మీడియాలో సందేశాలు వెల్లువెత్తాయి.

**9వ రోజు (జనవరి 9): తొలి మరణం**

వూహాన్‌లో కలకలానికి కొత్తరకం కరోనా వైరస్ కారణమని తేల్చారు. దీనికి 'కరోనా వైరస్ డిసీజ్ - 2019'కు సంక్షిప్త రూపంగా 'కొవిడ్ 19' అని పేరు పెట్టారు. వూహాన్ ఆస్పత్రిలో 61ఏళ్ల వృద్ధుడు ఈ వ్యాధితో మరణించాడు. ఇదే... తొలి కరోనా మృతి.

**13వ రోజు (జనవరి 13): థాయ్‌లో తొలి కేసు**

కరోనా వైరస్ చైనా దాటి... థాయ్‌లాండ్‌లో అడుగు పెట్టింది. వూహాన్ నుంచి బ్యాంకాక్ వెళ్లిన 61ఏళ్ల వృద్ధుడికి వైరస్ సోకింది.

**20వ రోజు (జనవరి 20): ఊపందుకున్న వైరస్**

వూహాన్‌తో ప్రత్యక్ష సంబంధం లేని రెండు కేసులు గువాంగ్డాంగ్ ప్రావిన్స్‌లో వెలుగు చూశాయి. దీంతో... ఈ వైరస్ మనుషుల నుంచి మనుషులకు సోకుతుందని నిర్ధారణ అయ్యింది. వైరస్ క్రమంగా జపాన్, దక్షిణ కొరియా, అమెరికాకూ విస్తరించింది. వూహాన్ నుంచి తిరిగి వచ్చిన 35ఏళ్ల వ్యక్తికి వాషింగ్టన్ ఆస్పత్రిలో పాజిటివ్ నిర్ధారణ అయింది. ఇదే అమెరికాలో మొదటి కరోనా కేసు.

**24వ రోజు (జనవరి 24): యూరప్‌లోకి..**

చైనీయుల కొత్త సంవత్సరం సందర్భంగా బంధుమిత్రులను కలుసుకోవడానికి వేలాది మంది వూహాన్ నగరానికి రావడం మొదలైంది. తిరుగు ప్రయాణంలో చైనా నుంచి ఫ్రాన్స్ వచ్చిన ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో వైరస్ యూరప్‌కు చేరింది.

**31వ రోజు (జనవరి 31): బ్రిటన్‌లో తొలికేసు**

యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ పూర్తిగా బయటకొచ్చిన రోజే (బ్రెగ్జిట్) ఆ దేశంలో తొలి కరోనా కేసు నమోదైంది.

**36వ రోజు (ఫిబ్రవరి 4): చైనా వెలుపల తొలి మరణం**

మనీలా ఆస్పత్రిలో వూహాన్ వాసి ఒకరు కరోనాతో మరణించాడు. కరోనా గురించి ముందే హెచ్చరించిన వైద్యుడు లీ వెన్లియాంగ్ మరణంతో చైనా వ్యాప్తంగా లాక్‌డౌన్ విధించారు. ఎండలు ముదిరితే వైరస్ ఉండదని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వ్యాఖ్యానించారు.

**50వ రోజు (ఫిబ్రవరి 19): కొరియా, ఇరాన్‌లో అలజడి**

వైరస్ లక్షణాలున్న మహిళ చర్చికి, హోటల్‌కు వెళ్లడంతో కరోనా తీవ్రత ఊపందుకుందని దక్షిణ కొరియా మంత్రి ప్రకటించారు. ఇరాన్‌లో మొదటిసారిగా రెండు కేసులు నమోదయ్యాయి. మిలాన్‌లో జరిగిన ఫుట్‌బాల్ మ్యాచ్‌కు నగరంలోని మూడొంతుల మంది హాజరయ్యారు. వేలాదిగా స్పానిష్ దేశీయులు సైతం ఈ మ్యాచ్ కోసం తరలివచ్చారు. ఇటలీ, స్పెయిన్‌లలో వైరస్ విస్తరణకు ఇది కారణమైంది.

**66వ రోజు (మార్చి 6): ఇటలీలో సంక్షోభం**

ఆరు రోజుల్లోనే ఇటలీలో మృతుల సంఖ్య ఆరు రెట్లు పెరిగిపోయింది.

**71వ రోజు (మార్చి 11): మహమ్మారిగా కొవిడ్**

ప్రపంచ ఆరోగ్య సంస్థ కొవిడ్-19ను మహమ్మారిగా ప్రకటించింది.

**77వ రోజు(మార్చి 17): జనజీవనం స్తంభన**

ఖండాలు, దేశాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కరోనా కారణంగా మరణించినవారిలో మూడొంతుల మంది యూరోపియన్లే.

**83వ రోజు (మార్చి 23): దేశ దేశాల్లో లాక్‌డౌన్**

ప్రపంచ వ్యాప్తంగా కరోనా బాధితుల సంఖ్య 3,70,000 దాటింది. అనేక దేశాలు లాక్‌డౌన్ ప్రకటించాయి. ఈ సమయానికి చైనాలో వైరస్ ఉధృతి తగ్గుముఖం పట్టింది. వారం రోజులుగా అక్కడ కొత్త కేసు ఒక్కటీ నమోదు కాలేదు.

**93వ రోజు (ఏప్రిల్ 2): 10లక్షలకు చేరిన పాజిటివ్‌లు**

ప్రపంచ వ్యాప్తంగా బాధితుల సంఖ్య 10లక్షలు దాటింది. వారిలో 50వేల మందికి పైగా మరణించారు.

**99వ రోజు (ఏప్రిల్ 8): 14లక్షలు దాటిన బాధితులు**

కరోనా ప్రభావం తీవ్రంగా కనిపించిన కొన్ని యూరప్ దేశాల్లో కొత్త కేసులు, మరణాలు తగ్గుముఖం పట్టాయి. చైనాలో ఒక్క మరణం కూడా నమోదు కాలేదు. కరోనా పుట్టినిల్లు వూహాన్‌లో లాక్‌డౌన్‌ను పూర్తిగా ఎత్తివేశారు.

## ఎన్నాళ్లో వేచిన వూహాన్!

- రెండున్నర నెలల తర్వాత స్వేచ్ఛ

వూహాన్, ఏప్రిల్ 8: కరోనా 'పుట్టినిల్లు' వూహాన్ రెక్కలు విప్పుకొంది. రెండున్నర నెలల బందిఖానాను వదిలి స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటోంది. నగరంలో వైరస్ వ్యాప్తి దాదాపుగా ఆగిపోవడంతో.. 76 రోజుల తర్వాత అక్కడ లాక్‌డౌన్‌ను ఎత్తివేశారు. దీంతో ప్రజలు బుధవారం వీధుల్లోకి వచ్చారు. ప్రతి ఒక్కరూ మాస్క్ ధరించి తమ పనులు ప్రారంభించారు. రైళ్లు తిరుగుతున్నాయి. విమానాలు ఎగురుతున్నాయి. కర్మాగారాల్లో యంత్రాల రొద మళ్లీ మొదలైంది. 1.10 కోట్ల జనాభా ఉన్న వూహాన్‌లో జనవరి 23న పూర్తి లాక్‌డౌన్ అమలులోకి వచ్చింది. అప్పటి నుంచి ఎడారులను తలపించిన నగర వీధులు ఇప్పుడు తిరిగి జనంతో కళకళలాడాయి. స్నేహితులు, సహోద్యోగులు, బంధువులను కలుసుకున్న వారు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ఒకరికొకరు ఆలింగనం చేసి కంటతడి పెట్టారు. 'కరోనా వైరస్‌ను జయించాం' అని కేకలు పెట్టారు. దుకాణాలను ప్రత్యేకంగా దీపాలతో అలంకరించారు. వూహాన్ విమానాశ్రయంలో బుధవారం దిగిన తొలి విమానానికి జల ఫిరంగులతో స్వాగతం పలికారు. విమానాశ్రయంలో సిబ్బంది పూర్తిస్థాయిలో రక్షణ పరికరాలను ధరించి విధులు నిర్వహిస్తున్నారు.

## హనుమలా.. జీసస్‌లా..

- కలిసి సంక్షోభాన్ని ఎదుర్కొందాం
- ప్రధాని మోదీకి బ్రెజిల్ అధ్యక్షుడి లేఖ
- మోదీ గొప్పవారు.. మంచివారు: ట్రంప్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: కరోనాపై పోరులో కీలకంగా భావిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ ఎగుమతులపై ఆంక్షలను పాక్షికంగా ఎత్తివేసినందుకు.. ప్రధాని మోదీపై బ్రెజిల్ అధ్యక్షుడు ప్రశంసల వర్షం కురిపించారు. ఏకంగా రామాయణంలోని సంజీవని పర్వత ఘట్టాన్ని ఉటంకిస్తూ మోదీకి లేఖ రాశారు. "లక్ష్మణుడి ప్రాణాలు కాపాడటానికి హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చినట్టుగా.. రోగులకు ఏసుక్రీస్తు స్వస్థత చేకూర్చినట్టుగా, అంధుడైన బార్టిమియస్‌కు చూపునిచ్చినట్టుగా భారత్, బ్రెజిల్ కలిసి అంతర్జాతీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి" అని అందులో పేర్కొన్నారు. జనవరి 26న జరిగిన దేశ 70వ గణతంత్ర వేడుకలకు బోల్సొనారో హాజరైన సంగతి తెలిసిందే. ఇక, హైడ్రాక్సీ క్లోరోక్విన్ పంపకపోతే భారత్‌పై ప్రతీకారం తప్పదన్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్.. భారత్ తాజా నిర్ణయంతో మోదీపై ప్రశంసల వర్షం కురిపించారు. "నేను మిలియన్ల డోసుల హైడ్రాక్సీ క్లోరోక్విన్ కొన్నాను. ప్రధాని మోదీతో మాట్లాడాను. భారత్ నుంచి భారీగా హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలు రాబోతున్నాయి. వాటిని పంపుతారా అని నేను ఆయన్ను (మోదీని) అడిగాను. ఆయన చాలా గొప్పవారు. నిజంగా చాలా మంచివారు" అని ట్రంప్ ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశంసించారు.

# డబ్ల్యూహెచ్‌వోకు నిధులు నిలిపేస్తాం

## చైనాకు అనుకూలంగా వ్యవహరిస్తారా!.. ముందస్తు హెచ్చరికలు చేయలేదేం..?

- సొమ్ము మాది... సేవ వారికా..!
- అమెరికా అధ్యక్షుడి తీవ్ర హెచ్చరిక
- సమయం కాదు: డబ్ల్యూహెచ్‌వో



వాషింగ్టన్, ఏప్రిల్ 7: కొవిడ్-19 అమెరికాలో కరాళనృత్యం చేస్తుండడంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో)పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడ్డారు. "కరోనా గురించి మీరు చెప్పిన ప్రతీ విషయం తప్పు. చైనాలో ఏం జరుగుతోందో మీకు తెలుసు. వైరస్ తీవ్రతను ఎందుకు అంచనా వేయలేకపోయారు? ప్రపంచవ్యాప్తంగా పరిశోధన సంస్థలను, ప్రభుత్వాలను అప్రమత్తం చేయలేకపోయారు" అని ఘాటుగా దుమ్మెత్తారు. "మేం ట్రావెల్ బ్యాన్ పెడతామన్నాం. ఇపుడే అక్కర్లేదని మీరు సలహా ఇచ్చారు. సరిహద్దులు మూసేస్తామన్నాం. అదీ వద్దన్నారు. దీని ఫలితం మేం ఇపుడు అనుభవిస్తున్నాం" అని విమర్శించారు. "కొవిడ్-19 కిందటేడాది చివర్లోనే వుహాన్‌లో మొదలైంది. కానీ మీరు ఎప్పటికప్పుడు తాత్సారం చేస్తూ వచ్చారు. ఆఖరికి ఈ ఏడాది మార్చి 11న గానీ ప్రపంచవ్యాప్త మహమ్మారి అని ప్రకటించలేదు. ఎందుకీ ఆలస్యం? డబ్ల్యూహెచ్‌వో ఇది పెద్ద విషయమే కాదనీ, ఏ సమస్యా రాదని చెప్పింది. వారి మాటే విని ఉంటే పరిస్థితి ఇంకా భీభత్సంగా మారి ఉండేది" అని ట్రంప్ దుయ్యబట్టారు. "డబ్ల్యూహెచ్‌వో పూర్తిగా చైనాకు అనుకూలంగా వ్యవహరించింది. మేం పెద్దమొత్తంలో ఈ సంస్థకు నిధులిస్తున్నాం. మా సొమ్ముతో వారికి సాయం చేస్తారా? దాన్ని నిలిపేస్తాం" అని ఆయన హెచ్చరించారు. దీన్ని డబ్ల్యూహెచ్‌వో నిరసించింది. నిధులు ఆపేయడానికి ఇది సరైన సమయం కాదని పేర్కొంది. ఈ సమయంలో నిధుల కొరత సృష్టించడం సరికాదని అభిప్రాయపడింది.

### క్లోరోక్విన్ వల్ల ఆమె బతికింది

హైడ్రాక్సీ క్లోరోక్విన్ వాడడం వల్ల మిచిగన్ రాష్ట్ర ప్రతినిధి తన ప్రాణాలు దక్కించుకోగలిగారని ట్రంప్ చెప్పారు. ఈ మందు మంచిదా కాదా.. అన్న చర్చ జరుగుతున్న వేళ ఆయన ఈ విషయం వెల్లడించారు. 'కరెన్ విట్‌సట్ అనే ఆ ప్రతినిధి నాకు కృతజ్ఞతలు కూడా చెప్పారు. వైరస్ సోకడం వల్ల తాను, తన భర్త కొన్నాళ్లుగా బాధపడుతున్నామని, హెచ్‌సీక్యూ వాడడం వల్ల బతికి బట్టకట్టామని ఆమె ట్వీట్ చేశారు. మరి నా నిర్ణయం (భారత్‌నుంచి దిగుమతి) సరైనదా? కాదా?' అని ఆయన పేర్కొన్నారు. 'డెమొక్రాట్ అయిన ఆమె దీన్ని జయించింది. అందరి విషయంలో ఇలానే జరుగుతుందని నేను చెప్పలేను' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

### మరణాలు తక్కువే

ఒక్క మంగళవారంనాడే అమెరికాలో కరోనాతో 1900 మంది బలికావడంతో అమెరికా తీవ్రంగా రోదిస్తోంది. అయితే ఈ సంఖ్య అంచనాల కంటే తక్కువేనని దేశాన్ని సముదాయించే ప్రయత్నం చేశారు ట్రంప్! "వందల మంది చనిపోతున్నప్పటికీ కేసులు, మరణాల సంఖ్య కుదుటపడుతోంది. క్రమేణా నిలకడగా మారుతోంది" అన్నారు. "దేశంలోని 330 మిలియన్ జనాభాలో 97 శాతం ఇంట్లోనే ఉంటున్నారు. అనేక పబ్లిక్ ప్రదేశాలు, కన్వెన్షన్ సెంటర్లు, హోటళ్లను క్వారంటైన్, ఐసొలేషన్ కేంద్రాలుగా మార్చాం. వేలకొద్దీ వెంటిలేటర్లు సిద్ధం చేశాం" అని చెప్పారు.

## చైనా మృతులకు డబుల్

(మొదటి పేజీ తరువాయి)

మించిపోయింది. నాటి దాడిలో మొత్తం 2,977 మంది అమెరికా పౌరులు చనిపోగా, వారిలో 2,753 మంది న్యూయార్క్‌వాసులే ఉన్నారు. కానీ, మంగళవారం నాటికి ఈ ఒక్క నగరంలోనే 6,268 మందిని కరోనా బలిగొంది. ఒక్క రోజులోనే న్యూయార్క్‌లో 779 మంది మృత్యువాతపడ్డారు. కరోనా ఉత్పాతం విరుచుకుపడిన ఈ 3, 4 నెలల్లో ఒక్క రోజులోనే ఇన్ని మరణాలు సంభవించడం ఇదే తొలిసారి. అమెరికాలో నమోదయిన పదివేలు పైచిలుకు మృతుల్లో సగానికి పైగా ఈ సిటీలోనే సంభవించాయి. ఇంతమందిని సమాధి చేయడానికి శ్మశానవాటికల్లో చోటు చాలడం లేదు. ఒక్కో మృతదేహం సమాధికి తొమ్మిది నుంచి పది రోజులు పడుతోందని వారంతా వాపోతున్నారు. ఇప్పటికే పాజిటివ్‌గా తేలిన వారు మినహా కొత్తగా వచ్చే కేసులు తగ్గిపోవడం, ఐసీయూకు తరలించేవారి సంఖ్య కూడా తక్కువగానే ఉండటం ఒక్కటే న్యూయార్క్‌వాసులకు కొంత ఊరటనిస్తోంది. భౌతిక దూరం పాటించడం, ఇళ్లకే ప్రజలు పరిమితం కావడమనేది ఫలితాలు ఇస్తుండటమే దీనికి కారణమని గవర్నర్ ఆండ్రూ వివరించారు. ఇప్పటికి అమెరికాలో 12వేల మంది చనిపోగా, 3.80 లక్షలమందికి పాజిటివ్ తేలింది.

### ఆగని మృత్యుఘోష

లండన్: యూరప్‌లో కరోనా కేసుల సంఖ్య 7.50 లక్షలకు చేరింది. అత్యధికంగా స్పెయిన్‌లో 1.46 లక్షలు, ఇటలీలో 1.35 లక్షలు నమోదయ్యాయి. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆయన వెంటిలేటర్‌పై లేరని వైద్యులు తెలిపారు. ఒక్కరోజులో నమోదయిన 800 మరణాలతో అక్కడ ఇప్పటికి 6,200 మంది మరణించారు. స్పెయిన్‌లో 24 గంటల్లో 743 మంది మరణించారు. ఇరాన్‌లో కొత్తగా 121 మరణాలు బుధవారం సంభవించగా, మృతులు నాలుగు వేలకు చేరారు.

# వైద్యులే మన పోరాటయోధులు

- సరిపడా పీపీఈలు ఉండేలా చూడండి
- వైద్యసిబ్బందిని కాపాడండి
- కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): 'ప్రస్తుత సంక్షుభిత తరుణంలో డాక్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నారు. వారే మన పోరాటయోధులు. వారిని ఎలాగైనా కాపాడుకోవాలి' అని సుప్రీంకోర్టు కేంద్రానికి స్పష్టంచేసింది. కరోనా చికిత్సలో నిమగ్నమైన సిబ్బందికి తగు సంఖ్యలో వ్యక్తిగత రక్షణ ఉపకరణాలు (పీపీఈలు) ఉండేలా అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించింది. 'వైద్యులు, పారామెడికల్, పారిశుద్ధ్య సిబ్బంది అందరికీ ఈ పీపీఈలు అందుబాటులో ఉండేట్లు చూడాలి.. అవి కూడా డబ్ల్యూ హెచ్ వో గైడ్‌లైన్స్ ప్రకారం రూపొందినవే అయి ఉండాలి.. ఈమేరకు కేంద్రానికి ఆదేశివ్వాలి' అని కోరుతూ నాగ్‌పూర్‌కు చెందిన ఓ డాక్టరు, ఓ అడ్వొకేటు, మరో సామాజిక సంస్థ దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఒకేసారి విచారణకు స్వీకరించిన ధర్మాసనం ఈ ఆదేశాలిచ్చింది. దీనిపై ప్రభుత్వం తరఫున స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా- 'దేశంలోని అన్ని కరోనా ఆసుపత్రుల్లో వైద్యులు, ఇతర సిబ్బందికి తగినన్ని పీపీఈలు ఉన్నాయని, కొరత రానీయబోమని' వివరించారు. వైద్య సిబ్బందికి పూర్తిస్థాయి భద్రత, రక్షణ కల్పించడానికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని, వారు నిజంగా పోరాట యోధులేనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు తెలిపారు. వైద్య సిబ్బందికి జీతాల్లో కోత విధిస్తున్నట్లు వచ్చిన వార్తలను మెహతా ఖండించారు. ఏ రాష్ట్రంలోనూ ఇది లేదన్నారు. డాక్టర్లు తమ పర్సు నుంచి డబ్బు పెట్టుకుని పీపీఈలు కొనుక్కునే పరిస్థితీ లేదని స్పష్టం చేశారు.

### ఇక ఉచితంగా కరోనా టెస్టులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8: కరోనా వైరస్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగానే చేయాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. 'ప్రభుత్వ ప్రయోగశాలలలైనా, ప్రభుత్వం అనుమతించిన ప్రైవేటు ల్యాబొరేటరీలలోనైనా.. ఈ టెస్టులు ఫ్రీగానే చేయాలి. ఎలాంటి ఫీజులూ వసూలు చేయరాదు' అని జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ రవీంద్ర భట్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. కరోనా వైరస్ వ్యాధి నిర్ధారణ పరీక్షలకు ప్రైవేటు ల్యాబొరేటరీలు భారీగా ఫీజులు వసూలు చేయడంపై బెంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. ఒక్కో పరీక్షకు రూ 4500 గరిష్ఠ పరిమితిని ఐసీఎంఆర్ విధించడాన్ని ప్రస్తావిస్తూ సామాన్యులు ఇంత ఎక్కువ మొత్తాన్ని ఎలా తట్టుకుంటారని పిటిషన్ వేసిన శశాంక్‌దేవ్ సుధీ అనే న్యాయవాది ప్రశ్నించారు. ఆయన వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. తాము ఉచితంగా జరిపిన టెస్టుల ఫీజులను ప్రభుత్వం రీయింబర్స్ చేయాలన్న ప్రైవేట్ ల్యాబ్‌ల వినతిపై తరువాత స్పందిస్తామని స్పష్టం చేసింది. ఉచిత టెస్టులు చేయించాలన్న బెంచ్ సూచనను ప్రభుత్వ దృష్టికి తీసికెళతానని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నప్పటికీ న్యాయమూర్తులు ఆగలేదు. ఇంకా ఆగేది లేదని, దానిపై ఇప్పుడే ఉత్తర్వులు ఇచ్చేస్తున్నామని జస్టిస్ అశోక్ భూషణ్ స్పష్టం చేశారు.

## నిత్యావసరాలను బ్లాక్ చేస్తే ఏడేళ్లు జైలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో నిత్యావసర వస్తువులను బ్లాక్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్‌భల్లా ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు లేఖలు రాశారు. నిత్యావసర వస్తువుల (ఈసీ) చట్టం మేరకు నల్లబజారు వ్యాపారులకు ఏడేళ్లదాకా జైలు శిక్ష విధించవచ్చని గుర్తుచేశారు. నిత్యావసర వస్తువలకు ఎలాంటి కొరత రాకుండా ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించాలని ఆ లేఖల్లో కోరారు. కృత్రిమ కొరతను నివారించేందుకు జూన్ 30 వరకు ఈసీ చట్టాన్ని ప్రయోగించాలని.. నిల్వల పరిమితులను, ధరలను నిర్ణయించాలని సూచించారు. ఉత్పత్తిని పెంచి, డీలర్ల ఖాతాలను తరచూ తనిఖీ చేయాలన్నారు. అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెటింగ్, వ్యాపారుల అక్రమాల వల్ల ధరలు భారీగా పెరిగిపోయే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. నిత్యావసర వస్తువుల చట్టంతోపాటు.. అక్రమార్కులపై ముందస్తు నిర్బంధం (పీడీ) చట్టాన్ని కూడా ప్రయోగించవచ్చన్నారు.

## కంచిబొట్ల బ్రహ్మకు ప్రధాని, సీఎం నివాళి

అమరావతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పాత్రికేయ రంగానికి కంచిబొట్ల బ్రహ్మానందం ఉత్తమ సేవలను అందించారని ప్రధాని మోదీ అన్నారు. అమెరికాలోని న్యూయార్క్‌లో కరోనాబారిన పడి బ్రహ్మానందం మృతి చెందడం తీవ్రంగా బాధించిందన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సానుభూతిని తెలుపుతూ.. 'ఓం శాంతి' అంటూ ట్వీట్ చేశారు. బ్రహ్మానందం మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మరో ప్రకటనలో దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బ్రహ్మానందాన్ని ఇంత త్వరగా కోల్పోతామనుకోలేదని ఇండియన్ పయనీర్ సంపాదకుడు ఇంద్రజిత్ ఎస్. సలూజా అన్నారు. హైదరాబాద్‌తో తమకున్న ఉమ్మడి అనుబంధాన్ని పంచుకొనేవారమని భారత సంతతి అమెరికా ఫొటోగ్రాఫర్ మొహమ్మద్ జాఫర్ గుర్తు చేసుకొన్నారు.

## ఓవైపు తండ్రి మరణం.. మరోవైపు వృత్తి ధర్మం

- బాధలోనూ బాధ్యత మరవని కలెక్టర్

భువనేశ్వర్ (ఒడిస్సా), ఏప్రిల్ 8: దేశానికొచ్చిన కష్టం ముందు తనకొచ్చిన కష్టాన్ని చాలా చిన్నదిగా భావించారాయన. ఒడిస్సాలోని కటక్ జిల్లా కలెక్టర్ భవానీ శంకర్ చైనీ.. జిల్లాలో కరోనా నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహిస్తున్నారు. అదే సమయంలో ఆయన తండ్రి, మాజీ కలెక్టర్ దామోదర్ చైనీ(98) కన్నుమూశారన్న వార్త ఆయనకు తెలిసింది. అయినా ఆయన చలించలేదు. దుఃఖాన్ని దిగమింగుకున్నారు. పని పూర్తిచేసుకున్నాకే ఇంటికి వెళ్లారు. ఈ ఘటనపై ఒడిస్సా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ స్పందించారు. "ఇంత పెద్ద దుఃఖంలోనూ.. ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా దేశసేవకు అంకితమైన కలెక్టర్ భవానీ చైనీకి సెల్యూట్" అంటూ ట్విటర్లో పేర్కొన్నారు.

## హాట్ స్పాట్ల దిగ్బంధం

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 32 మంది కరోనా వ్యాధిగ్రస్తులు మరణించారని, 773 మందికి వైరస్ సోకిందని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ తెలిపారు. 24 గంటల వ్యవధిలో కేసుల పెరుగుదలలో ఇదే అత్యధికం. మొత్తం మరణాల సంఖ్య 149కి, కేసులు 5,194కు పెరిగాయని పేర్కొన్నారు. ఇప్పటి వరకు అత్యధిక మరణాలు నమోదైన మహారాష్ట్రలో చర్యలను ముమ్మరం చేశామని చెప్పారు. పుణెలో 35 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో వైద్య బృందాలు ఇంటింటికి వెళ్లి మనిషి మనిషిని సర్వే చేస్తున్నాయని తెలిపారు. "మనం ఒక పెద్ద చాలెంజ్‌ను ఎదుర్కొంటున్నాం. కరోనా లక్షణాలు ఉన్న వ్యక్తులే కాకుండా కొద్ది సంఖ్యలోనే అయినా లక్షణాలు లేని వ్యక్తుల నుంచి కూడా వైరస్ ఇతరులకు సంక్రమిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది" అని చెప్పారు. యూపీలో ఇప్పటివరకు 343 కరోనా కేసులు నమోదయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని ఖర్గోన్ జిల్లాకు చెందిన ఒక కుటుంబంలో ఎనిమిది మందికి కరోనా వైరస్ సోకింది. ఆ కుటుంబంలో వ్యాపారం చేసే 49 ఏళ్ల వ్యక్తి దక్షిణాఫ్రికా వెళ్లాడు. తిరిగొస్తూ ఢిల్లీలోని నిజాముద్దీన్ తబ్లీగీ జమాత్‌కు హాజరయ్యాడు. గత నెల 19న ఇంటికి వచ్చాడు. అతనికి కరోనా సోకిందని గత వారం గుర్తించారు. అతని తల్లి ఈ నెల 4న చనిపోగా, కరోనాయే కారణమంటూ మెడికల్ రిపోర్టులు బుధవారం అందాయని వైద్య ఆరోగ్య విభాగం ముఖ్య అధికారి తెలిపారు. ఆ వ్యక్తి తండ్రి, ముగ్గురు మైనర్లు కూడా వైరస్ బారినపడిన వారిలో ఉన్నారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో తాజాగా మరో ఆరుగురికి కరోనా సోకింది. వీరిలో న్యూస్ చానల్ విలేకరి ఒకరు ఉన్నారు. పోలీసు అధికారి నుంచి ఆ విలేకరికి వైరస్ పాకిందని గుర్తించారు. భోపాల్‌లో మొత్తం కేసులు 91కి పెరిగాయి. ఢిల్లీలోని ద్వారక ప్రాంతంలో డీయూఎస్ఐబీ ఫ్లాట్లలో ఏర్పాటు చేసిన క్వారంటైన్ కేంద్రం నుంచి ఎవరో మూత్రం నింపిన సీసాలను విసిరారు. పంప్ హౌస్ వద్ద బహిరంగ ప్రదేశంలో రెండు సీసాలు పడి ఉండడాన్ని ఉద్యోగులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదయింది. ముంబైలో ఇప్పటి వరకు గుర్తించిన 590 మంది కొవిడ్-19 రోగుల్లో సగం మంది నాలుగు అడ్మినిస్ట్రేటివ్ వార్డులకు చెందిన వారే. కార్పొరేషన్ పరిధిలో ఇటువంటి వార్డులు 24 ఉన్నాయి. 282 కరోనా కేసులను డీ, ఈ, సీ-సౌత్, కే-వెస్ట్ వార్డుల్లో గుర్తించామని బృహన్‌ముంబై మునిసిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) తెలిపింది. ముంబై ప్రస్తుతం మహారాష్ట్రకే కాక దేశానికే కొవిడ్-19 హాట్‌స్పాట్‌గా మారింది. పుణెలో మరో ఆరుగురు కరోనా రోగులు మరణించారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో 30 మంది వైద్యులు, నర్సులు క్వారంటైన్‌కు... (బాక్స్)

ఢిల్లీ ఎయిమ్స్‌లోని కార్డియో-న్యూరో సెంటర్‌లో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు కలిపి 30 మందిని క్వారంటైన్‌కు వెళ్లాలని అధికారులు సూచించారు. రెండు రోజుల కిందట బ్రెయిన్ స్ట్రోక్ లక్షణాలతో 72 ఏళ్ల వృద్ధుడిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆయనకు సీటీ, ఎంఆర్ఐ వంటి పరీక్షలు నిర్వహించి, న్యూరాలజీ వార్డులో ఇతర రోగులతో పాటు ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఉన్నట్టుండి ఆయనకు శ్వాస తీసుకోవడం కష్టంగా మారింది. దీంతో ఛాతీ ఎక్స్-రే తీసి, వెంటిలేటర్ అమర్చారు. ఆయన నమూనాలు సేకరించి వైద్య పరీక్షలకు పంపగా ఆయనకు కరోనా వైరస్ సోకినట్లు నిర్ధారణ అయింది. ఆయనకు చికిత్స చేసిన వైద్యులు, నర్సులు, పరీక్షలు నిర్వహించిన టెక్నీషియన్లు క్వారంటైన్‌లోకి వెళ్లాల్సి వచ్చింది.

## తెలంగాణలో కొత్త కరోనా కేసులు 49

**ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్:** రాష్ట్రంలో కరోనా వైరస్ ఉధృతి కొనసాగుతోంది. బుధవారం కొత్తగా 49 కేసులు నమోదయ్యాయి. దాంతో మొత్తం కేసుల సంఖ్య 453కు చేరుకుంది. ఒక్క ఏప్రిల్ నెలలోనే 356 కేసులు నమోదు కావడం గమనార్హం. గడచిన వారం రోజులూ రోజుకు సగటున 45 కేసులు నమోదవుతున్నాయి. అయితే, ఆందోళన చెందాల్సిన పని లేదని, మరో రెండు మూడు రోజులు ఇలాగే కొనసాగి, అనంతరం పూర్తిగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం రంగారెడ్డి(17), హైదరాబాద్(11) జిల్లాల్లో అత్యధిక కేసులు నమోదయ్యాయి. యాక్టివ్ కేసుల సంఖ్య 397కు చేరగా, 45 మంది డిశ్చార్జ్ అయ్యారు. 11 మంది కరోనాతో చనిపోయారు. ఖమ్మంలో 65 ఏళ్ల విద్యుత్ శాఖ రిటైర్డు ఉద్యోగికి కరోనా పాజిటివ్ వచ్చింది. ఎనిమిదేళ్లుగా క్యాన్సర్‌తో బాధ పడుతున్న ఆయనకు ఏప్రిల్ 1 నుంచే జ్వరం వస్తోంది. మొదట ఖమ్మం ప్రభుత్వాసుపత్రిలో చేర్చారు. తర్వాత హైదరాబాద్ కేర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి అనుమానంతో గాంధీకి తరలించారు. నెగటివ్ వచ్చింది. దాంతో తిరిగి కేర్‌కు వచ్చారు. ఆరో తేదీన మరోసారి కరోనా పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. ఖమ్మంలో ఆయన బంధువుల్లో ఎవరైనా విదేశాలకు, ఢిల్లీకి వెళ్లివచ్చారా? అని ఆరా తీస్తున్నారు. ఎర్రగడ్డలోని ఛాతీ ఆస్పత్రిలో 36 కరోనా కేసులకు చికిత్సను అందిస్తున్నారు. ఇందులో 28 కరోనా పాజిటివ్ కేసులు. అందులో మూడు కొత్తగా వచ్చాయి. మరో ఎనిమిది మంది అనుమానిత కేసులకూ చికిత్స చేస్తున్నారు. వికారాబాద్ మధు కాలనీలో నమోదైన పాజిటివ్ కేసు ద్వారా మరో యువకుడికి కరోనా సంక్రమించింది. వైద్య పరీక్షల కోసం పంపించిన పలువురి నమూనాలు రావాల్సి ఉంది. నిర్మల్ జిల్లాలో కొత్తగా ఆరుగురికి పాజిటివ్ వచ్చింది. ముగ్గురు గల్ఫ్ నుంచి వచ్చి క్వారంటైన్ ఉన్నవారు. మరో వ్యక్తి బీహార్ వలస కూలీ. ఇటీవలే ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతూ గుండెపోటుతో మరణించిన సలీం అనే వ్యక్తి తల్లి, కూతురు కూడా కరోనా పాజిటివ్ అని తేలినట్లు అధికారులు వెల్లడించారు. మత ప్రచారానికి వచ్చిన వియత్నాం, మయన్మార్ పర్యటకులు 39 మందిపై నల్లగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. మార్చి 4న వియత్నాం దేశానికి చెందిన 12 మంది టూరిస్టు వీసాపై వచ్చారు. ఢిల్లీలోని తబ్లీక్ ఆర్గనైజర్లను కలిసి వారి ఆదేశాల మేరకు ఇద్దరు గైడ్లను వెంటపెట్టుకొని నల్లగొండకు వచ్చారు. మార్చి 9-19 తేదీలలో నల్గొండలో మత ప్రచారం నిర్వహించారు. మయన్మార్‌కు చెందిన 27 మంది అలాగే దొరికిపోయారు.

*Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.*

epaper.andhrajyothy.com